www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బిహార్‌లో ఉచిత విద్యుత్ పథకం

2

గృహ వినియోగదారులకు నెలకు 125 యూనిట్ల వరకూ ఉచితం.. సీఎం నితీశ్ కుమార్ వెల్లడి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోటాపోటీ హామీలు

తాము అధికారంలోకి వస్తే నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని ఇప్పటికే ఆర్జేడీ హామీ

శుక్రవారం | 18-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 93 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి సా.5.02 తదుపరి నవమి, నక్షత్రం: అశ్విని రా.2.14 తదుపరి భరణి, వర్జ్యం: రా.10.28-11.58, దుర్ముహూర్తం: ఉ.8.28-9.20, మ.12.47-1.38, అమృతఘడియలు: రా.7.27-8.57, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.53, సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రులు నిమ్మల, పయ్యావుల, ఎంపీ శబరి

నీళ్లపై గొడవలొద్దు

రెండు రాష్ట్రాలూ బాగుండాలి.. ఇచ్చిపుచ్చుకుందాం: చంద్రబాబు

మల్యాల నుంచి హంద్రీ-నీవాకు నీటి విడుదల

గోదావరి జలాలు వాడుకోమని తెలంగాణకు చెప్పాను

సీమ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.. హంద్రీ-నీవా కాలువతో 6 లక్షల ఎకరాలకు సాగునీరు.. 33 లక్షల మందికి తాగునీరు

భవిష్యత్‌లో శ్రీశైలం నుంచి తిరుమల వరకు కృష్ణా జలాలు

సీమ ప్రాజెక్టులకు 12 వేల కోట్లు ఖర్చుపెట్టిన ఘనత టీడీపీదే

జగన్ 2 వేల కోట్లూ పెట్టలేదు.. సీమను హార్టికల్చర్ హబ్ చేస్తాం

ఓర్వకల్లు-లేపాక్షి మధ్య ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలు

కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లకు 5,000 కోట్లు.. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ

త్వరలోనే కడప స్టీల్ పనులు.. కర్నూలులో హైకోర్టు బెంచ్ పెడతాం

మల్యాల వద్ద వేద మంత్రాలతో సీఎం పూజలు.. కృష్ణమ్మకు జలహారతి

> ఓ పార్టీకి రాయలసీమ అంటే రాజకీయం మాత్రమే. నాకు మాత్రం సీమ అంటే నీళ్లు, అభివృద్ధి. ఈ ప్రాంతంలో సాగుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అన్ని రంగాల్లో ముందుండేలా చూస్తాం.
>
> లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేసి రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. దానిని తప్పకుండా అమలు చేస్తాం. సీమలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏకి అత్యధిక మెజారిటీతో అందించిన విజయాన్ని ఎప్పటికీ మరువం. - సీఎం చంద్రబాబు

నంద్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 'నీళ్ల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి గొడవలూ అవసరం లేదు. ఇచ్చిపుచ్చుకునే రీతిలో వ్యవహరిద్దాం. రెండు రాష్ట్రాలూ బాగుండాలి. అవసరమైతే గోదావరి నీళ్లు వాడుకోమని తెలంగాణకు చెప్పాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద

మిగతా 13వ పేజీలో...

కేంద్రం పీఎం కిసాన్ డబ్బులు వేయగానే రైతుల ఖాతాల్లో అన్నదాత డబ్బులు

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

ఆ భూతం మళ్లీ వస్తే.. తమ పరిస్థితి ఏంటని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు

దానిని భూస్థాపితం చేస్తాం: సీఎం

వంశీకి సుప్రీం షాక్

జస్టిస్ హరినాథ్ ఇచ్చిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులు పక్కనపెట్టిన కోర్టు

రాష్ట్ర ప్రభుత్వ వాదనలను వినకుండానే ఆదేశాలు ఎలా ఇస్తారని ప్రశ్నించిన బెంచ్

పీటీ వారంట్స్ గురించి ఏదో అనబోగా.. వంశీ తరపు న్యాయవాదిపై ఆగ్రహం

ప్రభుత్వం వాదనలు సమగ్రంగా విని తీర్పునివ్వాలని హైకోర్టుకు ఆదేశాలు

4 వారాల్లో విచారణ ముగించాలని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వంశీకి ముందస్తు బెయిల్ ఇస్తూ ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందనే ఏపీ ప్రభుత్వ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. మైనింగ్ కేసులో వంశీ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ గత నెల 12వ తేదీన ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రూ.195 కోట్ల అక్రమ మైనింగ్ వ్యవహారంలో వంశీ ప్రధాన సూత్రధారి అని పేర్కొంది. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు

మిగతా 14వ పేజీలో...



మీడియాతో మాట్లాడుతున్న జనకుల శ్రీనివాసరావు

మమ్మల్ని మాఫియా గ్యాంగులతో పోలుస్తారా?

డీఐజీని డాన్ అంటారా.. డీజీపీని టార్గెట్ చేస్తారా?

జగన్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం మండిపాటు

చట్టానికి ఎవరూ అతీతులు కాదు

మీ ప్రభుత్వంలో పనిచేసిన పోలీసులే ఇప్పుడూ పనిచేస్తున్నారు

మీ హయాంలోనూ వీఆర్‌కు పంపారు

ఎంత మంది పోలీసు అధికారులను పక్కనపెట్టారో గుర్తుతెచ్చుకోండి

నిబంధనల మేరకు మీకు భద్రత కల్పిస్తున్నాం

జగన్‌కు సంఘం అధ్యక్షుడు జనకుల స్పష్టీకరణ

విజయవాడ (గాంధీనగర్), జూలై 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులను.. మాఫియా గ్యాంగులు, నేరస్థులతో పోలుస్తూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టుగా పేర్కొంది. గురువారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడారు. పోలీసులు ఏ రాజకీయ పార్టీలకూ అనుకూలంగా వ్యవహరించరన్నారు. పారదర్శకంగా చట్టాలను అమలు చేస్తున్న తమను అవమానకరంగా,

మిగతా 14వ పేజీలో...

చినుకు లేక చింత

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

మందకొడిగా రుతుపవనాలు.. చాలీచాలని వర్షాలు

లోటు వర్షపాతంతో అన్నదాత విలవిల.. తడులకు నోచని మెట్ట పైర్లు

జూన్ 1 నుంచి జూలై 16 వరకు.. కురిసిన వర్షం 107.7 మిల్లీమీటర్లే

మొత్తంగా 37.5% వానలోటు.. 7.21 లక్షల హెక్టార్లలోనే సాగు

ఇప్పటికైనా విస్తారంగా కురిస్తే సాగు పుంజుకునే అవకాశం

3



కృష్ణా జిల్లా చోరగుడి పరిధిలోని పిచ్చుకలపాడు-గూడపాడు రోడ్డులో నీరులేక బీటలు వారిన వరి నాటు వేసిన పొలం

నేడూ రేపు భారీ వర్షాలు

13

23 వరకూ కొనసాగే అవకాశం

పలుచోట్ల పిడుగులూ పడే ప్రమాదం



దుబాయ్ బంధం నిజమే

తెలంగాణ ట్యాపింగ్ నిందితుడి ఫ్లాట్‌లోనే లిక్కర్ స్కామ్ దొంగల మకాం

చాణక్యతో పాటు మరో నలుగురూ అదే ఫ్లాట్‌లో శ్రవణ్ రావు కూడా బస

ఫ్లాట్ ఇచ్చింది రెంటల్ ఏజెన్సీ కాదు.. శ్రవణ్‌రావే

వివరాలు టవర్ రిజిస్టర్‌లో నమోదు

సహ యజమాని ఆకర్ష్‌కు అద్దె వాటా చెల్లించని తీరు

22న విచారణకు రావాలని ఆకర్ష్‌కు సిట్ నోటీసు



దుబాయ్‌లో నిందితులు ఉన్న టవర్

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌రావు ఫ్లాట్‌లో ఏపీ లిక్కర్ స్కామ్ నిందితులు ఉన్నారంటూ 'ఆంధ్రజ్యోతి' రాసిన కథనం అక్షర సత్యమైంది. దుబాయ్‌లోని ఖరీదైన ప్రాంతంలో శ్రవణ్‌రావు మరొకరితో కలిసి కొనుగోలు చేసిన ఫ్లాట్‌లోనే లిక్కర్ స్కామ్ నిందితులు మకాం వేసినట్టు తేలింది. మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డికి సన్నిహితంగా ఉంటూ వ్యవహారం నడిపిన చాణక్య బూనేటి, మరో నలుగురు ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు ఆ ఫ్లాట్‌లోనే ఉన్నారని వెల్లడైంది. ఆ ఫ్లాట్‌ను

మిగతా 14వ పేజీలో...



ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ

అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించిన మరుసటి రోజే సమావేశం

బీజేపీతో శివసేన(యూబీటీ) మళ్లీ దోస్తీనా?

మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ

ముంబై, జూలై 17: మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయా? ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ బీజేపీతో కలవనున్నారా? అంటే తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే గురువారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ అయ్యారు. విధాన మండలి చైర్మన్ రామ్ శిందే కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో...



2

నటి రన్యారావుకు ఏడాది జైలు

శిక్షా కాలంలో బెయిల్‌కు అవకాశం లేదు

బంగారం స్మగ్లింగ్ కేసులో 'కొఫెపోసా' అడ్వైజరీ బోర్డు తీర్పు



13

శ్రీలక్ష్మి ఎన్ని వేల కోట్లు లంచమడిగారు?

ఓఎంసీ కేసులో తెలంగాణ హైకోర్టు ప్రశ్న

సైబర్ నేరగాళ్లకు చెక్!



ఆకే రవికృష్ణ

ఆన్‌లైన్ మోసాల కట్టడికి సైబర్ వింగ్

ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో ఏర్పాటు

ఇందులో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు

అధునాతన సైబర్ టూల్స్‌తో రంగంలోకి

అచ్యుతాపురం, సామర్లకోట ఘటనలతో డీజీపీ గుప్తా అప్రమత్తం.. వింగ్‌కు శ్రీకారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సైబర్ నేరగాళ్లు విసురుతున్న సవాల్‌ను ఎదుర్కొనేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఎక్కడో ఉంటూ రోజుకో కొత్త తరహా ఎత్తుగడతో మోసాలకు పాల్పడుతున్న బూచోళ్ల ఆట కట్టించబోతున్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పోలీసు యంత్రాంగం ప్రత్యేక సైబర్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణ ఆధ్వర్యంలో టెక్ నిపుణులైన పోలీసులను

మిగతా 14వ పేజీలో...

2021లో ఏపీలో సైబర్ నేరగాళ్లు దోచింది 34 కోట్లు.. 2024లో ఏకంగా 974 కోట్లు దోపిడీ

మరోవిడత నామినేటెడ్ పదవులు

66 ఏఎంసీలకు చైర్మన్లు ఖరారు

53 టీడీపీ, 9 జనసేన, 4 బీజేపీ

3

కొత్తగా 39,473 కోట్ల పెట్టుబడులు

22 ప్రాజెక్టులు.. 30,899 ఉద్యోగాలు

ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ

ఆతిథ్య రంగంలో సేవలు విస్తరించాలి: సీఎం

12

15 వేల ఎన్‌కౌంటర్లు.. 238 మంది హతం

» 2017 నుంచి యూపీలో బుల్లెట్ రాజ్..!

» శాంతిభద్రతలు నియంత్రణలో ఉన్నాయంటున్న డీజీపీ

లఖ్‌నవూ, జూలై 17: శాంతిభద్రతలు గాడితప్పుతూ.. గూండారాజ్ కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితులను 'బుల్లెట్ రాజ్'తో అదుపులోకి తీసుకువచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. 2017లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి ఇప్పటి వరకు మొత్తం 14,973 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 238 మంది మృతిచెందారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో 9,467 మంది నేరగాళ్లకు గాయాలవ్వగా.. 30,694 మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అరెస్టయ్యారు. ఈ గణాంకాలపై ఉత్తరప్రదేశ్ డీజీపీ రాజీవ్ కృష్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2017 నుంచి తీసుకున్న కఠిన చర్యలతో ఇప్పుడు దేశంలోనే యూపీ అత్యంత సురక్షిత రాష్ట్రాల్లో ఒకటిగా ఉందన్నారు.

డిజిటల్ అరెస్టు భయంతో కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

» బెదిరించి రూ.11 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఆగడాలకు విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి కె.కుమార్(48) బలయ్యాడు. కర్ణాటకలోని రామనగర్ జిల్లా చెన్నపట్టణ తాలూకా మళూరు హోబళి కలగేరి గ్రామానికి చెందిన కె.కుమార్ బెంగళూరు హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన గ్రూపు-డి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కుమార్ మొబైల్‌కు ఓ వ్యక్తి కాల్ చేశాడు. విక్రమ్ గోస్వామిగా పరిచయం చేసుకుని, ఓ కేసులో అరెస్టు వారెంట్ జారీ అయిందని చెప్పాడు. ఆ కేసు నుంచి పేరు తొలగించాలంటే తన ఖాతాలో రూ.1.95 లక్షలు జమ చేయాలని సూచించాడు. కేసు అనగానే భయపడిన కుమార్, డబ్బులు సమకూర్చుకుని సైబర్ నేరగాడి ఖాతాలో జమచేశాడు. అంతటితో ఆగని సైబర్ నేరగాళ్లు.. వెంటనే రూ.2.75 లక్షలు సమకూర్చాలని, లేకుంటే మరో రోజులోనే అరెస్టు చేస్తామని బెదిరించారు. ఇలా పలుమార్లు బెదిరింపు కాల్స్ రావడంతో కుమార్ దాచుకున్న సొమ్ముతోపాటు పలువురి వద్ద అప్పు చేసి సైబర్ నేరగాళ్లకు రూ.11 లక్షల దాకా ఇచ్చాడు. అయినా వేధింపులు ఆగలేదు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన స్వగ్రామానికి వెళుతున్నాని భార్యకు చెప్పి బెంగళూరు నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు స్వగ్రామంలోని సొంత పొలంలోనే చెట్టుకు ఉరివేసుకున్నట్టు గుర్తించారు. మృతుడి జేబులో సూసైడ్ నోట్ లభించింది. సీబీఐ పేరుతో వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని అందులో పేర్కొన్నాడు.

రాబర్ట్ వాద్రా ఆస్తులు ఈడీ స్వాధీనం

» రూ.37 కోట్లు విలువ చేసే 43 ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, జూలై 17: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా(56)కు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకొంది. ఆయన వ్యక్తిగత, కంపెనీలకు చెందిన రూ.37.64 కోట్లు విలువ చేసే 43 ఆస్తులను అటాచ్ చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. హరియాణాలోని షికోహ్‌పూర్ గ్రామంలో జరిగిన ఆస్తి అమ్మకంలో నగదు అక్రమ చలామణికి పాల్పడినట్టు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఆస్తులను స్వాధీనం చేసుకొని ఆయనపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది.

దుబాయ్‌లో 10 రోజుల 'వివాహ సెలవు'

దుబాయ్, జూలై 17: దుబాయ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పది రోజుల పాటు 'వివాహ సెలవు'ను మంజూరు చేస్తున్నట్టు దేశ పాలకుడు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రధాని, ఉపాధ్యక్షుడు అయిన షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. ఈ పది రోజుల పాటు పూర్తి వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఈ సెలవులను కేవలం వివాహ సమయంలో మాత్రమే కాకుండా ఏడాదిలో ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేక పరిస్థితిల్లో మరుసటి సంవత్సరం కూడా వినియోగించుకునే వీలుంది. ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఉద్యోగులు యూఏఈ పరిధిలోని వ్యక్తులను తగిన అనుమతులతో వివాహం చేసుకున్నప్పుడు మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయి.

బలూచ్ దాడుల్లో..39 మంది పాక్ సైనికుల హతం

ఇస్లామాబాద్, జూలై 17: బలూచిస్తాన్ తిరుగుబాటుదారుల వరుస దాడులతో పాకిస్థాన్ సైన్యం ఉక్కిరిబిక్కిరవుతోంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ), బలూచ్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) బుధవారం జరిపిన వేర్వేరు దాడుల్లో 39 మంది పాకిస్థాన్ సైనికులు మృతి చెందినట్లు తెలుస్తోంది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్.. కరాచీ నుంచి క్వెట్టా వెళ్తున్న సైనిక బస్సును లక్ష్యంగా చేసుకుని ఐఈడీతో పేల్చివేసింది. ఈ ఘటనలో 29 మంది సైనికులు మరణించగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కలాత్, జహూ, హజర్‌గంజ్ ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో 10 మంది సైనికులను హతమార్చినట్లు బీఎల్ఎఫ్ ప్రకటించింది.

ఇరాక్‌లో భారీ అగ్నిప్రమాదం.. 60 మంది దుర్మరణం

బాగ్దాద్, జూలై 17: ఇరాక్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తూర్పు ఇరాక్‌లో ఇటీవలే ప్రారంభించిన కొత్త షాపింగ్ మాల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 60 మందికిపైగా దుర్మరణం చెందారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారని గురువారం అధికారులు తెలిపారు. కుట్ నగరంలో బుధవారం రాత్రి ఈ అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. రంగంలోకి దిగిన పౌర రక్షణ సిబ్బంది మాల్‌లో చిక్కుకుపోయిన 45 మంది పైగా ప్రజలను కాపాడారు. మరికొంత మంది ఆచూకీ లభ్యం కాలేదని ఇరాకీ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

బ్రిటన్‌లో 16 ఏళ్లకే ఓటు హక్కు.. ప్రభుత్వ యోచన

లండన్, జూలై 17: బ్రిటన్‌లో వచ్చే సాధారణ ఎన్నికల నుంచి ఓటు హక్కు వయసును 16 ఏళ్లకు తగ్గించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రతిపాదన పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉందని, దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందని ప్రభుత్వం పేర్కొంది. దేశంలో ఇప్పటికే 16, 17 ఏళ్ల యువత శ్రామికశక్తిలో, సైన్యంలో భాగం పంచుకుంటోందని, వారికి మరింత న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను తీసుకొచ్చామని తెలిపింది.

తొక్కిసలాటకు ఆర్సీబీనే కారణం!

» పోలీసులు, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోలేదు

» హైకోర్టుకు సమర్పించిన నివేదికలో కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాటకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టే ప్రధాన కారణమని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. ఆర్సీబీ యాజమాన్యం పోలీసుల అనుమతి లేకుండా విజయోత్సవ వేడుకకు ఏర్పాట్లు చేసిందని, ఆ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అభిమానులను ఆహ్వానిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన వీడియో సందేశం కూడా ఈ దుర్ఘటనకు కారణమని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. విజయోత్సవ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వం నుంచిగానీ, పోలీసు శాఖ నుంచిగానీ ఆర్సీబీ పాలకమండలి అనుమతులు పొందలేదని తెలిపింది. అకస్మాత్తుగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో ఒక్కసారిగా భారీగా తరలివచ్చారని, స్టేడియంలోకి ప్రవేశించే క్రమంలో తొక్కిసలాట జరిగిందని వివరించింది. అభిమానులు భారీగా తరలివచ్చేలా ఆహ్వానించిన ఆర్సీబీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నట్లు నివేదికలో స్పష్టం చేసింది. ఈ దుర్ఘటనకు ఆర్సీబీతోపాటు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ), డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బాధ్యత వహించాలని ఆ నివేదికలో తెలిపింది. ఈ ఏడాది జూన్ 3న జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను చిత్తుచేసిన ఆర్సీబీ తొలిసారిగా ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో జూన్ 4న నిర్వహించిన విజయోత్సవ వేడుక సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా.. అనేకమంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనపై నమోదైన కేసులో కర్ణాటక ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఈ నివేదికను రహస్యంగా ఉంచాలని ప్రభుత్వం హైకోర్టుకు విన్నవించింది. కానీ అలా చేయాలని చట్టంలో ఎక్కడా లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

బిహార్‌లో ఉచిత విద్యుత్ పథకం

» అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీల పోటాపోటీ హామీలు

పట్నా, జూలై 17: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. రాష్ట్ర ప్రజలకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ ఉచిత విద్యుత్ పథకం ప్రకటించారు. గృహ వినియోగదారులందరికి ప్రతినెల 125 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తామని గురువారం సోషల్ మీడియా వేదికగా తెలిపారు. దీనివల్ల 1.67 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఉచిత విద్యుత్ పథకం ఆగస్టు నుంచే అమల్లోకి రానున్నదని కూడా ఆయన తెలిపారు. అంటే జూలై నుంచే 125 యూనిట్ల విద్యుత్ వాడకంపై బిల్లు వసూలు చేయరు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు చౌకగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని నితీశ్ కుమార్ వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో 'కుటీర్ జ్యోతి యోజన' పథకం కింద రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాగా, గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వల్ల.. ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.16 వేల కోట్ల భారం పడుతుందని డిప్యూటీ సీఎం-బీజేపీ నేత సామ్రాట్ చౌదరి మీడియాకు చెప్పారు. మరోవైపు, ఇండియా కూటమికి సారథ్యం వహిస్తున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్.. తమకు అధికారమిస్తే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తామని ఇంతకు ముందే ప్రకటించడం గమనార్హం.

నాడు నోట్ల రద్దు.. నేడు ఓట్ల రద్దు

» బిహార్‌లో భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ద్వారా రిగ్గింగ్‌కు కుట్ర: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 17: ఓటర్ల నుంచి ఓటు హక్కును లాక్కోవటం ద్వారా బిహార్ ఎన్నికల్లో భారీ ఎత్తున రిగ్గింగ్ చేయటానికి కుట్ర జరుగుతోందని, దాంట్లో భాగంగానే ఎన్నికల సంఘం (ఈసీ) ఆ రాష్ట్రంలో 'ఓటర్ల జాబితా సవరణ' (సర్)ను చేపట్టిందని కాంగ్రెస్ ఆరోపించింది. గతంలో నోట్లరద్దు చేసిన ప్రధాని మోదీ ఇప్పుడు బిహార్‌లో ఓట్లరద్దుకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తింది. గురువారం ఈ అంశంపై ఆ పార్టీ నేతలు పలువురు ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. 'సర్ పేరుతో ఓట్లను దొంగిలిస్తూ ఈసీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. చేసేదేమో దొంగతనం.. పేరు మాత్రం సర్. దీనిని బట్టబయలు చేసిన వారి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు' అంటూ రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు.

లోకం తీరు



వీసా.. గోస!

వ్యవస్థీకృతంగా మారిపోయిన వీసా మోసాలు

» త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామంటూ అమాయకుల నుంచి లక్షల్లో వసూళ్లు

» నకిలీ, ఫోర్జరీ పత్రాలతో విదేశాలకు..

» అక్కడ పట్టుబడి కేసులు, జైళ్ల పాలవుతున్న బాధితులు

» గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు తయారు చేసిన ఓ ఢిల్లీ ముఠా

» డబ్బులూ పోయి, విదేశాల్లో ఉద్యోగం ఆశలూ ఆవిరై కుంగిపోతున్న బాధితులు



న్యూఢిల్లీ, జూలై 17: ఉన్న ఊరిలో ఉపాధి లేక.. ఉన్నా సంపాదన సరిపోక.. ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారు ఎందరో. వారి ఆశలను సొమ్ము చేసుకుని, నకిలీ వీసాలతో వారి కలలను కల్లలు చేస్తున్న ముఠాలు పెరిగిపోయాయి. లక్షలకు లక్షలు వసూలు చేసి తప్పుడు, ఫోర్జరీ పత్రాలు, నకిలీ వీసాలతో విదేశాలకు పంపుతున్నాయి. ఉద్యోగాలపై ఆశతో వెళ్లినవారు అసలు విషయం తెలిసి గుండెలు బాదుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా వ్యవస్థీకృతంగా సాగుతున్నట్టు ఇటీవల బయటపడిన నకిలీ వీసా రాకెట్ బాగోతాల్లో వెలుగు చేసింది. మన దేశంలో హైదరాబాద్‌తోపాటు ముంబై, బెంగళూరు, సూరత్, గాంధీనగర్, ఢిల్లీలలో పలు ముఠాలు అధికారులకు పట్టుబడ్డాయి. ఈ ముఠాలు రూ.23 లక్షల నుంచి రూ.67 లక్షల వరకు వసూలు చేసి.. నకిలీ వీసాలు, స్పాన్సర్ ఐడీ, ఇతర అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసి వందలాది మందిని గల్ఫ్, యూరప్ దేశాలకు పంపినట్టు వెల్లడైంది.

పెరిగిపోతున్న వీసా మోసాలు

ఈ ఏడాది మొదట్లో నకిలీ షెంజెన్ వీసా (29 యూరప్ దేశాల ఉమ్మడి వీసా)తో దుబాయ్ వెళుతున్న ఏడుగురిని ముంబై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో హైర్‌గ్లో ఎలిగాంట్ ఓవర్సీస్ ఇంటర్నేషనల్ అనే సంస్థ 300 మందిని ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో మోసం చేసిన విషయం బయటికి వచ్చింది. ఢిల్లీలోని ఓ ముఠా గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు, ఫోర్జరీ పత్రాలతో రూ.300 కోట్ల మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి తప్పుడు వీసాలతో వందలాది మందిని గల్ఫ్ దేశాలకు పంపిన సంగతి గతంలోనే బయటపడింది. కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు, కొందరు ఏజెంట్లపై అమెరికా విదేశాంగ శాఖ నిషేధం విధించిందంటే.. ఈ ముఠాలు అంతర్జాతీయంగా ఎంత వ్యవస్థీకృతంగా విస్తరించాయో అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

రకరకాలుగా మభ్యపెట్టి..

సాధారణంగా ఉద్యోగ వీసాల కోసం చాలా తతంగం ఉంటుంది. విదేశాల్లోని సంస్థలు, వ్యక్తులు సదరు వ్యక్తికి తాము ఉద్యోగమిస్తామని స్పాన్సర్‌షిప్ పత్రాలు ఇవ్వాలి. ఆ తర్వాత వీసా కోసం దరఖాస్తు, విద్యార్హత, ఆరోగ్య ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాల సమర్పణ, సంబంధిత దేశ రాయబార కార్యాలయంలో ఇంటర్వ్యూ.. ఇలా ఎన్నో ఉంటాయి. ఇందుకోసం సమయం పడుతుంది. అయితే నకిలీ వీసా ముఠాలు.. తాము త్వరగా స్పాన్సర్‌షిప్ పత్రాలు, వీసాలు ఇప్పిస్తామంటూ గాలం వేస్తున్నాయి. వీటిలో చాలా వరకు ఎలాంటి లైసెన్స్ లేనివే. విదేశాలకు ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లాలనుకునేవారిని.. స్థానికంగా ఉండే మధ్యవర్తులు, ఏజెంట్ల సాయంతో గుర్తిస్తున్నాయి. ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో పర్యాటక వీసాలపై విదేశాలకు పంపుతున్నాయి. అధికారులు కూడా క్షుణ్నంగా పరిశీలిస్తే తప్ప గుర్తించలేని స్థాయిలో ఈ నకిలీ పత్రాలు ఉంటుండటం గమనార్హం. కొన్నిసార్లు ఇక్కడే విమానం ఎక్కే ముందే నకిలీ, ఫోర్జరీ విషయం బయటపడుతోంది. ఇలాంటివారు లక్షలకు లక్షలు డబ్బులు పోగొట్టుకుని, పైగా ఉద్యోగం ఆశలు ఆవిరై ఆందోళనలో పడుతున్నారు.

విదేశాల్లో కష్టాలు పడుతూ..

నకిలీ వీసాలు, ఇతర పత్రాలతో వెళ్లినవారు విదేశాల్లో అధికారుల తనిఖీల్లో పట్టుబడి కష్టాల పాలవుతున్నారు. కేసులు, జైళ్ల పాలవుతున్నారు. కొన్నిసార్లు స్వదేశాలకు తిప్పిపంపేస్తున్నా.. మళ్లీ ఆ దేశంలోకి రాకుండా నిషేధం ఎదుర్కొంటున్నారు. ఇలా నకిలీ వీసాలు, పత్రాలతో విదేశాలకు పంపుతున్న ట్రావెల్ ఏజెన్సీలు, ఏజెంట్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా... మోసాలు మరింతగా పెరిగిపోతూనే ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. విదేశాంగ శాఖ నుంచి లైసెన్సు పొందిన సంస్థలు, ఏజెంట్ల ద్వారా వెళితే మోసపోకుండా ఉండవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయా దేశాలకు చెందిన అధికారిక వెబ్‌సైట్లలో వీసా ప్రక్రియ, స్పాన్సర్‌షిప్ విధానం, ఇతర అంశాలను పరిశీలించాలని సూచించింది. మోసపోయినట్టు గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది.

ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

వీరిద్దరూ సమావేశం అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పక్షం వైపు రావాలంటూ ఉద్ధవ్‌ను ఫడణవీస్ ఆహ్వానించిన మరుసటి రోజే వీరిద్దరూ భేటీ కావడం గమనార్హం. బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఫడణవీస్ మాట్లాడుతూ.. "2029 వరకు మేం ప్రతిపక్షంలోకి వెళ్లే అవకాశం లేదు. కాబట్టి ఉద్ధవ్ జీ అధికార పక్షం వైపు వచ్చే అవకాశాన్ని పరిశీలించాలి" అని అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన స్నేహం 2014 వరకు అప్రతిహతంగా సాగింది. 25 ఏళ్ల పాటు కలిసి సాగిన ఈ రెండు పార్టీల మధ్య 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సందర్భంగా విభేదాలు వచ్చాయి. అనంతరం 2019 ఎన్నికల్లో గెలిచాక బీజేపీకి ఝలక్ ఇచ్చిన ఉద్ధవ్.. కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ఫడణవీస్.. ఉద్ధవ్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. 2022లో ఏక్‌నాథ్ శిందేతో తిరుగుబాటు చేయించి, శివసేనను చీల్చి.. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. శిందే రెండేళ్లకు పైగా మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన (శిందే) కూటమి రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేయడంతో ఫడణవీస్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలు విషయంలో కూటమి సర్కారుపై ఉద్ధవ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఫడణవీస్.. ఉద్ధవ్‌ను అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



నటి రన్యారావుకు ఏడాది జైలు

» ఈ కాలంలో బెయిల్‌కు నో చాన్స్

» బంగారం స్మగ్లింగ్ కేసులో 'కొఫెపోసా' అడ్వైజరీ బోర్డు తీర్పు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కన్నడ నటి రన్యారావు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ పట్టుబడ్డ కేసులో కఠినమైన కొఫెపోసా చట్టం కింద ఆమెకు ఏడాది జైలుశిక్ష పడింది. ఈ మేరకు విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ చట్టం (కొఫెపోసా) అడ్వైజరీ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్బంధ కాలంలో ఆమెకు బెయిల్ మంజూరు ఉండబోదని తాజాగా తీర్పునిచ్చింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చట్టబద్ధంగా నిర్దేశించిన కాలపరిమితిలో చార్జిషీట్ దాఖలు చేయడంలో విఫలం కావడంతో.. సహ నిందితుడు తరుణ్ రాజుతో పాటు రన్యారావుకు సిటీ కోర్టు మే 20న డిఫాల్ట్ బెయిల్ ఇచ్చింది. రూ.2 లక్షల బాండ్, ష్యూరిటీ షరతులపై బెయిల్ మంజూరైనప్పటికీ.. కొఫెపోసా కింద ముందస్తు నిర్బంధం ఉత్తర్వుల కారణంగా ఇద్దరూ కస్టడీలోనే కొనసాగారు. అక్రమ రవాణా కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే అనుమానంపై, అధికారిక అభియోగాలు లేకుండానే ఏడాది పాటు నిర్బంధంలో ఉంచేందుకు ఇది వీలు కల్పిస్తుంది. రన్యారావు ఈ ఏడాది మార్చిలో దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన 14.2 కేజీల బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. రన్యారావు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను స్థానిక కోర్టులు రెండుసార్లు, ఆ తర్వాత కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది.

పృథ్వి, అగ్ని క్షిపణుల ప్రయోగం విజయవంతం

బాలాసోర్ (ఒడిశా), జూలై 17: ఒడిశా సముద్ర తీరంలో గురువారం లఘు శ్రేణి బాలిస్టిక్ క్షిపణులైన పృథ్వి-2, అగ్ని-1లను విజయవంతంగా ప్రయోగించినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఆ క్షిపణులు సాంకేతికపర, నిర్వహణపర ప్రమాణాలను అందుకున్నాయని పేర్కొన్నాయి. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగాలు జరిగాయి. తొలుత అబ్దుల్ కలాం దీవి నుంచి అగ్ని-1ను ప్రయోగించారు. అనంతరం చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లోని మూడో లాంచ్ ప్యాడ్ నుంచి పృథ్వి-2 ప్రయోగం నిర్వహించారు.

ఎయిర్‌పోర్టుకు పక్షి పోటు!

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ పరిధిలో 5 నెలల వ్యవధిలో పక్షులు 'ఢీ' కొన్న ఘటనలు 49 సాంకేతిక సమస్యలతో ఐదు సార్లు 'మే'డే కాల్స్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)


మేటి విమానాశ్రయాల్లో ఒకటిగా పేరొందిన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పక్షుల బెడద పట్టి పీడిస్తోంది! ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకూ.. అంటే 5 నెలల వ్యవధిలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో విమానాలను పక్షులు ఢీ కొన్న ఘటనలు ఈ విమానాశ్రయంలో 49 జరిగినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించింది. అంతేకాదు.. ఈ ఏడాది జనవరి నుంచి మే చివరి దాకా దేశంలో 11మేడే కాల్స్‌ను (ఆకాశంలో విమానం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు గ్రౌండ్‌కు ఇచ్చే సంకేతం. ఇటీవల అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయే ముందు కూడా పైలట్లు ఇలా మేడే కాల్ ఇచ్చారు) డీజీసీఏ నిర్ధారించగా.. వాటిలో ఐదు మన హైదరాబాద్ గగనతలంలో ఉన్న విమానాల నుంచి వచ్చినవి కావడం గమనార్హం. విమానాశ్రయాల్లో ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పక్షులు/జంతువులు ఢీకొన్న సంఘటనలు ఏటా దేశవ్యాప్తంగా 2వేలదాకా నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. గణాంకాల ప్రకారం.. ఢిల్లీ, అహ్మదాబాద్ విమానాశ్రయాల్లో పక్షుల బెడద ఎక్కువగా ఉంది. విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు.. ఢిల్లీలో ఏటా సగటున 400 దాకా నమోదవుతున్నాయి. అక్కడ ఈ ఏడాది జనవరి 1 నుంచి మే నెలాఖరు వరకూ 95 ఘటనలు అలాంటివి నమోదయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయ పరిధిలో జనవరినుంచి మే వరకు 49 పక్షులు ఢీకొన్న ఘటనలు జరిగాయి. 2022లో ఇలాంటి ఘటనలు 92 జరగ్గా.. ఆ తరువాత 2023లో 136, 2024లో 143 నమోదయ్యాయి. ఇవి విమానయాన భద్రతపైఆందోళన కలిగిస్తున్నాయి.

ఎన్ని చర్యలు తీసుకున్నా..

పక్షుల బెడద తగ్గించేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ పలు చర్యలు తీసుకుంటోంది. రన్‌వే సమీపంలో పక్షులను నియంత్రించేందుకు అధిక తరంగదైర్ఘ్యంతో శబ్దాలు చేసే స్పీకర్లను ఏర్పాటు చేశారు. పక్షుల కోసమే తయారు చేసిన ఈ పరికరాలు నిరంతరం పనిచేస్తుంటాయి. అలాగే.. పక్షులను భయపెట్టేందుకు రన్‌వేలకు రెండు వైపులా ప్రతి 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో టపాసులు కాలుస్తున్నారు. ఇందుకోసం నిరంతరం కొందరు పనిచేస్తుంటారు. దీంతో పాటు చుట్టు పక్కల పక్షులు చేరకుండా ఎప్పటికప్పుడు గడ్డి తొలగిస్తుంటారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సాధ్యమైనంత వరకు చెత్త, కుళ్లిన ఆహార పదార్థాలు ఓపెన్ నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఎయిర్ పోర్టు పరిసరాల్లో ముఖ్యంగా కాటేదాన్, జల్‌పల్లి ప్రాంతాల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పరిశ్రమల వల్ల పక్షుల బెడద పెరుగుతున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతాల్లో కొందరు.. నిబంధనలకు విరుద్ధంగా జంతు కళేబరాలు, ఇతర వ్యర్థ పదార్థాల నుంచి నూనె తీసే పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వీటి వల్ల పక్షుల బెడద పెరుగుతోంది. అయినా వాటిని మూసివేయించాలని ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



విడుదలకు సిద్ధం

ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వంలో లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మించారు. తాజాగా, ఈ సినిమాను ఆగస్టు 8న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "హంగర్ కామెడీ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: బాల సరస్వతి, సంగీతం: వికాస్ బడిస.

ఆయనతో నటించడం నా అదృష్టం

\- నిధి అగర్వాల్



'పవన్ కల్యాణ్‌తో కలసి నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న పవన్ సినిమా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవుతుంది. వేరే వంద సినిమాలు చేసినా ఒకటే...పవన్ కల్యాణ్‌తో ఒక్క సినిమా చేసినా ఒకటే. ఈ ప్రయాణంలో ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నా' అని అన్నారు హీరోయిన్ నిధి అగర్వాల్. ఆమె కథానాయికగా నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు 'పంచమి'. చాలా శక్తిమంతమైన పాత్ర అది. పాత్రకు తగ్గట్టుగా స్టైలిస్ట్ ఐశ్వర్య దుస్తులను, ఆభరణాలను అద్భుతంగా రూపొందించారు. పవన్ కల్యాణ్‌కి, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు బాగుంటాయి.
- డైరెక్టర్ క్రిష్ నన్ను 'పంచమి' పాత్రకు ఎంపిక చేశారు. అలాగే జ్యోతి కృష్ణ సరైన సమయానికి దర్శకత్వ బాధ్యతలు తీసుకొని సినిమాని పూర్తి చేశారు.
- ఏ.ఎం.రత్నం గొప్ప నిర్మాత. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వెనకడుగు వేయలేదు. సినిమాని నమ్మి ఇన్నేళ్ళు బలంగా నిలబడ్డారు. చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.
- ట్రైలర్ రాకముందు కొందరు ఈ సినిమా ఎలా ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేశారు. అందరి అనుమానాలను ట్రైలర్ పటాపంచలు చేసింది. ఈ సినిమాలో భరతనాట్యం నేపథ్యంలో ఒక సన్నివేశం ఉంటుంది. ఆ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ఛాలెంజింగ్‌గా అనిపించింది.
- పీరియాడికల్ సినిమాలకు కీరవాణి పెట్టింది పేరు. పైగా ఆస్కార్ విజేత. వీరమల్లుకి అద్భుతమైన సంగీతం అందించారు. ముఖ్యంగా నేపథ్య సంగీతం గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. 'తార తార', 'కొల్లగొట్టినాదిలో' పాటలు నాకు బాగా నచ్చాయి.



ఐవోసీఎల్ అందించిన సీటీ సిమ్యులేటర్‌ను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

అత్యున్నత వైద్య సేవా సంస్థగా స్విమ్స్

- తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం: టీటీడీ చైర్మన్
- రూ.22.01 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేసిన ఐవోసీఎల్

తిరుపతి(వైద్యం), జూలై 17(ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేదలకు అత్యున్నతమైన వైద్యసేవలు అందించే వైద్య సేవా సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దేందుకు టీటీడీ కృషి చేస్తుందని బీఆర్‌నాయుడు తెలిపారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్) రూ.22.01 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేసింది. అధునాతన ఎంఆర్ఐ స్కానర్, 4డీ సీటీ సిమ్యులేటర్ సిస్టంలను ఐవోసీఎల్ ప్రతినిధులతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ప్రారంభించారు. ఇప్పటికే ఏటా రూ.140 కోట్లను స్విమ్స్ అభివృద్ధికి, రోగులకు మెరుగైన వైద్య సేవలకు టీటీడీ అందిస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఐవోసీఎల్ రూ.14 కోట్ల విలువైన టెస్లా ఎమ్ఆర్ఐ స్కానర్‌ను, మరో రూ.8 కోట్లతో 4డి సీటీ సిమ్యులేటర్ సిస్టంను అందించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్విమ్స్‌కు ఈ వైద్య పరికరాలను అందించినట్లు ఐవోసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు.

ఎయిమ్స్‌లో పీఐసీయూ, ఎన్ఐసీయూ సేవలు ప్రారంభం



ఎయిమ్స్‌లో పీఐసీయూ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న సీఈవో శాంతాసింగ్

మంగళగిరి సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ), నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లను గురువారం ప్రారంభించారు. ఇన్ పేషెంట్ బ్లాకులోని మూడో అంతస్థులో ఏర్పాటు చేసిన ఈ కాంప్లెక్స్‌ను ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో అహంతెం శాంతాసింగ్ లాంఛనంగా ప్రారంభించారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో కూడిన పీఐసీయూ, ఎన్ఐసీయూ సేవలు పిల్లలకు మెరుగైన వైద్యం అందించేందుకు దోహదం చేస్తాయని ఆయన చెప్పారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులు, చిన్నారులకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

పంటలు ఎండు ముఖం.. రైతులు బిక్కమొగం

- మందకొడిగా రుతుపవనాలు.. చాలీచాలని వర్షాలు
- లోటు వర్షపాతంతో అన్నదాత విలవిల
- తడులకు నోచని మెట్ట పైర్లు
- జూన్ 1 నుంచి జూలై 16 వరకు కురిసిన వర్షం 107.7 మిల్లీమీటర్లే
- మొత్తంగా 37.5% వానలోటు
- 7.21 లక్షల హెక్టార్లలోనే సాగులోకి వివిధ పంటలు
- 3.21 లక్షల హెక్టార్లలో వరి నాట్లు
- 62 వేల హెక్టార్లలోనే చిరుధాన్యాలు
- అపరాలు 55 వేల హెక్టార్లకే పరిమితం
- ఇప్పటికైనా విస్తారంగా కురిస్తే సాగు పుంజుకునే అవకాశం



కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం చోరగుడి సమీపంలో వరినాట్లు వేసిన పొలం ఎండి బీటలు వారిన దృశ్యం

ఏ పంట ఎంత విస్తీర్ణంలో..
(లక్షల హెక్టార్లలో.. జూన్ 1 - జూలై 16 వరకు)

పంట	సాగవ్వాల్సింది	సాగైంది
వరి	3.19	3.21
చిరుధాన్యాలు	1.99	0.62
అపరాలు	3.07	0.55
నూనెగింజలు	5.55	0.73
పత్తి	5.28	2.03


అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు మందగించడంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గింది. చాలీచాలని వర్షాలతో ఖరీఫ్ సాగు నత్తనడక నడుస్తోంది. విస్తారంగా వర్షాలు కురవాల్సిన జూన్, జూలై నెలల్లో వాన పడక.. వేసిన పంటలు ఎండుముఖం పట్టి.. రైతులు బిక్కమొగం పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 574.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. జూన్ 1 నుంచి జూలై 16 వరకు 172.4 మిల్లీమీటర్ల వాన పడాల్సి ఉంది. కానీ 107.7 మిల్లీమీటర్ల వానే కురిసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 37.5 శాతం వాన లోటు ఏర్పడింది. మెట్ట పైర్లకు నీటి తడులు పూర్తిగా కరువయ్యాయి. దాదాపు నెల రోజులుగా వాన జాడ లేకపోవడంతో.. వేసిన పంట దెబ్బతిని, రైతులు కొత్తగా విత్తనం వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా ఈ సీజన్‌లో 31.16 లక్షల హెక్టార్లల్లో ఖరీఫ్ పంటలు సాగవ్వాల్సి ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 9.67 లక్షల హెక్టార్లల్లో విత్తనం పడాల్సి ఉండగా.. 7.21 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ విత్తనాలు ఇచ్చి నా.. బ్యాంకులు పంట రుణాలిస్తున్నా.. కేవలం వాన లోటు కారణంగానే పంటలన్నీ సాగులోకి రాలేదు. ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చిన వరద నీటితో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి. దీంతో వరి సాగు కోసం జలాశయాల నుంచి కాలువలకు జలవనరుల శాఖ నీరు వదులుతోంది. కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఈ సీజన్‌లో 14.87 లక్షల హెక్టార్లలో వరి సాగవ్వాల్సి ఉండగా.. ఇప్పటికి 3.19 లక్షల హెక్టార్లలో నారు-నాట్లు పడాల్సి ఉంది. నీటి విడుదల వల్ల 3.21 లక్షల హెక్టార్లలో ఇప్పటికే నాట్లు పడ్డాయి. రాగులు, జొన్న, సజ్జ, మొ క్కజొన్న, ఇతర చిరుధాన్యాలు మూడోవంతు (62 వేల హెక్టార్లు) మాత్రమే సాగయ్యాయి. మినుము, పెసర, కంది, ఉలవ వంటి అపరాల సాగు కేవలం 55 వేల హెక్టార్లు, వేరుశనగ సహా నూనె గింజల పంటల సాగు 73 వేల హెక్టార్లకే పరిమితమయ్యా యి. పత్తి పంట 2.03 లక్షల హెక్టార్లే సాగులోకి వచ్చింది.

7 జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం

పల్నాడు, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో 60 నుంచి 99 శాతం, శ్రీకాకుళం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, నంద్యాల జిల్లాల్లో 20 నుంచి 59 శాతం వాన లోటు ఉంది. విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, ఏలూరు, అనకాపల్లి, కర్నూలు జిల్లాల్లో వర్షపాతం సాధారణంగా ఉంది. శుక్రవారం నుంచి రానున్న వారం రోజులు అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నెలాఖరులోగా వర్షాలు విస్తారంగా కురిస్తే.. పంట కాలం కొంత తగ్గినా.. రైతులు వీలైన పంటలు వేస్తే.. నవంబరులోగా పంట చేతికొచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

ఉనికి చాటుకునేందుకే జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

- బాబుకున్న ఇమేజ్‌తోనే రాష్ట్రానికి కొత్త కంపెనీలు
- రప్పా రప్పా అంటే పెట్టుబడులు రావు: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- రాజోలులో 2.27 కోట్లతో నిర్మించిన హెడ్‌పోస్టాఫీస్‌కు ప్రారంభోత్సవం



ద్వారకాతిరుమలలో కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, రాజోలు, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో గాడితప్పిన పాలనను కూటమి ప్రభుత్వం దారిలో పెడుతుంటే... జగన్ తన ఉనికి చాటుకునేందుకు రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దారుణం' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శ్రీవారి ఆలయ సందర్శన అనంతరం ఆయన గ్రామంలో తిరుగుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలసి నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధిని చేసిందో వివరించారు. 'జగన్ అంటున్నట్టు రప్పా రప్పా అంటే ఎవరైనా పెట్టుబడులు పెడతారా? చంద్రబాబుకున్న ఇమేజ్‌తోనే రాష్ట్రానికి కంపెనీలు వస్తున్నాయి. ఎంత కష్టమైనా సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం' అని అన్నారు.

ప్రతి పోస్టల్ ఉద్యోగీ ఓ మొబైల్ ఏటీఎం

ప్రతీ పోస్టల్ ఉద్యోగిని మొబైల్ ఏటీఎంగా మార్చే ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నామని పెమ్మసాని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో పోస్టాఫీసులన్నీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం రాజోలులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.2.27 కోట్లతో నూతనంగా నిర్మించిన రాజోలు హెడ్‌పోస్టాఫీసు కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

అప్పన్న సేవలో ఇస్రో చైర్మన్



కప్ప స్తంభం వద్ద ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్

సింహాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ సింహాచలంలోని వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. కప్ప స్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కె ప్రసాద్ స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఆహార రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- యువకులకు కేంద్ర మంత్రి పాశ్వాన్ సూచన
- తిరుపతి ఐఐటీలో కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

ఏర్పేడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆహారోత్పత్తికి యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ పిలుపునిచ్చారు. వారికి కావాల్సిన అన్ని ప్రోత్సాహకాలనూ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్)ను ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. తిరుపతి ఐఐటీ, ఎంవోఎఫ్‌పీఐ సహకారంతో ఈ యూనిట్‌ను ఆదర్శ ప్రాజెక్టుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ ప్రాంత ఆహార పంటలపై అధ్యయనానికి కేంద్ర నిపుణుల బృందాన్ని పంపుతామని చిరాగ్ పాశ్వాన్ తెలిపారు.

తిరుమలలో మూడో క్యూకాంప్లెక్స్

- నిర్మాణం దిశగా టీటీడీ

తిరుమల, జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మరొక క్యూకాంప్లెక్స్ నిర్మించాలని టీటీడీ యోచన చేస్తోంది. ప్రస్తుతం రెండు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లున్నాయి. పెరుగుతున్న భక్తుల రద్దీకి ఇవి సరిపోక ఐదేళ్ల క్రితం నారాయణగిరి పార్క్‌లో తొమ్మిది షెడ్లను నిర్మించారు. ప్రస్తుతం ఇవి కూడా సరిపోవడంలేదు. అటవీ ప్రాంతంలోని రింగురోడ్డులోని క్యూలైన్లలో భక్తులు చిన్నపిల్లలు, వృద్ధులు వాన, ఎండ, చలికి ఆగచాట్లు పడుతున్నారు. దీనిని గుర్తించిన టీటీడీ అధికారులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-3ని నిర్మించడమే శాశ్వత పరిష్కారమని భావిస్తున్నారు. ఆర్బీ సెంటర్‌కు సమీపంలో నిర్మించాలనే సూచనలు వచ్చినట్టు తెలిసింది.

నేడు గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025

గుంటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని నీరుకొండలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజుల గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 శుక్రవారం ఉదయం ప్రారంభం కానుంది. తొలి రోజున సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఈ సమ్మిట్‌ను ప్రారంభించి కీలకోపన్యాసం చేయనున్నారు. గ్రీన్ హైడ్రోజన్‌లో ఉన్న పరిశోధన, అభివృద్ధి అవకాశాలు, వినియోగం తదితర అంశాలపై సీఎం ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కె.విజయానంద్ కూడా ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్, నెడ్‌క్యాప్ ఎండీ డాక్టర్ ఎం.కమలాకర్‌బాబు తదితరులు సమ్మిట్‌లో ప్రసంగించనున్నారు.

మరోవిడత నామినేటెడ్ పదవులు

- 66 ఏఎంసీలకు చైర్మన్లు ఖరారు.. 53 టీడీపీ, 9 జనసేన, 4 బీజేపీ
- 35 మంది మహిళలకు అవకాశం

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరోవిడత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. 66 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమించింది. వీటిలో 53 పోస్టులు టీడీపీకి, 9 ఏఎంసీలు జనసేనకు, 4 బీజేపీకి కేటాయించింది. 66 చైర్మన్లలో 17 మంది బీసీలు, 10 మంది ఎస్సీలు, 5గురు ఎస్టీలు, 5 గురు మైనార్టీలు ఉన్నారు. 35 చోట్ల మహిళలకు అవకాశం కల్పించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. త్వరలో దేవాలయాల కమిటీ చైర్మన్ల నియామకం కూడా చేపట్టనున్నారు.

ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా పెద్దిరాజు

ఏపీ మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నర్సాపురం నియోజకవర్గానికి చెందిన కొల్లు పెద్దిరాజును నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

వృద్ధురాలి ఖాతాలో 2.15 లక్షలు మాయం

- విడతల వారీగా కొట్టేసిన సైబర్ మోసగాళ్లు!
- మీ సేవలో చలానా తీసి.. ఫిర్యాదు చేయాలన్న సైబర్ క్రైం

దేవనకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తన బ్యాంకు ఖాతాలోని రూ.2.15 లక్షలు మాయమైనట్లు కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్లుకు చెందిన శాలు బీ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. శాలు బీ అనే వృద్ధురాలికి గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. ఆ ఖాతాకు ఆమె కుమారుడు మాబుసుభాన్ ఫోన్ నంబరు లింక్ చేశారు. గత నెలలో ఎల్ఐసీ డబ్బులు 59 వేలు, పొదుపు సంఘం రుణం 1.50 లక్షలు ఆమె ఖాతాకు జమయ్యాయి. ఈ నెల 7న ఆమె కుమారుడి సెల్ నంబరు బ్లాక్ అయింది. 8వ తేదీన ఆమె ఖాతా నుంచి రూ.49 వేల చొప్పు రెండు సార్లు, 9వ తేదీన రూ.49 వేల చొప్పున రెండు సార్లు డబ్బులు కట్ అయ్యాయి. ఆతర్వాత పలు విడతల్లో మిగతా నగదు కట్ అయింది. మాబుసుభాన్ కొత్త సిమ్ తీసుకోవడానికి ప్రయత్నించగా సైబర్ మోసగాళ్లు ఆధార్ నంబరును లాక్ చేశారు. 14వ తేదీన అదే నంబర్‌పై కొత్త సిమ్ తీసుకున్నారు. బ్యాంకు ఖాతాలో నగదు కట్ అయినట్లు 15వ తేదీ నుంచి మేసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితురాలు కర్నూలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా మీసేవలో చలానా చెల్లించి దేవనకొండ పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారని బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపారు. మీ సేవలో సర్వర్ సమస్య ఉందని, శుక్రవారం చలానా చెల్లిస్తామని చెప్పారు.

మంత్రి నిమ్మలపై కేసు కొట్టివేత

పాలకొల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాటి ప్రతిపక్ష ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడిపై పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. 2019, ఆగస్టులో ఆశా వర్కర్లు తమ డిమాండ్ల సాధనకు ఆందోళనకు దిగారు. వారి ఆందోళనకు మద్దతుగా రామానాయుడు, టీడీపీ నాయకులు నిలిచారు. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నాటి నుంచి కోర్టు చుట్టూ తిరుగుతున్న నిమ్మలకు గురువారంతో ఊరట లభించింది. ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

కాళ్లూచేతులూ కట్టేసి.. గొంతుకు వైరు బిగించి..

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

- తల గోడకు కొట్టుకుని పడి పోయాడంటూ నాటకం
- పోలీసుల రంగప్రవేశంతో తామే చంపామని వెల్లడి
- నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో దారుణం




శీనయ్య ధనమ్మ కల్యాణ్

రాపూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే హతమార్చింది ఓ ఇల్లాలు. మద్యం మత్తులో నిద్రపోతున్న భర్తను అర్ధరాత్రి కాళ్లూచేతులు కట్టేసి, మెడకు కరెంటు వైరు బిగించి కిరాతకంగా కడతేర్చింది. అనంతరం తన భర్త తాగొచ్చి తనతో గొడవపడి, తల గోడకు కొట్టుకుని పడిపోయాడంటూ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే చెవుల నుంచి రక్తం కారడం, మెడ కమిలిపోయి ఉండడంతో మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రాపూరులోని దళితవాడకు చెందిన లేబాకు రత్నయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు లేబాకు శీనయ్య (28)కు పంగిలి గ్రామానికి చెందిన ధనమ్మతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప కూడా ఉంది. రత్నయ్య దంపతులు, శీనయ్య పక్కపక్కనే వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. కూలి పనులు చేసుకునే శీనయ్య మద్యం మత్తులో తరచూ ధనమ్మతో గొడవపడేవాడని స్థానికులు తెలిపారు. రోజూలాగే కూలి పనులు ముగించుకొని ఇంటికొచ్చిన శీనయ్య బుధవారం రాత్రి నిద్రపోయాడు. గురువారం ఉదయం ఆయన నిద్ర లేవకపోయేసరికి ధనమ్మ పక్క ఇంట్లో ఉన్న అత్తామామల వద్దకు వెళ్లి శీనయ్య లేవడం లేదని చెప్పింది. రాత్రి తనతో గొడవపడ్డాడని, తల గోడకు కొట్టుకొని పడిపోయాడని నమ్మబలికింది. వెంటనే లోపలికి వెళ్లి చూసిన తల్లిదండ్రులు అప్పటికే శీనయ్య మృతిచెందినట్టు గమనించారు. అతని మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చి మంచంపై పడుకోబెట్టారు. అయితే శీనయ్య చెవి నుంచి రక్తం కారడం, మెడపై నల్లగా కమిలినట్లు ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు, కొంతమంది బంధువులు ధనమ్మను ప్రశ్నించారు. అయితే ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పేసరికి వారికి అనుమానం వచ్చింది. దీంతో వారు రాపూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ధనమ్మను గద్దించి అడగడంతో జరిగిన విజయం బయటపెట్టింది. తనతో సాన్నిహితంగా ఉన్న కల్యాణ్ అలియాస్ వెంకటరమణయ్యతో కలిసి శీనయ్యను హత్యచేసినట్టు అంగీకరించింది. తాము ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం బుధవారం అర్ధరాత్రి పడుకుని ఉన్న శీనయ్య కాళ్లూచేతులూ కట్టేసి కరెంట్ వైర్‌తో గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశామని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. నిందితురాలు చెప్పిన వివరాల ప్రకారం కల్యాణ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యాబిడ్డల్ని బావిలో తోశాడు!

- అనంతరం గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం
- తిరుపతి జిల్లా పాకాల మండలంలో ఘటన



హేమంత కుమారి, తనుశ్రీ, తేజశ్రీ

పాకాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లొద్దామంటూ భార్య, ఇద్దరు కుమార్తెలను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. ఓ బావి వద్దకు తీసుకెళ్లి ముగ్గురినీ తోసి చంపేశాడు. స్థానికులు చూడటంతో తానూ గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషాద ఘటన తిరుపతి జిల్లా పాకాల మండలంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మద్దినాయనిపల్లె పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన టి.గిరి (37), హేమంత కుమారి (35) భార్యాభర్తలు. వీరికి తనుశ్రీ (11), తేజశ్రీ (8) కుమార్తెలు. తిరుపతిలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల స్వగ్రామం వచ్చారు. గురువారం మధ్యాహ్నం బంధువుల ఇంటికి వెళ్లివద్దామంటూ స్కూటరుపై భార్యాపిల్లలను తీసుకుని కొనేటోయిన ఇండ్లు రింగురోడ్డు సమీపంలో బావి దగ్గరికి తీసుకెళ్లి అందులోకి వారిని తోసేశాడు. ఆ తర్వాత భార్య, చిన్నకుమార్తె మృతదేహాలను గట్టుకు లాగాడు. అంతలో సమీప పొలాల్లో పనిచేసుకుంటున్న కొందరు గమనించడంతో చాకుతో గొంతు కోసుకొన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు వచ్చి గిరిని ఆస్పత్రికి తరలించారు. తనుశ్రీ మృతదేహాన్ని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సాయంతో వెలికి తీశారు. సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల అభ్యున్నతే లక్ష్యం

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ అహిర్

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా క్రమశిక్షణ, నిబద్ధతతో అధికారులు పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం విజయవాడలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లోనూ, ఓ ప్రైవేట్ హోటల్‌లోనూ వివిధ ప్రభుత్వ సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు, రోస్టర్ అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై ఆయన సమీక్ష నిర్వహించారు. ముందుగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) సంస్థ కార్యకలాపాలు, అక్కడ ప్లాస్టిక్ కోర్సుల్లో శిక్షణ పొందినవారికి వస్తున్న ఉద్యోగావకాశాల గురించి సీపెట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఓబీసీ రిజర్వేషన్ల అమలుపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను చైర్మన్ ఆరా తీశారు. బ్యాంకుల్లో రోస్టర్ విధానం అమలును యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కర్‌రావు, రీజినల్ బ్యాంక్ మేనేజర్ ఎంపీ తిలక్, లీడ్ బ్యాంకు మేనేజర్ కె.ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి ఎయిమ్స్ అందిస్తున్న సేవలు, పోస్టుల వివరాలు, రోస్టర్‌పై ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శాంతాసింగ్ చైర్మన్‌కు వివరించారు. రాష్ట్రంలోని 18 వైద్య కళాశాలల్లో ఉన్న సీట్లు, ఓబీసీ రిజర్వేషన్లు, రోస్టర్ అమలు తీరును వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖలో అమలు చేస్తున్న రిజర్వేషన్లు, రోస్టర్ విధానాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ గురించి ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జునను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దిద్దుబాట!

భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనాలో కాలూని, దాని అధ్యక్షుడు జిన్‌పింగ్, ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్, విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీకావడం ఉభయదేశాల సంబంధాల్లో సానుకూల మార్పుకు దోహదం చేస్తుందని ఆశించవచ్చు. షాంఘై సహకార సంస్థ విదేశాంగమంత్రుల సదస్సుకు హాజరైన సందర్భంలో ఈ భేటీలూ చర్చలూ జరిపినప్పటికీ, ఐదేళ్ళ క్రితం గల్వాన్ లోయలో భారత్–చైనా ఘర్షణలు జరిగిన తరువాత జయశంకర్ అక్కడ పర్యటించడం ఇదే మొదటిసారి. ఇటీవలి భారత్–పాక్ ఘర్షణలో పాకిస్థాన్ పక్షాన చైనా నిలబడి దానికి సమస్త సహకారాన్నీ అందించిందని మన సైనికాధికారులు కుండబద్దలు కొట్టిన తరువాత, అటువంటిదేమీ లేదని చైనా దబాయించిన విషయం తెలిసిందే. ఈ చిన్నస్థాయి యుద్ధం తరువాత చైనాకూ మనకూ మానసికంగా మరింత దూరం పెరిగిన నేపథ్యంలో జయశంకర్ పర్యటన కొన్ని దిద్దుబాట్లు, సర్దుబాట్లు చేసుకోవడానికి ఉపకరించవచ్చు.

గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంలో భారత ప్రధాని, చైనా అధ్యక్షుల మధ్య భేటీ జరిగింది. సంబంధాలు మెరుగుపరచుకోవాలని, పూర్వస్థితికి తీసుకుపోవాలని అక్కడ నిర్ణయం జరగడంతో ఉభయదేశాల సరిహద్దు స్థితిగతుల్లోనూ మార్పు వచ్చింది. డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో సైన్యాలను ఉపసంహరించుకోవడంతో ఉద్రిక్తతలు చల్లారాయి. జాతీయభద్రతా సలహాదారు అజిత్‌దోవల్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇత్యాదులు కూడా అనంతరకాలంలో చైనాలో పర్యటనలు చేశారు. నాథూలాపాస్ మీదుగా మానససరోవర్ యాత్ర ఆరేళ్ళ తరువాత ఆరంభం, విమాన సర్వీసులు పునరుద్ధరించాలని, వీసా ప్రక్రియలను సరళీకరించాలని అనుకోవడం వంటి సానుకూల చర్యలు ఒకపక్కన కనిపిస్తున్నా, చైనా వ్యవహారశైలి ఒక పట్టాన ఊహకు అందదు. సంబంధాలు మెరుగుపడుతున్నాయని అనుకోగానే, పూర్తిగా తిరగబడటం కూడా అనుభవంలో ఉన్నదే. విద్యుత్‌వాహనాల తయారీలో అత్యంత కీలకమైన ఖనిజాలు, హైటెక్ యంత్రాల ఎగుమతులపైన ఆంక్షలు విధించి భారత్‌ను ఇబ్బందిపెట్టాలన్న నిర్ణయం ఈ కోవలోనిదే. మన భారీ ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించడానికీ, టెలికాం, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలను హద్దుల్లో ఉంచడానికీ ఆంక్షలను ఆయుధంగా వాడుతూ, ప్రపంచ వాణిజ్యసంస్థ ఒడంబడికలను సైతం ఉల్లంఘించడానికి చైనా సందేహించడంలేదు.

షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) ఆవిర్భావ లక్ష్యాల్లో ఉగ్రవాదం, వేర్పాటువాదంపై ఉమ్మడి పోరాటం కూడా ఒకటి. కానీ, పాకిస్థాన్ నొచ్చుకుంటుందన్న ఏకైక కారణంగా మొన్నటి సంయుక్త ప్రకటనలో పహల్గాం దాడి ప్రస్తావనను ఉద్దేశపూర్వకంగా వదిలేసి, బలూచిస్థాన్ రైలు దాడిని చేర్చి మిత్రదేశానికి ఆనందాన్ని చేకూర్చిన విషయం తెలిసిందే. పహల్గాం ఊసులేనందుకు మన రక్షణమంత్రి ఆ ప్రకటనపై సంతకం చేయలేదు. ఆపరేషన్ సిందూర్‌లో పూర్తిగా పాకిస్థాన్ పక్షాన నిలబడి, జె–10సి యుద్ధవిమానాలు, మిసైళ్ళు, డ్రోన్లతోపాటు, కీలకమైన యుద్ధసమాచారాన్ని కూడా చేరవేసిందని మన రక్షణరంగ నిపుణులు నమ్ముతున్నారు. సరిహద్దుల్లో పేరుకు ఉపసంహరణలు జరిగినా, కీలకమైన ఆర్మీ పోస్టుల్లో ఇంకా చైనా సైనికుల అనుమతితోనే మనవారు కాపలా కాయాల్సివస్తున్నదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది. నా కోయి గుస్‌గయా అంటూ ఐదేళ్ళక్రితమే ప్రధాని మోదీ మన పార్లమెంటులో దబాయించడంతో, అంతర్జాతీయ వేదికలమీద దీనిని ఆయుధంగా వాడుకోవడానికి చైనాకు అవకాశం దక్కిందని కాంగ్రెస్ వాదన.

గతంలో కొన్ని దశాబ్దాలుగా ఒక్క బుల్లెట్ కూడా పేలని భారత్–చైనా సరిహద్దు, మనం అమెరికాతో రాసుకుపూసుకోవడం హెచ్చిన తరువాత నిత్య ఘర్షణలకు నిలయమైన మాట నిజం. చైనా, భారత్ మధ్య వివిధ రంగాల్లో పోటీ అనివార్యం. కానీ, డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత భారత్–చైనాలకు అనేక కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. రష్యాతో వాణిజ్యం చేసే దేశాలమీద ఐదురెట్ల సుంకాలు విధిస్తామని అమెరికా–నాటో హెచ్చరికలు చేస్తున్నాయి. భారత్–చైనాకు నష్టకరమైన ఈ తరహా నిర్ణయాలు అనేకం జరుగుతున్నాయి, రాబోయే రోజుల్లో ట్రంప్ నుంచి మరిన్ని ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను గుడ్డిగా ద్వేషించడం వల్ల చైనాకు ఒరిగేదేమీ ఉండదు. ఉభయదేశాల ఉమ్మడి ప్రయోజనాలే పునాదిగా దౌత్యసంబంధాలు దృఢ పడాలి.

రాధికను చంపింది తండ్రి మాత్రమేనా!?

ఇటీవల గుర్‌గావ్‌లో తండ్రి చేతిలో మరణించిన కూతురు రాధిక యాదవ్ ఒక రాష్ట్రస్థాయి టెన్నిస్ ప్లేయర్. ఎన్నో టోర్నమెంట్లు ఆడి గెలిచింది, తన లాంటి యువ క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఒక అకాడమీని కూడా ఏర్పాటు చేసింది. చివరకు పాతికేళ్ళకే తండ్రి పేల్చిన రివాల్వర్‌కి హతమైంది. పోలీసుల ముందు ఆ తండ్రి తన నేరాన్ని ఒప్పుకుంటూ– కూతురి సంపాదన మీద ఆధారపడ్డావంటూ తమ ఊళ్ళోవాళ్ళు వెటకారంగా మాట్లాడటంతో తాను ఈ పని చేశానని అన్నాడు. టెన్నిస్ అకాడమీ పని మానేయమని చాలాసార్లు కూతురితో చెప్పాడట. కానీ రాధికా యాదవ్ అందుకు ఒప్పుకోలేదు. ఇదేగాక, కూతురు సోషల్ మీడియాలో ఏక్టివ్‌గా ఉంటూ రీల్సూ, మ్యూజిక్ వీడియోలూ షేర్ చేయటం కూడా ఆ తండ్రికి నచ్చలేదట!

ఈ ఘోరాన్ని జీర్ణించుకునే క్రమంలో కొన్ని ఆందోళనకరమైన అంశాలు మన ముందుకు వస్తాయి. ఒక స్త్రీ తనకంటూ ఒక కొత్త మార్గాన్ని నిర్మించుకుంటున్నప్పుడు చుట్టూ ఉన్న సమాజం ఎంత తీవ్రంగా దాన్ని ప్రతిఘటిస్తుందీ అన్నది ఇందులో ముఖ్యమైన అంశం. ఈ విషాదకర ఘటన మన సమాజంలో మనం ఒప్పుకోవటానికి ఇష్టపడని అంశాలు కొన్నింటిని తేటతెల్లం చేసింది. స్త్రీలు అడ్డుగోడలను బద్దలుకొట్టుకొని ముందుకు పోయినంత మాత్రాన పితృస్వామ్యం మాయమైపోదు. అది కొత్త రూపాల్లోకి పరిణామం చెంది, పునఃప్రవేశానికి కొత్త దారుల్ని వెతుక్కుంటుంది. వెళ్ళిన చోటల్లా సరికొత్త రూపాల్లో ప్రత్యక్షమవుతుంది. దీనికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. పలు మాధ్యమాల ద్వారా కనపడి/ వినపడే స్త్రీలపై తీవ్రమైన ట్రోలింగ్ చూస్తున్నాం. ఆర్థిక సహకారానికి చట్టబద్ధ వెసులుబాటు కల్పించే మనోవర్తికీ సామాజిక దురాచారమైన వరకట్నానికీ అసంబద్ధంగా ముడిపెట్టి చేసే వాదనలూ వింటున్నాం. స్త్రీల సాధికారతపై విషం గక్కుతూ అంతకంతకూ పెరుగుతున్న 'ఇన్సెల్' సంస్కృతికి ఇవి కొన్ని ఉదాహరణలు.




ఈ విషాదం మనకు గుర్తు చేసే మరో అంశం– పితృస్వామ్యం లాభాలను మగవారు అనుభవిస్తున్నప్పటికీ వారు కూడా పితృస్వామ్యం దాడికి అతీతం కాదు. అది వాళ్లనెప్పుడూ పరిపూర్ణ మానవులుగా ఎదగనివ్వదు. తోటి మానవుల్లో మానవీయతను గుర్తించనివ్వదు. పితృస్వామ్యం నైతికంగా స్త్రీలనే గాక, పురుషులనూ లోతుగా గాయపరుస్తుంది– అంటుంది ఫెమినిస్ట్ మేధావి కరోల్ గిలిగన్. ఎందుకంటే పితృస్వామ్యం ఒత్తిడి కింద నలిగే ఆడవారూ మగవారూ ఇరువురూ 'ఆడతనం', 'మగతనం' అన్న కృతకమైన చట్రాల్లో ఇమడని తమలోని విశిష్ట వ్యక్తిత్వ అంశాలను రద్దు చేసుకుంటారు. హద్దులు దాటితే స్త్రీని శిక్షించే ఈ సమాజమే, పురుషుడి విలువను అతను ప్రదర్శించే ఆధిక్యతను బట్టి, స్త్రీపై అతను చెలాయించే అదుపును బట్టి అంచనా వేస్తుంది. తమకు చెందిన స్త్రీపై ఆధిక్యతను ప్రదర్శించలేని, ఆమెను అదుపు చేయలేని మగవాడిని ఈ సమాజం వెక్కిరిస్తుంది. స్త్రీని అణచివేసినందుకు మగవాడిని మెచ్చుకుని, ఆమెకి స్వేచ్ఛ ఇచ్చినందుకు తప్పుపట్టే ఈ సమాజం ఎంత క్రూరమైనది! దీన్ని ఈ స్థితి దాకా ఎలా దిగజారనిచ్చాం మనం! ఈ సందర్భంలో సమాజం నుంచి వినపడిన వెక్కిరింతలు ఒక బలహీనమైన మగతనాన్ని గాయపరిచాయి. స్త్రీ పురుష హోదాలు తారుమారు అవటాన్ని కూడా సహించలేనంత బలహీనమైన మగతనం అది! రాధికా యాదవ్ తండ్రిని వెక్కిరించిన ఇరుగుపొరుగువాళ్ల ఆ తుపాకీ ట్రిగ్గర్‌ను నొక్కకపోయి ఉండచ్చు, కానీ ఈ హింస వెనుక ఉన్న భావజాలాన్ని ప్రేరేపించింది వారి మాటలే. ఇలా అంటున్నామంటే– ఆ నేరస్థుడిని నింద నుంచి మినహాయిస్తున్నట్టు కాదు. స్త్రీద్వేషం కేవలం వ్యక్తులకు పరిమితం కాదని గుర్తిస్తున్నాం. స్త్రీ ద్వేషం సామూహికమైనది, వ్యవస్థాగతమైనది, పైపెచ్చు మెచ్చుకోలు అందుకునేది!

విజేతలైన స్త్రీలు కూడా స్త్రీ ద్వేషం నుంచి తప్పించుకోలేరని, పైగా ఆ విజయాలు ఆమెపై మరింత వ్యతిరేకతను పెంచుతాయనీ ఈ విషాదం మనకు గుర్తు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో లైంగిక న్యాయం జరగాలంటే స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం లభించటం ఒక్కటే సరిపోదు. వ్యవస్థల్లోనూ మన మనసుల్లోనూ గూడు కట్టుకుపోయి ఉన్న పితృస్వామ్యాన్ని కూలదోసే విధంగా సామాజిక రాజకీయ అమరికల్లో విప్లవాత్మకమైన మార్పు సాకారం కావాలి.

• శివాని నాగ్
అంబేడ్కర్ యూనివర్సిటీ, ఢిల్లీ
(ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

మోదీ @75: భగవత్ మాటలో మర్మమేమిటి?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'మా కాంగ్రెస్‌లో ముఠా కుమ్ములాటలు బహిరంగంగా జరుగుతాయి. ఎటువంటి దాపరికం ఉండదు. భారతీయ జనతా పార్టీలో కలహాలు, కుమ్ములాటలు అన్నీ మూడోవాడి కంటికి కనిపించకుండా గుట్టుగా సంభవిస్తుంటాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు వాపోయారు. బహిరంగ ఆరోపణలు, ప్రత్యారోపణలతో స్వీయ లక్ష్యాలు సాధించుకోలేకపోగా ప్రత్యర్థి పార్టీలకు ప్రయోజనాలు చేకూర్చడమనే ప్రవృత్తి కాంగ్రెస్ నేతలలో మెండుగా కనిపిస్తోంది. కేరళలో శశిథరూర్, పీసీసీ నాయకుల మధ్య వాగ్వాదాలు; కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాల పరస్పర నిందలు అందుకు తాజా నిదర్శనాలు. కాంగ్రెస్‌కు విరుద్ధంగా బీజేపీ, సంఘ్ పరివార్‌లో అధికారానికి, ఆధిపత్యానికి అంతర్గత పోటీలు చాలా చాలా అరుదుగా మాత్రమే ప్రజల దృష్టికి వస్తాయి. కారణమేమిటి? చిన్నపాటి జగడం సైతం మీడియా దృష్టికి వెళ్లకుండా సంఘీయులు, బీజేపీ శ్రేణులు అత్యంత జాగ్రత్త వహించడమేనని చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్ పాలనా వ్యవహారాలలో పెత్తనానికై అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ మధ్య ఎడతెగని పోటీ, బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో నెలల తరబడి జాప్యానికి ఆరెస్సెస్, బీజేపీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం పతాక శీర్షికలుగా కాదు కదా వార్తలుగా కూడా కనిపించడం అరుదే. అంతర్గతంగా జరుగుతోన్న వాదోపవాదాల గురించి ఏమి మాట్లాడితే ఏమి ముప్పు వాటిల్లుతుందో అన్న భయాందోళనలు సంఘ్, బీజేపీ శ్రేణులను కట్టడి చేయడం పరిపాటి.

ప్రజా జీవితంలో ఉన్నవారు 75 ఏళ్ల వయస్సు రాగానే బాధ్యతల నుంచి వైదొలగాలని, పదవీ విరమణ చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ సలహా ఇవ్వడం పలువురిని విస్మయపరిచింది, ఎంతో మందిని దిగ్భ్రాంతిపరిచింది, కొంత మందికి కించిత్ అసంతృప్తి కలిగించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. అదే నెలలో మోహన్ భగవత్ సైతం 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. సంఘ్ అధినేత వ్యాఖ్యలకు ప్రతిపక్షాలు వెన్వెంటనే ఆనందోత్సాహాలతో ప్రతిస్పందించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారసుడు ఎవరో తక్షణమే నిర్ణయించేందుకు సంఘ్ నాయకత్వం ఆరాటపడుతోందని అనేందుకు భగవత్ వ్యాఖ్యలే తార్కాణమని విపక్షాలు గట్టిగా అభిప్రాయపడుతున్నాయి.

'మోదీ తరువాత, ఎవరు?' దశాబ్దాల క్రితం నాటి 'నెహ్రూ తరువాత, ఎవరు?' అన్న చర్చను జ్ఞాపకం చేస్తోంది. మోదీ తరువాత ఎవరు అన్నది చాలా ఆసక్తికరమైన విషయం, సందేహం లేదు. చర్చలు మొదలయ్యాయి, ముమ్మరమయ్యాయి. అయితే వాస్తవాన్ని పరిశీలిస్తే వాద్‌నగర్ నుంచి ప్రభవించిన వ్యక్తి చాలా మంది ఆశిస్తున్నట్టుగా చాలా తొందరగా ఆ ప్రతిష్ఠాత్మక పదవి నుంచి వెళ్లిపోతారా? పోరు, కచ్చితంగా. 2024 సార్వత్రక ఎన్నికలపై నేను రాసిన పుస్తకంలో పేర్కొన్న ఒక ఆసక్తికరమైన ఉదంతాన్ని ఇక్కడ కూడా ప్రస్తావిస్తాను. ఆరు నూరైనా సరే అధికారంలో కొనసాగడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తారనేది ఆ ఉదంతం విశదం చేస్తుంది. నవ యువకుడిగా ఉన్నప్పుడు మోదీ అహ్మదాబాద్‌లో తన బాబాయి టీ స్టాల్‌లో కొంతకాలం పనిచేశారు. వాద్‌నగర్ నుంచి అహ్మదాబాద్‌కు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులో వెళుతుండేవారు. అదే బస్సులో తిరిగి వాద్‌నగర్‌కు వెళ్లేవారు. అహ్మదాబాద్ చేరగానే తిరిగి వెళ్లేందుకు సీటు రిజర్వేషన్‌కై తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలివేసేవారట! ఈ కథ నుంచి తెలుసుకోవల్సిన విషయమేమిటి? మోదీ ఒకసారి ఒక కుర్చీలో కూర్చుంటే దాన్ని మరెవరూ ఆయన నుంచి లాక్కోలేరు! గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఈ ఆసక్తికరమైన కథను నాకు చెప్పారు. నిజం కావచ్చు, కాకపోవచ్చు. అయితే దానిలో అంతర్లీనంగా ఉన్న సందేశమిది: అధికారం చెలాయించడం, పెత్తనం చేయడం మోదీ సహజ స్వభావం. తన భవిష్యత్తుపై తనకు పూర్తి నియంత్రణ లేకపోవడమనేది ఆయనకు సుతరామూ నచ్చని విషయం. అటువంటి నాయకులు పదవీ విరమణ చేయడం కాదు కదా అప్రధానంగా ఉండడానికి కూడా ఏ మాత్రం ఇష్టపడరు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు ఏ విషయం పైన అయినా ఆచితూచి మాట్లాడుతారు. మరి మోహన్ భగవత్ హఠాత్తుగా పదవీ విరమణకు 75 సంవత్సరాల వయస్సు గురించి ఎందుకు ప్రస్తావించారు? సంఘ్‌లో ఒక వర్గంవారు బీజేపీలో తరం మార్పును కోరుకుంటున్నారని అధికార నడవాలలో గుసగుసలు గట్టిగా విన్పిస్తున్నాయి. బీజేపీ, ఆరెస్సెస్ నాయకత్వాల మధ్య గుంజాటన 2024 సార్వత్రక ఎన్నికల సందర్భంలో బహిర్గతమయింది. ఆరెస్సెస్ మద్దతు తప్పనిసరిగా అవసరమైన నాటి కాలం నుంచి బీజేపీ ఇప్పుడు బాగా ఎదిగిందని, తన వ్యవహారాలను తానే బాగా చక్కదిద్దుకోగల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా సంతరించుకున్నదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. నడ్డా వ్యాఖ్యలు సంఘ్ పరివార్ నాయకత్వ శ్రేణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. మోదీ ఆరాధన కేంద్రంగా పెంపొందిన రాజకీయ పరిస్థితుల పట్ల ఆరెస్సెస్ నాయకత్వంలో నెలకొన్న అసంతృప్తి, చిరాకును ఆ ఆందోళన ప్రతిబింబించింది. పెచ్చరిల్లిపోతున్న మోదీ వ్యక్తిపూజ పట్ల మోహన్ భగవత్ తన ఆవేదనను గత సెప్టెంబర్‌లో వెలువరించిన ఒక ఉపన్యాసంలో ఇలా వ్యక్తం చేశారు: 'ప్రజాహిత కృషి ద్వారా ప్రతి ఒక్కరూ గౌరవాదరాలు పొందవచ్చు. అయితే మనం అటువంటి సమున్నత స్థితికి చేరామా లేదా అన్నది నిర్ణయించవలసింది ఇతరులే కాని మనకు మనమే కాదు. ఎవరైనా సరే తనకు తానుగా భగవంతుడనని ఎట్టి పరిస్థితులలోను ప్రకటించుకోకూడదు'. మోదీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని నిశ్చితంగా చెప్పవచ్చు.

అయితే తమ రాజకీయ, భావజాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే మోదీ నాయకత్వం తప్పనిసరి అన్న విషయం ఆరెస్సెస్‌కు బాగా తెలుసు. 2024 సార్వత్రక ఎన్నికల అనంతరం సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఒక సర్వేలో మోదీకి లభిస్తున్న ప్రజాదరణ బీజేపీకి ఉన్న ప్రజా మద్దతు కంటే అధికంగా ఉన్నదని వెల్లడయింది. ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు ప్రధానమంత్రి నాయకత్వం కారణంగానే తాము బీజేపీకి ఓటు వేశామని చెప్పారు. మోదీ నాయకత్వం లేకపోతే బీజేపీ దుర్బలమైపోవడం ఖాయమని ఆ సర్వే స్పష్టం చేసింది. బ్రాండ్ హిందుత్వకు రాజకీయ చిహ్నం మోదీ. హిందుత్వ శ్రేణులకు ఆయన సర్వసేనాధిపతి. ప్రజలను హిందుత్వ వైపు ఆకర్షించే ప్రధానశక్తి ఆయనే. ఒక విధంగా మనం 'మోదిత్వ' యుగంలో ఉన్నాం. వ్యక్తిపూజ మెల్లమెల్లగా మతపరమైన మెజారిటేరియనిజంగా పరిణమిస్తున్న శకమిది.

విస్తృత వ్యాప్తి, పెరిగిన పలుకుబడితో సంఘ్ పరివార్‌లో సైతం ప్రభావ శక్తుల నాయకత్వ ధోరణులలో ఒక స్పష్టమైన మార్పు వచ్చింది. తన వంద సంవత్సరాల మనుగడలో ఆరెస్సెస్, సంఘ్ పరివార్ భావజాల గంగోత్రిగా ఉన్నది సంఘ్ మాటే తుది మాట. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో రంగంలోకి వచ్చిన తరువాత, సంఘ్, బీజేపీల మధ్య సంబంధాలలో మార్పులు అనివార్యమయ్యాయి. అయితే బీజేపీ ఇప్పటికీ తనకు అవసరమైన మద్దతును అట్టడుగు స్థాయిలో సువ్యవస్థితంగా పాదుకుపోయిన సంఘ్ శాఖల నుంచే పొందుతున్నది. అయితే నాయకత్వ స్థాయిలో ఇప్పుడు బీజేపీకి ప్రధాన ఆలంబన ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే, సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కాదు. భగవత్ సమానుల్లో ప్రథముడు మాత్రమే. వాజపేయి ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మోదీ ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మధ్య సంభవించిన మార్పు ఇది. నాడు ఇరవైకి పైగా పార్టీలు భాగస్వాములుగా ఉన్న కూటమికి నాయకత్వం వహిస్తున్న వాజపేయిని సంఘ్ ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై విమర్శిస్తుండేది. మోదీ సైతం ఆరెస్సెస్ ప్రచారక్ స్థాయి నుంచి జాతీయ స్థాయి రాజకీయవేత్తగా పరిణమించిన అనితరసాధ్యుడు అనేది ఎవరూ విస్మరించరు, విస్మరించలేరు. వాజపేయి హయాంలో ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న కేఎస్ సుదర్శన్ బహిరంగంగానే ప్రభుత్వాన్ని విమర్శించేవారు. వాజపేయి పాలనా నిర్ణయాలు తీసుకొంటున్న తీరుతెన్నులను ఆయన ఆక్షేపించేవారు. వాజపేయిని బహిరంగంగానే విమర్శించేవారు. సుదర్శన్ వ్యవహరిస్తున్న తీరుకు వాజపేయి చిరాకు పడేవారు. సహనం కోల్పోయిన వాజపేయి ఒకసారి, 'నేను అలసిపోలేదు, పదవీ విరమణ చేయను' అని స్పష్టంగా ప్రకటించారు.

వాజపేయి పట్ల సుదర్శన్ వ్యవహరించినట్లుగా మోదీని తాను నేరుగా ఎదుర్కోలేనన్న విషయం మోహన్ భగవత్‌కు బాగా తెలుసు. ప్రస్తుత సర్ సంఘ్ చాలక్ చేయగలిగిందల్లా ఒక లక్ష్మణ రేఖ గీయడమే. తద్వారా మోదీ–షా ద్వయం నిరంకుశాధికార నాయకత్వానికి పరిమితులు ఉన్నాయని స్పష్టం చేయడం మాత్రమే. 75 ఏళ్ల వయసు వచ్చినవారు పదవుల నుంచి నిష్క్రమించాలని ప్రకటించడం ఒక ప్రారంభ ఎత్తుగడ మాత్రమే. మొదటి ఎత్తుగడే ఆట కట్టిస్తుందా? అసాధ్యమన్న విషయం భగవత్‌కు తెలుసు. 75 ఏళ్ల వయసు పైబడిన ఎల్‌కే ఆద్వాణీ, మురళీమనోహర్ జోషీ లాంటి పార్టీ అతిరథ మహారథులను రంగం నుంచి తొలగించేందుకు మోదీ–షా నాయక ద్వయం 2015లో 'మార్గదర్శక్ మండల్' అనే భావనను ప్రవేశపెట్టడం ద్వారా ఆ ఇరువురు సీనియర్ నాయకులను పూర్తిగా విశ్రాంత జీవితంలోకి పంపించారు. అది పదేళ్ల కిందటి మాట. అయితే ప్రస్తుత దశలో 'మార్గదర్శక్' లాంటి పాత్రకు పరిమితమయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బలవంతం చేయలేమన్న యథార్థాన్ని ఆరెస్సెస్ గ్రహించింది. మోదీ అనంతర బీజేపీకి యువ నాయకత్వాన్ని సమకూర్చేందుకు మరింత సర్వ జనామోద మార్గాన్ని సృష్టించాలని సంఘ్ అభిలషిస్తోంది. 'కౌన్ బనేగా బీజేపీ ప్రెసిడెంట్' అన్న క్లిష్టమైన ప్రశ్న ఇప్పుడు అటు సంఘ్‌కు ఇటు బీజేపీకి చిరాకు కలిగిస్తోంది. ఈ ప్రశ్నకు లభించే సమాధానం– ఆధిపత్యానికి చాలా గుట్టుగా జరుగుతున్న అంతర్గత పోరులో సానుకూలతలు ఎవరికి ఉన్నాయనేది స్పష్టం చేస్తుంది.

'మార్గదర్శక్' లాంటి పాత్రకు పరిమితమయ్యేలా ప్రధాని మోదీని బలవంతం చేయలేమన్న యథార్థాన్ని ఆరెస్సెస్ గ్రహించింది. మోదీ అనంతర బీజేపీకి యువ నాయకత్వాన్ని సమకూర్చేందుకు మరింత సర్వ జనామోద మార్గాన్ని సృష్టించాలని సంఘ్ అభిలషిస్తోంది. 'కౌన్ బనేగా బీజేపీ ప్రెసిడెంట్' అన్న క్లిష్టమైన ప్రశ్నకు లభించే సమాధానం– ఆధిపత్యం కోసం గుట్టుగా జరుగుతున్న అంతర్గత పోరులో సానుకూలతలు ఎవరికి ఉన్నాయో స్పష్టం చేస్తుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

తలసేమియా రోగులకు పెన్నిధి!

తలసేమియా ఒక జన్యు సంబంధమైన ప్రాణాంతక వ్యాధి. భారతదేశంలో సుమారు మూడు కోట్ల 50 లక్షలకు పైగా పిల్లలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తలసేమియా రోగులకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కీలకమైన సహాయాన్ని అందిస్తోంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా 25 బెడ్స్‌తో తలసేమియా కేర్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. ఈ వ్యాధి సంక్రమించిన రోగులకు సురక్షితమైన రక్తం, ఫిల్టర్స్, మందులను ఉచితంగా అందిస్తోంది. ఈ వ్యాధిగ్రస్త పిల్లలకు 21,234 యూనిట్లు, ప్రభుత్వ ఆసుపత్రులకు 60,975 యూనిట్ల రక్తాన్ని సరఫరా చేసింది. ఎన్టీఆర్ ట్రస్ట్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాలుగు NABH–ac–క్రెడిటెడ్, ISO 9000:2015–సర్టిఫైడ్ బ్లడ్ బ్యాంకులను నిర్వహిస్తోంది. రక్త భద్రత కోసం అధునాతన రోబోటిక్ పరీక్షను ఉపయోగిస్తోంది. HIV, హెపటైటిస్ B & C, మలేరియా వంటి వ్యాధుల కోసం స్క్రీనింగ్ చేస్తోంది. తలసేమియా బారిన పడిన వారికి సంవత్సరానికి ఒక బిడ్డకు అయ్యే ఖర్చు–వివరాలు పరిశీలిస్తే రక్త యూనిట్లకు రూ.51,000; ల్యూకో ఫిల్టర్‌కు రూ.26,000; మందులు రూ.84,000; విటమిన్ సప్లిమెంట్లు రూ.20,000; వైద్య పరీక్షలకు రూ.32,000; రవాణా, ఆహారం తదితరాలకు రూ. 37,000... వెరసి సంవత్సరానికి సుమారు రూ.2,50,000 ఖర్చవుతుంది. ప్రతి తలసేమియా రోగికి సంవత్సరానికి 17 సార్లు రక్త మార్పిడి చేయాలి. ఈ పరిస్థితిని అధిగమించడానికి సాధారణ ప్రజలలో అవగాహన పెంచడం తప్పనిసరి.



దేశ రాజకీయాల్లో గొప్ప నాయకుడిగా, ప్రజల దేవుడిగా గుర్తింపు పొందిన నందమూరి తారకరామారావు కుమార్తె నారా భువనేశ్వరి తన తండ్రి ఆశయాలను ఆచరించడమే కాక, వాటిని విస్తరిస్తున్నారు. మానవ సేవే మాధవ సేవ అనే తత్వాన్ని అక్షర సత్యంగా నమ్మే భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, పేదలకు అండగా నిలుస్తున్నారు. ఈ ట్రస్ట్ వేలాది పేదలకు, విద్యార్థులకు, తలసేమియా రోగులకు, మహిళలకు, విపత్తు బాధితులకు ప్రాణవాయువుగా నిలుస్తోంది. సీఎం చంద్రబాబు సతీమణిగా మాత్రమే కాక, సామాజిక సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న వ్యక్తిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు భువనేశ్వరి.

ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా కేంద్రాలకు నిధులు సేకరించడానికి విజయవాడలో 'యు–ఫోరియా' మ్యూజికల్ నైట్, స్వచ్ఛంద రక్తదానాలను ప్రోత్సహిస్తోంది. విశాఖపట్నంలో తలసేమియా రన్ వంటి అవగాహనా కార్యక్రమం ద్వారా నిధులు సేకరించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలోనే మరోసారి ఈ నెల 19న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం ఒక అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నది. తలసేమియా రోగులకు అత్యవసర పరిస్థితుల్లో ఉచితంగా ప్లేట్‌లెట్లు, వైద్యం, మందులు అందిస్తూ, వైద్యశిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ప్రశంసించాయి. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ దేశంలోని అత్యాధునిక సౌకర్యాలతో నడుస్తున్న రక్తదాన సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో భువనేశ్వరి నిబద్ధత, నిస్వార్థ సేవ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలు వ్యక్తిగత ప్రచారానికి సంబంధించినవి కావు. స్వార్థం లేని సేవే, శాశ్వత కీర్తిని అందిస్తుంది. నారా భువనేశ్వరి చేపట్టిన సేవా యజ్ఞం నిరంతరం కొనసాగాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుందాం.

– నీరుకొండ ప్రసాద్

రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు మంచి రోజులు

మెరుగైన విద్యా బోధనతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం అనే నినాదంతో విద్యాశాఖ అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థకు పట్టిన గ్రహణం వీడిందనడానికి విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అమలు చేసిన సంస్కరణలే నిదర్శనం. విద్యావ్యవస్థను పటిష్ఠం చేసి, ఆ వ్యవస్థపై ఆయన తనదైన ముద్ర వేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను ప్రణాళికాబద్ధంగా మార్చేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఏడాది కాలంలోనే గతంలో గాడి తప్పిన వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నం చేసి, సఫలమయ్యారు.

ఏ మాత్రం కసరత్తు లేకుండా గత ప్రభుత్వం సీబీఎస్ఈ, ఇంగ్లిష్ మీడియం, ఐబీ అంటూ పిల్లలపై తీవ్ర ఒత్తిడి పెంచింది. పాఠశాలల రంగుల కోసం నాడు–నేడు పేరుతో వేల కోట్లు ఖర్చు పెట్టినట్టు గణాంకాలు చూపించింది. కానీ ఒక్క టీచర్‌ని కూడా నియమించలేదు. ఆ పరిస్థితుల్ని పూర్తిగా మార్చేందుకు లోకేష్ బాధ్యతలు తీసుకున్న తొలిరోజు నుంచే ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఓ ఏకోపాధ్యాయ స్కూల్ టీచర్ తన స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దిన విషయాన్ని తెలుసుకుని, ఆ ఉపాధ్యాయినిని ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లను సంస్కరించాలంటే ఏం చేయాలో ఆమె నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. వాటిని అమలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ ప్రారంభిస్తున్నారు.

ఏడాదిలో విద్యాశాఖలో పెను మార్పులు వచ్చాయి. విద్యార్థుల సంక్షేమం, ఉపాధ్యాయుల భారం తగ్గించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, విద్య నాణ్యత పెంచడంపై దృష్టి పెట్టారు. విద్యాశాఖలో రాజకీయ ప్రభావాన్ని తొలగించాలని నిర్ణయించారు. విద్యా కార్యక్రమాలు లేదా విద్యార్థులకు అందించే సామగ్రిపై రాజకీయ నాయకుల ఫోటోలు లేదా పార్టీ రంగులు ఉండకుండా నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు హాజరయ్యేలా ఒత్తిడి చేయకుండా, వారి విద్యపై దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జాబ్ ఫెయిర్‌లు తప్ప ఇతర రాజకీయ కార్యక్రమాలకు విద్యార్థులను తీసుకెళ్లకూడదని ఆదేశించారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు.

ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేలా మంత్రి లోకేష్ ప్రయత్నిస్తున్నారు. గతంలో లేని విధంగా టీచర్స్–పేరెంట్స్ మీటింగ్స్ పెడుతున్నారు. అందరినీ సమన్వయం చేయడం ద్వారానే మంచి ఫలితాలు వస్తాయనే సదుద్దేశంతో విద్య నాణ్యతను మెరుగుపరచడానికి కొత్త కరికులం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్నల్ మార్కుల విధానాన్ని సీబీఎస్ఈ తరహాలో ప్రవేశపెట్టడంతో పాటు జనవరి నాటికి ప్రీ–ఫైనల్ పరీక్షలను పూర్తి చేయాలని ప్రతిపాదించారు. గతంలో ఉపాధ్యాయులు

ఏడాదిలో విద్యాశాఖలో పెను మార్పులు వచ్చాయి. విద్యార్థుల సంక్షేమం, ఉపాధ్యాయుల భారం తగ్గించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, విద్య నాణ్యత పెంచడంపై దృష్టి పెట్టారు. విద్యార్థులకు అందించే సామగ్రిపై రాజకీయ నాయకుల ఫోటోలు, పార్టీ రంగులు ఉండకుండా నిర్ణయాలు తీసుకున్నారు.



బహుళ యాప్‌ల వినియోగం వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించడానికి వాటి తప్పనిసరి వినియోగాన్ని తగ్గించే నిర్ణయం తీసుకున్నారు. 16,437 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి మెగా డీఎస్సీ ప్రకటించారు. త్వరలో నియామకాలు పూర్తి అవుతాయి. గత వైసీపీ పాలనలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఏడాది చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించి వారి మెప్పు పొందారు. గత ప్రభుత్వంలో దొడ్డిదారిన బదిలీలు చేసి, ఇష్టం వచ్చిన రీతిలో అందిన కాడికి దోచుకున్నారు. అంతేకాకుండా కేటగిరి 1, 2 పోస్టులు బ్లాక్ చేసేవారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా అన్ని ఖాళీలు చూపించి, బదిలీల ప్రక్రియను విజయవంతం చేసింది. త్వరలోనే డీఎస్సీ నియామకాలు పూర్తి అయ్యే అవకాశం ఉండడంతో అన్ని పాఠశాలల్లో ఖాళీలు భర్తీ అయి, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుంది. అలాగే ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఖాళీలు భర్తీ చేయడానికి మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారు.

తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల మందికి పైగా సుమారు పదివేల కోట్లు వెచ్చించి ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంతమంది అర్హులున్నా ఇవ్వడం భారతదేశ చరిత్రలోనే చిరస్థాయిగా మిగిలిపోతుంది. అది కూడా పాఠశాలలు పునః ప్రారంభ రోజుల్లోనే ఇవ్వడం వల్ల ఆ నిధులను విద్యార్థుల ఫీజులకు సక్రమంగా ఉపయోగించుకుంటున్నారు. గత ప్రభుత్వం సరైన సమయంలో ఇవ్వకపోవడం వల్ల ఆ నిధులు దుర్వినియోగం అయ్యేవి. అలాగే ఎస్ఆర్ కేవీఎం విద్యా కిట్లు కూడా ఇంటర్ వరకు ఇవ్వడం శుభ పరిణామం. గత ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదు, కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు చేసి నిరుపేద విద్యార్థుల ఆకలి తీర్చింది.

రాష్ట్రంలో విద్యను పూర్తి చేసి ఉద్యోగాలు, ఉపాధి కోసం ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస పోకుండా, మన విజ్ఞానం మనకే ఉపయోగించాలి అనే నినాదంతో ఇక్కడ చదివిన వారికి ఈ రాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నది. భారీ పెట్టుబడులు సాధించి పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి జరుగుతోంది. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల మాదిరిగా వృత్తి నైపుణ్య, ఐటీ, ఏఐ, రంగాన్ని ప్రోత్సహిస్తూ స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగేలా విశేష కృషి జరుగుతోంది.

మొత్తంగా విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ ముద్ర చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవిష్యత్తులో ఆయన మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చి అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటించే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.




■ వాసంశెట్టి సుభాష్
రాష్ట్ర కార్మికశాఖ మంత్రి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

శుక్రవారం 18 జూలై 2025



గురువారం ఉదయం : ఎండ తీవ్రతకు రామవరప్పాడు వద్ద తాటాకు నీడలో వెళ్తున్న వ్యక్తి

ప్రభుత్వాసుపత్రిలో హార్ట్ సర్జరీలకు బ్రేక్

- వైద్యుల కొరతతో ఆగిన బైపాస్ సర్జరీలు
- ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్న వైద్యులు

8





● సూపర్ స్వచ్ఛత

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో విజయవాడ నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛత అవార్డు అందుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి మంత్రి పి.నారాయణ, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర ఈ అవార్డు తీసుకున్నారు.

6



గురువారం సాయంత్రం : ఎన్టీఆర్ సర్కిల్ వద్ద భారీ వర్షం

ఎండ.. వాన..

ఉదయమంతా ఎండ, వేడిగాలులు, ఉక్కపోత, సాయంత్రం కాగానే ఈదురుగాలులు, భారీ వర్షం.. నగరంలో గురువారం వింత వాతావరణం కనిపించింది. ఉదయమంతా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేదతీరారు. సుమారు గంటపాటు వర్షం కురవడంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

ముంచెత్తగా..

నగరంలో పేరుకుపోయిన చెత్త

ఐదు రోజులుగా వీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మె

- సమ్మెలో పాల్గొంటున్న సుమారు 4 వేల మంది కార్మికులు
- మరో 4 వేల మంది పాల్గొనేందుకు సిద్ధం
- చెత్త తొలగించేవారు లేక అస్తవ్యస్త వాతావరణం
- వర్షం కూడా తోడవడంతో ఒకటే కంపు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

చెత్త.. చెత్త.. చెత్త.. నగరంలో ఎక్కడచూసినా చెత్తకుప్పలే. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తుండటంతో వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. తొలగించేవారు లేక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయాయి. గురువారం వర్షం కూడా తోడవటంతో దోమల వ్యాప్తి పెరిగింది. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మికులు దాదాపు 4 వేల మంది ఇప్పటికే సమ్మెలో పాల్గొంటుండగా, ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు మరో 4 వేల మంది కూడా సమ్మె చేయడానికి సిద్ధమవుతుండటంతో పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయి.





రాజీవ్‌గాంధీ పార్కు వద్ద రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త (ఇన్‌సెట్‌లో) గురునానక్ కాలనీలో పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్) : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. ప్రత్యామ్నాయ సిబ్బందితో పనిచేయిస్తున్నా పూర్తిస్థాయిలో చెత్త సేకరించే వారు లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. చెత్త పేరుకుపోయి కంపు కొడుతుండగా, గురువారం కురిసిన వర్షానికి ఆ వ్యర్థాలన్నీ చెల్లాచెదురయ్యాయి. సైడ్ డ్రెయిన్లకు అడ్డుపడటంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు చెరువులను తలపించింది. నగరంలో సుమారు వెయ్యి టన్నుల చెత్త పేరుకుపోయిందని అంచనా. వర్షాలు మిగతా 6లో..

మంచినీటి సమస్య బాబోయ్

నగరంలో మంచినీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ సమ్మెలో మూడు సర్కిళ్లకు చెందిన 300 మంది మంచినీటి సరఫరా కార్మికులు కూడా పాల్గొన్నారు. దీంతో ఆయా సర్కిళ్ల పరిధిలో మంచినీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సర్కిల్‌కు 60 మంది వాటర్ సప్లయ్ వాల్స్ తిప్పే కార్మికులున్నారు. ఐదు రోజులుగా మూడు సర్కిళ్లలో వాటర్ సప్లయ్ కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో కొండప్రాంతాల్లో సమస్య తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లు నీటిని అందిస్తున్నా సరిపోని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం, అధికారులు కార్మికులతో మాట్లాడి సమ్మె విరమింపజేయాలని నగరవాసులు కోరుతున్నారు.

అంతిమంగా విడిపోయారు

ఇద్దరు స్నేహితుల కథ విషాదాంతం

జంట హత్యల కేసులో దారుణం

- క్యాటరింగ్ పనిలో కలిసిన ఇద్దరు స్నేహితులు
- కలిసిమెలిసి ఒకే గదిలో పెరిగిన మైత్రీబంధం
- రౌడీషీటర్ రాకతో మొదలైన గొడవలు
- ఇద్దరి స్నేహంపై పగ పెంచుకుని హత్య
- వెంకటరమణ మృతదేహాన్ని తీసుకెళ్లిన బంధువులు
- రాజు బంధువులు రాకపోవడంతో మార్చురీలోనే మృతదేహం
- ఇన్నాళ్లూ కలిసి ఉన్న స్నేహం.. మరణంతో దూరం





మార్చురీ వద్ద రాజు, వెంకటరమణ మృతదేహాలు (ఇన్‌సెట్‌లో) రాజు (ఫైల్)

ఊర్లు వేరైనా ఉపాధి ఇద్దరినీ కలిపింది. విధి కూడా విడదీయలేనంత స్నేహాన్ని పెంచింది. ప్రాణ స్నేహితులుగా మార్చింది. సాఫీగా సాగిపోతున్న వారి స్నేహంలోకి ఓ రౌడీషీటర్ ప్రవేశించాడు. వారి మైత్రిని చూసి కుళ్లుకున్నాడు. అదునుగా భావించి కత్తితో పొడిచి పొడిచి ఇద్దరు స్నేహితులను చంపేశాడు. విధి ఎంత బలీయమైనదో.. ఇన్నాళ్లు కలిసుండి, మరణంలోనూ కలిసి పోరాడి, ఆ తర్వాత మాత్రం ఆ స్నేహితులు విడిపోయారు. ఒక స్నేహితుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు విజయనగరం తీసుకెళ్లిపోగా, మరో స్నేహితుడికి ఎవరూ లేకపోవడంతో అనాథలా మార్చురీలోనే ఉండిపోయాడు. బుధవారం గవర్నర్‌పేటలో జరిగిన జంట హత్య కేసులో ఇద్దరు స్నేహితుల కథ అలా విషాదాంతమైంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయనగరానికి చెందిన జి.వెంకటరమణ (38) తన కుటుంబ అవసరాలకు డబ్బు పంపడానికి ఉపాధి నిమిత్తం విజయవాడ వచ్చాడు. ఇక్కడ క్యాటరింగ్ పనిలో చేరాడు. వన్‌టౌన్‌కు చెందిన ఎస్.రాజు (35) 15ఏళ్ల కిందట కుటుంబ సభ్యులతో గొడవ పడి బయటకు వచ్చేశాడు. అతడూ క్యాటరింగ్‌లో చేరాడు. ఆ తర్వాత ఇంటిముఖం మిగతా 6లో..

ఆ 90 రోజులు రద్దు

ఇక ట్రాఫిక్ చలానా అప్పటికప్పుడు కట్టాల్సిందే..

- మూడు నెలల గడువును ఎత్తేసిన పోలీసులు
- బకాయిలు భారీగా పేరుకుపోవడంతో నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాఫిక్ చలానాల చెల్లింపునకు 90 రోజుల గడువును రద్దు చేశారు. హెల్మెట్ ధారణ, సిగ్నల్ జంపింగ్, స్టాప్‌లైన్ దాటడంపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. ఈ జరిమానాల చెల్లింపునకు సంబంధించి పోలీసులు 90 రోజుల గడువు ఇచ్చారు. మూడు నెలల్లోపు జరిమానాలు చెల్లించకపోతే వాహనాలు సీజ్ చేస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఆ గడువును రద్దు చేశారు. ఇక నుంచి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి పోలీసులకు చిక్కితే వెంటనే జరిమానా చెల్లించాల్సిందే.

పేరుకుపోతున్న బకాయిల వల్లే..

ట్రాఫిక్ పోలీసులు రెండు విధాలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. సిగ్నల్ జంపింగ్‌లకు ఆర్ఎల్‌వీడీ (రెడ్‌లైట్ వైలేషన్ డిటెక్షన్) సీసీ కెమెరాల ద్వారా గుర్తిస్తున్నారు. ఇదికాకుండా ట్రాఫిక్ పోలీసులు కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించకపోయినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, బీమా రెన్యువల్ కాకపోయినా, రికార్డు లేకపోయినా జరిమానా విధిస్తున్నారు. రోజుకు మొత్తం 1,000 చలానాలను కాంటాక్ట్, నాన్ కాంటాక్ట్ విధానంలో విధిస్తున్నారు. చలానా విధించాక వాహనాలను వదిలిపెట్టడంతో ఉల్లంఘనులు వాటిని చెల్లించడం లేదు. దీంతో చలానాల పెండింగ్ జాబితా పెరిగిపోతోంది. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో 32 వేల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఉల్లంఘనులకు జరిమానాల చెల్లింపు విషయంలో మూడు నెలల గడువు అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో 90 రోజుల గడువును ట్రాఫిక్ పోలీసులు రద్దు చేశారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

6

టీడీపీ, వైసీపీ శ్రేణుల పోటాపోటీ నిరసనలతో గురువారం బందరు హోరెత్తింది. పోలీస్ అధికారులంతా హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటనలో ఉండగా, వైసీపీ మహిళా నేతలు మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి సమీపంలో చీపుర్లతో నిరసన ప్రదర్శన చేశారు. మంత్రి చిత్రపటాలను నేలపై వేసి కాళ్లతో తొక్కుతూ విమర్శలు చేశారు. ప్రతిగా తెలుగు మహిళలు పేర్ని నాని ఇంటి సమీపంలో నిరసన ప్రదర్శన చేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు పార్టీలను అదుపు చేశారు.

పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీడీపీ నాయకులు



మంత్రి రవీంద్ర ఫొటోలు, చీపుర్లతో వైసీపీ మహిళల నినాదాలు



పోటాపోటీగా..

బందరులో రోడ్డెక్కిన వైసీపీ, టీడీపీ శ్రేణులు

- మంత్రి రవీంద్ర ఇంటి సమీపంలో చీపుర్లతో వైసీపీ మహిళల ఆందోళన
- కొల్లు చిత్రపటాలు కిందపడేసి కాళ్లతో తొక్కుతూ వ్యతిరేక నినాదాలు
- ప్రతిగా స్పందించి రోడ్డుపైకి వచ్చిన తెలుగు మహిళలు
- పేర్ని నాని ఇంటి సమీపంలో దిష్టిబొమ్మ దహనం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో టీడీపీ, వైసీపీ మధ్య నెలకొన్న రాజకీయ వివాదం రోజురోజుకు తీవ్రమవుతోంది. టీడీపీ నాయకులు 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తుంటే, దీనికి పోటీగా వైసీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' పేరుతో నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ఓ అడుగు ముందుకేసి కూటమి అధినాయకులపై, జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. దీంతో మచిలీపట్నానికి చెందిన మంత్రి రవీంద్ర, మాజీమంత్రి పేర్ని మధ్య వారం రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది.

వివాదాస్పద వ్యాఖ్యలతో..

పామర్రు నియోజకవర్గంలో జరిగిన వైసీపీ నియోజకవర్గస్థాయి సమావేశంలో పేర్ని నాని వివాదాస్పద మిగతా 6లో..

మ్యాపింగ్‌ను మార్చండి

గతంలోని ప్రజాసాధికార సర్వేనే అమలు చేయాలి

- వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటి మ్యాపింగ్‌కు శ్రీకారం
- కుటుంబాల లెక్కల్లో వివక్ష.. వైసీపీ వారికే న్యాయం
- తిరిగి ప్రజాసాధికార సర్వేను తెస్తే అందరికీ సమన్యాయం
- ఐదేళ్లు ఏ పథకాలూ అందని తెలుగు తమ్ముళ్ల అభిప్రాయం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో తలపెట్టిన 'మ్యాపింగ్'ను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంపై తెలుగు తమ్ముళ్లు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడు, ఇప్పుడు కూడా ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరుగుతోందని అభిప్రాయపడుతున్నారు. ఇదే విధానాన్ని ముందుకు తీసుకెళ్లడం వల్ల భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయని అంటున్నారు. సొంత పార్టీకి చెందినవారికి కూడా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ మ్యాపింగ్ విధానాన్ని తీసుకొచ్చిందని, దానిని రద్దుచేసి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'ప్రజాసాధికార సర్వే'ను అమల్లోకి తీసుకురావాలంటున్నారు. అప్పుడైతేనే పార్టీలకతీతంగా సమన్యాయం జరుగుతుందనేది తమ్ముళ్ల మాట.

వైసీపీ హయాంలో మ్యాపింగ్ మైండ్‌గేమ్

వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాసాధికార సర్వేను కాదని, మ్యాపింగ్ విధానాన్ని ఎంచుకుంది. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసిన కొత్తలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్దేశంతో ఈ మ్యాపింగ్‌ను చేపడుతున్నట్టు మిగతా 6లో..

వీడిన చిక్కుముడి

వెస్ట్ బైపాస్ పనులకు మార్గం సుగమం

- పాత అలైన్‌మెంట్ ప్రకారమే విద్యుత్ టవర్ల మార్పిడి
- నవంబరు, డిసెంబరు నాటికి అందుబాటులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బైపాస్ (ప్యాకేజీ-3) చిక్కుముడి వీడింది. దాదాపు ఆరు నెలలుగా రైతులతో నెలకొన్న విద్యుత్ హైటెన్షన్ లైన్ల అలైన్‌మెంట్ వివాదానికి జాతీయ రహదారుల సంస్థ అధికారులు ఫుల్‌స్టాప్ పెట్టారు. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్ల అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనను వారు విరమించుకున్నారు. పాత అలైన్‌మెంట్ విధానంలో కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ల్యాంకో సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారి స్థలాల్లో టవర్లను తొలగించటానికి వీలుగా అదే లైన్‌లో వేరేచోట టవర్లను వేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం జక్కంపూడిలోని రెండు టవర్లతో సమస్య నెలకొంది. ఈ రెండు టవర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఈ ప్రాంతంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులకు ఇబ్బంది ఏర్పడింది. ఈ రెండు టవర్లను ఇప్పుడున్న చోటే, కొత్తగా ఎత్తయిన రెండు టవర్లు వేసి, వాటికి కనెక్షన్ ఇవ్వాలనుకున్నారు. కొత్త టవర్లు ఎత్తుగా ఉండటం వల్ల జక్కంపూడి దగ్గర ఆర్‌వోబీ నిర్మాణ పనులకు ఇబ్బంది ఉండదు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. ఈ పనులు పూర్తికాగానే, రోడ్డు కాంట్రాక్టు సంస్థ పనులు చేపడుతుంది. ఈ సమస్యకు సంబంధించి రైతులు ఆరు నెలలుగా కోర్టులో పోరాడుతున్నారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి, కేంద్ర రహదారుల శాఖ మంత్రికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కమిటీని వేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోమని ఆదేశించింది. ఈ కమిటీ సిఫార్సులకు జాతీయ రహదారుల సంస్థ అంగీకారం తెలపడంతో కథ సుఖాంతమైంది. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-3 పనులు నవంబరు, డిసెంబరు నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశముంది.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, చిత్రంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ప్రభుత్వ విప్ యార్లగడ్డ, ఎమ్మెల్యేలు రాము, కుమార్‌రాజా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు తదితరులు

పోలీసులకు అత్యాధునిక శిక్షణ

- హోంమంత్రి వంగలపూడి అనిత
- బందరులో జిల్లా పోలీస్ శిక్షణకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

8



పార్కింగ్‌లో తమ వాహనాలను వెతుకుతున్న వాహనదారులు

జీజీహెచ్‌లో భద్రత డొల్ల!

» సెక్యూరిటీ వైఫల్యం.. వార్డుల్లో, బయటా చోరీలు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. బైకులు, కార్లు ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అదుపుచేయాల్సిన సెక్యూరిటీ విభాగం పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. రోగులను తీసుకువచ్చే అంబులెన్సులు, ఇతర వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల జీజీహెచ్‌లో వాహనాలు చోరీకి గురవుతుండటంతో భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ విభాగం పట్టనట్టు వ్యవహరిస్తోందని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు పటిష్టంగా ఉండాలని ఆదేశించినా సెక్యూరిటీ విభాగం పెడచెవిన పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ లోపం కారణంగా ఆసుపత్రిలో రోగులు, సహాయకుల వస్తువులు మాయమవుతున్నాయి. అధికారులే వచ్చినప్పుడు మాత్రమే కనిపించే సెక్యూరిటీ హడావుడి తరువాత ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి. నిబంధనల ప్రకారం సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత ప్రధానగేటు, మార్చురీ వైపు గేటు మినహా అన్ని గేట్లు(కాలేజీ గేటు సహా) మూసేయాలి. కొన్ని రోజులు ఈ నిబంధన పాటించినప్పటికీ తర్వాత విస్మరించడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. ఆసుపత్రికి, కాలేజీకి మధ్య ఖాళీ స్థలంలో మందుబాబులు, ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. గంజాయి బ్యాచ్‌లు సంచరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చురీ వైపు సీసీ కెమెరాలు లేకపోవడం, సెక్యూరిటీ లేకపోవడంతో ఆసుపత్రిలో దొంగతనాలు చేసేవారు సులువుగా బయటకు వెళ్లిపోతున్నారు.



మెయిన్ గేటు వద్ద అడ్డంగా నిలిపి ఉంచిన కార్లు



ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

ఎంఏసీసీఎస్ అమలు చేయండి

» ఎంపీ కేశినేని శివనాథ్‌కు రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ల వినతి

రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏడో వేతన సంఘం సిఫారసులు అమలులోకి వచ్చిన 1 జూలై 2016 నుంచి మోడిఫైడ్ అష్యూర్డ్ కెరియర్ ప్రోగ్రెషన్ స్కీమ్ (ఎమ్.ఎ.సి.సి.ఎస్)ను అమలు చేయాలని ఆలిండియా రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (సౌత్ సెంట్రల్) బైద్యనాథ్ షా ఆధ్వర్యంలో నాయకులు ఎంపీని విజయవాడ గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. మోడిఫైడ్ అష్యూర్డ్ కేరియర్ ప్రోగ్రెషన్ స్కీమ్‌ను 2016 నుంచి కాకుండా 2018 నుంచి ఇంప్లిమెంట్ చేస్తున్నారు. ఇందువల్ల స్టేషన్ మాస్టర్‌లకు నష్టం జరుగుతుందని, 2016 నుంచి ఇంప్లిమెంట్ చేస్తే స్టేషన్ మాస్టర్లతో పాటు రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్‌కు ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు. సమస్యపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. నాయకులు టి.వి.కె.ఎం.చలపతిరావు, ఎం.సాంబిరెడ్డి, కె.వి.ఎ.ఎస్.శాస్త్రి, ఎం.శేషసాయిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎవరివో తేల్చుకుందామా..

» పేర్ని నానికి యార్లగడ్డ సవాల్



మచిలీపట్నం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ హయాంలో ఎవరు ఎక్కువ కేసులు పెట్టారో, టీడీపీ ఏడాది పాలనలో ఎక్కువ కేసులు పెట్టారో తేల్చుకుందామా.. అంటూ మాజీ మంత్రి పేర్నినానికి గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సవాల్ విసిరారు. మచిలీపట్నం ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యార్లగడ్డ మాట్లాడారు. గన్నవరంలో ఎన్నికల ప్రచారంలో వైసీపీ కార్యకర్తలపై కేసులు పెట్టలేదన్నారు. ఏడాదిగా ఎవరిపై ఏ స్టేషన్‌లోనూ తప్పుడు కేసులు పెట్టలేదన్నారు. పేర్ని నానిలా సభ్యసమాజం తలదించుకునే విధంగా అసభ్యకరంగా ఏనాడూ తాను మాట్లాడలేదన్నారు. పేర్నికృష్ణమూర్తి ప్రతిపక్ష నాయకులపై అసభ్యకరంగా మాట్లాడిన సందర్భాలు కూడా లేవన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లపై అసభ్యంగా మాట్లాడటం పేర్ని నానికి తగదన్నారు. పార్లమెంటులో వైసీపీ ఎంపీలు హాజరవుతున్నా.. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు హాజరుకాలేక పోతున్నారని ప్రశ్నించారు. గుండె చికిత్స చేయించుకున్నట్టు చెబుతున్న ఓ వైసీపీ నేత బెల్టు తీస్తే ఎక్కడ పోలీసులు అరెస్టు చేస్తారోనని భయంతో బెల్టుతోనే నెలల తరబడి తిరుగుతున్నాడన్నారు. పేర్నినాని తన భాష మార్చుకోవాలన్నారు. పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, ఎన్టీరామారావు వంటి ప్రముఖులు జన్మించిన కృష్ణాజిల్లాలో వైసీపీ నాయకులు మాట్లాడే భాష విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బచ్చుల బోసుబాబు తదితరులు మాట్లాడారు.

సమన్యాయం చేయండి

» పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకువచ్చిన సీఎం చంద్రబాబు మాదిగలకు 7, మాలలకు 7, ఉప కులాలకు 1శాతం కేటాయించి సమన్యాయం చేసేలా చట్టం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. మూడు దశాబ్దాల మాదిగల మహోద్యమ సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. అమరావతిలో మాదిగల సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని, బాబూ జగ్జీవన్‌రామ్, గుర్రం జాషువా స్మృతివనం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవో 46ను రద్దు చేసి మాదిగలకు ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించి మాదిగల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మాదిగలకు సామాజిక న్యాయం జరిగేలా చట్టం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కుంటిమద్ది ఓబులేసు, తప్పేట హరిబాబు, సుజన్‌రావు, రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

వీఎంసీకి సూపర్ స్వచ్ఛత లీగ్ అవార్డు

గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ)లో సెవెన్ స్టార్ రేటింగ్



కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షన్-2024లో విజయవాడ నగరపాలక సంస్థ సూపర్ స్వచ్ఛత అవార్డును అందుకుంది. గార్బేజ్ ఫ్రీ సిటీలో సెవెన్ స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకుంది. 10లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల కేటగిరిలో వీఎంసీ ఈ అవార్డు అందుకుంది. ఇండోర్, సూరత్, నవీ ముంబై తరువాత విజయవాడ ఈ అవార్డును దక్కించుకుంది. స్వచ్ఛ సర్వేక్షన్- 2024 పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరు నారాయణ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో 10 లక్షల జనాభా కంటే ఎక్కువ ఉన్న జాబితాలో విజయవాడ నగరపాలక సంస్థ, ఇండోర్, సూరత్, నవీ ముంబై తర్వాత చేరుకోవటం ఇదే మొదటి సారి అని, విజయవాడకు మరో పురస్కారం గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో సెవెన్ స్టార్ రేటింగ్ వచ్చిందన్నారు. వీఎంసీతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఐదు నగరాలకు అత్యుత్తమ పురస్కారమైన స్వచ్ఛ సర్వేక్షన్ పురస్కారాలు అందుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, 2021 తర్వాత మళ్లీ అవార్డు అందుకోవటం ఇది రెండోసారి అని, ఇప్పటివరకు విజయవాడ నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ స్థానాలలోనే కైవసం చేసుకుందని, ప్రసుత్తం సూపర్ స్వచ్ఛత లీగ్ పురస్కారం దక్కిందన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం మాట్లాడుతూ, సూపర్ స్వచ్ఛత లీగ్‌లో స్థానం దక్కించుకోవాలంటే గత మూడేళ్లలో ఒక్కసారైనా ప్రథమ మూడు స్థానాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు గెలిచి ఉండాలని, 2024వరకు మొదటి 20 స్థానాలలో నగరం ఉండాలని, ఈ నిబంధనలకు అనుగుణంగా సూపర్ స్వచ్ఛత లీగ్‌లో అత్యుత్తమ స్థానాలలో ఉన్న ఇండోర్, సూరత్, నవీ ముంబైతోపాటు విజయవాడ నగరపాలక సంస్థ కూడా స్థానం దక్కించుకుందన్నారు. దీనిలో గత మూడు సంవత్సరాలుగా విజయవాడ నగరపాలక సంస్థను ఉత్తమ స్థానాల్లో నిలిపిన కమిషనర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్, డాక్టర్ పి.సంపత్‌కుమార్, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఎండీ వి.అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఎస్ఈ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ రజియా షబినా తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ప్రమేయం లేకుండా కమిటీలా!

» సహకార సంఘాల త్రీమెన్ కమిటీల ఎంపికపై పలువురు నాయకుల ఆగ్రహం
» తెలంగాణ ప్రాంతంలో రహస్యంగా ఎంపిక
» గతంలోను కమిటీల ఎన్నికలో వారిదే హవా
» ప్రస్తుత కమిటీలపై స్థానిక నేతల విస్మయం

(తిరువూరు,ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సహకార సంఘాల త్రీమెన్ కమిటీల ఎంపిక విజయవాడ ఎంపీ, తిరువూరు నియోజకవర్గం ప్రజాప్రతినిధులతో నిమిత్తం లేకుండా, పార్టీ బాధ్యులమని చెప్పుకునే కొందరు తమ ఇష్టానుసారంగా పేర్లు ప్రతిపాదించినట్టు స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, త్రీమెన్ కమిటీపై అభ్యంతరం తెలిపేందుకు ఎంపీని కలిసేందుకు విజయవాడకు వెళ్లారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 34 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ, కమిటీ పేర్లు అంటూ బయటకు రావడంతో కమిటీలను మార్చాలనే డిమాండ్ నాయకుల్లో వ్యక్తం అవుతోంది. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం 34 సొసైటీలకుగాను తిరువూరు మండలంలో 8 సొసైటీలు, గంపలగూడెంలో 12 సొసైటీలు, విస్సన్నపేటలో 7 సొసైటీలు, ఎ.కొండూరు 7 సొసైటీలు ఉన్నాయి. గతంలో కొన్ని సొసైటీలకు కమిటీలను స్థానిక నాయకత్వం ఏకగ్రీవంగా ఎంపిక చేయగా, మిగిలిన సొసైటీలకు త్రిసభ్య కమిటీ ఎంపిక కొందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్రంలోని ఓ గ్రామంలో కూర్చుని కమిటీ పేర్లు రాసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సొసైటీలకు ఇప్పటికే నియోజకర్గంలోని వివిధ మండలాల్లో సీనియర్లు, పార్టీకోసం పనిచేసిన వారిని విస్మరించి ఎటువంటి అర్హత లేకపోయినా కీలక పదవులు కట్టబెట్టారని, దీనిపై ఆగ్రహంతో ఉన్న కొందరు నాయకులు, కార్యకర్తలు 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి దూరంగా ఉంటున్నట్టు సమాచారం. సొసైటీల్లో బైటవారి పెత్తనాన్ని సహించేదిలేదని, పార్టీ అధిష్టానం దృష్టిసారించి సొసైటీ త్రీమ్యాన్ కమిటీలో తొలినుంచి పార్టీకి కట్టుబడి పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని నియోజకవర్గం పార్టీ శ్రేణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముంచెత్తగా..

(5వ పేజీ తరువాయి)

కురుస్తుండటం, చెత్త పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి పెరిగింది. అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

100 టన్నుల చెత్తతో అవస్థలు

నగరపాలక సంస్థలో సుమారు 4వేల మంది ఆప్కాస్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. నగర వ్యాప్తంగా రోజుకు 500 టన్నుల చెత్త వస్తుంది. రెండు రోజుల నుంచి క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో సుమారు 140 ప్రైవేట్ ట్రాక్టర్లతో డోర్ టు డోర్ చెత్త, ప్రధాన రహదారుల వెంబడి చెత్తను తరలిస్తున్నారు. రోజుకు సుమారు 400 టన్నుల మేర తరలిస్తున్నారు. వీఎంసీ పర్మినెంట్ సిబ్బంది 472 మంది, రోజువారీ కూలీలు 400 నుంచి 500 మంది, ఇతర సిబ్బందితో పనులు చేపడుతున్నా ఇంకా సుమారు 100 టన్నుల చెత్త మిగిలిపోతోంది.

కొండ ప్రాంతాల్లో కష్టాలు

కొండప్రాంతాల్లో చెత్త ఎక్కువగా ఉండిపోతోంది. కొత్తపేట, ఆంజనేయవాగు, చిట్టినగర్, పాలఫ్యాక్టరీ, చెరువు సెంటర్, కబేళా వద్ద కొండ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త కలెక్షన్ నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు సీఎన్‌జీ ఆటోలు వెళ్లే అవకాశం లేకపోవడంతో భారీగా పేరుకుపోతోంది. అలాగే ఉండిపోయిన చెత్త కాల్వల్లోకి చేరి నీటి ప్రవాహానికి అడ్డుగా మారుతోంది.

మ్యాపింగ్‌ను మార్చండి

(5వ పేజీ తరువాయి)

ప్రకటించింది. దీనిద్వారా ఇంట్లో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయో మ్యాపింగ్ చేశారు. ఆ మాటున వైసీపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆడింది. ఈ మ్యాపింగ్‌ను వలంటీర్లు చేయగా, వైసీపీకి చెందినవారు, ఆ పార్టీ అభిమానులు, సానుభూతిపరులకు ప్రయోజనం చేకూరేలా కుటుంబాల సంఖ్యను ఎక్కువగా చూపించారు. ఉమ్మడి కుటుంబాలను కూడా రెండుగా మ్యాపింగ్ చేశారు. ఇలా చేయడం వల్ల వైసీపీ అనుయాయులకే సంక్షేమ పథకాలు దక్కేవి. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులకు మాత్రం ఈ మ్యాపింగ్‌లో అన్యాయం జరిగింది. వేర్వేరు రేషన్ కార్డులు ఉన్నప్పటికీ ఒకే కుటుంబంగా చూపించారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుల అర్హత ప్రామాణికతను రద్దు చేసింది. కేవలం నిత్యావసరాల కోసం రైస్‌కార్డులు చెలామణి అయ్యేలా చేసింది. దీంతో ఒకే ఇంట్లో రెండు రేషన్ కార్డులున్నా.. సచివాలయ మ్యాపింగ్‌లో ఒకే కుటుంబంగా ఉంటే మాత్రం ఆ కుటుంబంలో ఒక్కరే పథకాలకు అర్హులయ్యేవారు. రెండు కుటుంబాలుగా ఉంటే ఇద్దరు అర్హత సాధించేవారు. భూములు, స్థలం, సొంత కార్లు, విద్యుత్ యూనిట్ల వాడకం, ఆదాయం వంటి అంశాలను నిర్దేశిత విధంగా ఉండాలన్న నిబంధనలను పొందుపరిచారు. వీటి మాటున పథకాలను కట్టడి చేసే వ్యూహాన్ని అమలు చేశారు. ఈ మ్యాపింగ్ విధానంతో తాము నష్టపోయామని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

అర్హులందరికీ పథకాల వర్తింపు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాసాధికార సర్వే నిర్వహించేవారు. రేషన్ కార్డుల ప్రాతిపదికనే ఈ సర్వే జరిగింది. ప్రజలందరికీ తెలిసేలా ఆన్‌లైన్‌లో (పబ్లిక్ డొమైన్)లో డేటా ఉంచింది. ఎవరైనా.. వారి రేషన్‌కార్డు, ఆధార్ కార్డు నెంబర్లను ఎంటర్ చేయగానే కుటుంబ వివరాలన్నీ తెలిసేవి. అన్ని పార్టీలకూ సమానంగా వారి అర్హతల ప్రాతిపదికన పథకాలు అందేవి. కాబట్టి ఆ సర్వేను ఇప్పుడు కూడా అమలు చేయాలని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చినా అదే మ్యాపింగా..

ఐదేళ్ల పాటు తాము నష్టపోయామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అదే మ్యాపింగ్ విధానాన్ని అనుసరించటం వల్ల తమతో పాటు, అర్హులంతా నష్టపోతున్నారని టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పథకాల అమలుకు పెట్టిన నిబంధనలు కూడా తూచా తప్పకుండా పాటించటం వల్ల సమస్యలు వస్తున్నాయంటున్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో ఆహార కమిషన్ చైర్మన్ తనిఖీలు



సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి

కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ తూర్పు- సెంట్రల్‌లో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. ఏపీ ఫుడ్ కమిషన్ వాట్సాప్ నెంబర్ 9490551117కు వీడియో ఆధారాలతో సహా హాస్టల్ పిల్లలు ఫిర్యాదులు చేయడంతో చైర్మన్ ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. తనిఖీలో భాగంగా సాయంత్రం 7 గంటలకు కిచెన్ రూంలో వంట కూడా మొదలుపెట్టలేదు. చైర్మన్, విద్యార్థులతో మాట్లాడగా ప్రతిరోజు ఉదయం అల్పాహారం తగినంత పెట్టడం లేదని, మధ్యాహ్నం పెరుగు బదులు మజ్జిగ ఇస్తున్నారని సాయంత్రం స్నాక్స్ (తినుబండారాలు) ఇవ్వడం లేదని రాత్రిపూట ఫ్రూట్స్ ఇవ్వడం లేదని హాస్టర్ విద్యార్థులు తెలిపారు. వారంలో రెండుసార్లు ఇచ్చే చికెన్ కూడా ప్రభుత్వం నిర్ణయించిన పరిమాణం (175గ్రా) అయితే 50 గ్రాములు కూడా ఇవ్వడం లేదని, ఇవే కాకుండా హాస్టల్లో నీటి సమస్య, బాత్రూం క్లీనింగ్ సమస్య, విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యార్థులు చైర్మన్‌కు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి మెనూ సక్రమంగా విద్యార్థులకు అందేలా ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.



బాధ్యతల అనంతరం సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఏఎంసీ చైర్మన్‌గా నర్రా వాసు బాధ్యతల స్వీకారం

గొల్లపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నర్రా వాసు గురువారం బాధ్యతలు చేపట్టారు. గొల్లపూడిలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారదా రాణి చైర్మన్‌తో ప్రొసీజర్ ప్రకారం బాధ్యతలు అప్పగించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకుని అమలు పరుస్తామన్నారు. రైతులకు ప్రభుత్వానికి వారధిలా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఏ సమయంలోనైనా తనను కలవవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవ్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, టీడీపీ అధ్యక్షుడు నూతులపాటి వెంకటేశ్వరరావు, గూడపాటి పద్మశేఖర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా..

(5వ పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేయడంతో ఈ వివాదం మొదలైంది. గుడివాడలో జరిగిన వైసీపీ సమావేశానికి వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రామును టీడీపీ నాయకులు అడ్డగించడంతో పరుష పదజాలంతో దూషించి, కారు అద్దాలు పగలకొట్టారని కూడా ప్రచారం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి వాడుకోవాలని మాజీ మంత్రి పేర్ని నాని పార్టీ అధిష్ఠానంతో ఫోన్‌లో మాట్లాడిన వీడియో బయటకు వచ్చింది. పెడన నియోజకవర్గంలో జరిగిన వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పేర్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలోనూ జెడ్పీ చైర్‌పర్సన్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి, కారు అద్దాలు పగలకొట్టారని చెప్పారు. దీంతో ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

దిష్టిబొమ్మల దహనం, చీపుర్లతో నిరసనలు

హోంమంత్రి అనిత మచిలీపట్నంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు గురువారం రావడంతో పోలీస్ అధికారులంతా కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదనుగా భావించిన వైసీపీ మహిళా విభాగం నేతలు, మేయర్‌లు, డెప్యూటీ మేయర్‌లు మంత్రి రవీంద్ర నివాసానికి సమీపంలోని జవ్వారుపేట సెంటరుకు చీపుర్లు చేతపట్టి వెళ్లి మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి ఫొటోలను కిందపడేసి కాళ్లతో తొక్కారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉంటే, గురువారం సాయంత్రం తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు మూకుమ్మడిగా తరలివచ్చి రామా నాయుడుపేట సెంటరులో పేర్ని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ఘటనలతో మచిలీపట్నంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే చర్చ నడుస్తోంది.



సాహిత్య సింధు బిరుదును అందుకుంటున్న జీవీ పూర్ణచంద్

పూర్ణచందుకు 'సాహిత్య సింధు' బిరుదు

విజయవాడ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలో నిర్వహించిన 3 రోజుల విద్వత్ సభలలో నగరానికి చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, భాషోద్యమ ప్రముఖులు డాక్టర్ జీవీ పూర్ణచంద్‌ని 'సాహితీ సింధు' బిరుదుతో తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేస్తున్నట్టు పలువురు వక్తలు తెలిపారు. ప్రసిద్ధ పంచాంగ కర్తలు బుర్రా వెంకటేశ్వర శర్మ, బుట్టే వీరభద్ర దైవజ్ఞ, ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, చల్లా శ్రీనివాసశర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి బహుమతి గ్రహీత పీటీజీవీ రంగాచార్యులు సభను నిర్వహించారు.



ప్రయాణికుల రద్దీ దృష్ట్యా

16 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు 16 ట్రిప్పుల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07481 తిరుపతి-చర్లపల్లి ప్రతి ఆదివారం నడుస్తుంది. ఆగస్టు 3 నుంచి 24వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు తిరుగుతుంది. 07482 చర్లపల్లి తిరుపతి ప్రతి సోమవారం నడుస్తుంది. ఆగస్టు 4 నుంచి 25వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు, 06085 ఎర్నాకుళం - పాట్నా ప్రతి శుక్రవారం నడుస్తుంది. ఈ నెల 25 నుంచి ఆగస్టు 15వరకు నాలుగు ట్రిప్పులు, 06086 పాట్నా - ఎర్నాకుళం ప్రతి సోమవారం నడుస్తుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు నాలుగు ట్రిప్పులు నడుస్తుంది. తిరుపతి-చర్లపల్లి ప్రత్యేక రైళ్లు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపర్తి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ స్టేషన్లలో ఆగుతాయి. అన్ని కోచ్‌లలో త్రీ ఏసీ ఉంటుంది. ఎర్నాకుళం-పాట్నా ప్రత్యేక రైళ్లు అలువ, త్రిశూర్, పలక్కాడ్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్డు, సేలం, జలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బెర్హంపూర్, బలుగాం, కుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జజ్జిపూర్, కియోన్‌జోర్ రోడ్డు, భద్రక్, బాలేశ్వర్, ఖర్గపూర్, అందుల్, దంకుని, బర్ధమాన్, దుర్గాపూర్, అశంసోల్, చిత్తరంజన్, జంతార, మధుపూర్, జసిద్ధి,జాజా, కియోల్, మొఖమా, భక్తియార్‌పూర్, పాట్నాసాహెబ్, రాజేంద్రనగర్ టెర్మినల్ స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైళ్లకు టూఏసీ, త్రీఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు అమర్చి ఉంటాయి.

అంతిమంగా విడిపోయారు

(5వ పేజీ తరువాయి)

చూడలేదు. తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నప్పటికీ ఎప్పుడూ ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం చేయలేదు. క్యాటరింగ్‌లో ఏర్పడిన పరిచయంతో రాజు, వెంకటరమణ గవర్నరుపేటలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరిద్దరి మధ్యలోకి 20 రోజుల కిందట రౌడీషీటర్ జమ్ము కిషోర్ వచ్చాడు. క్యాటరింగ్ పనిలో చేరి, ఇద్దరు స్నేహితుల గదిలోకి ప్రవేశించాడు. మొదటి నుంచి వారితో గొడవలు పడుతున్నాడు. రాజుతో ఎక్కువగా గొడవ పడినప్పుడు వెంకటరమణ మద్దతుగా ఉండేవాడు. రాజుపై కిషోర్ పలు సందర్భాల్లో దాడికి ప్రయత్నించాడు. ఆ సమయంలో వెంకటరమణ అడ్డుకున్నాడు. దీంతో కిషోర్‌లో వారిపై పగ పెంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం రాజు, వెంకటరమణతో పాటు బాషా, మరో యువకుడు మందు పార్టీ చేసుకున్నారు. ఉదయం 11 గంటల సమయంలో కిషోర్ గదికి వచ్చాడు. తాను నిద్రపోవాలని, ఇక్కడ మందు తాగితే ఎక్కడ నిద్రపోవాలని వారిని ప్రశ్నించాడు. వివాదం పెద్దదైంది. గదిలో ఉన్న కూరగాయలు కోసే కత్తి తీసుకుని రాజు, వెంకటరమణను కసితీరా పొడిచాడు. ఆ సమయంలో బాషాతో పాటు మరో యువకుడు అక్కడే ఉన్నారు. ఘటన జరిగిన వెంటనే బాషా పరుగులు తీసుకుంటూ గవర్నరుపేట పోలీసుస్టేషన్‌కు వెళ్లి చెప్పాడు. కాగా, రాజు, వెంకటరమణ మృతదేహాలకు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. వెంకటరమణ మరణవార్త తెలుసుకుని అతడి తల్లిదండ్రులు వెంకటరావు దంపతులు విజయనగరం నుంచి వచ్చారు. ఏకైక కుమారుడు చనిపోవడంతో వారు కన్నీరుమున్నీరై మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు. కానీ, రాజుకు ఎవరూ లేకపోవడంతో అతని మృతదేహం అనాథలా మార్చురీలోనే ఉండిపోయింది.

సికింద్రాబాద్‌లో దొరికిన కిషోర్

రాజు, వెంకటరమణను హత్య చేసిన తర్వాత పారిపోయిన కిషోర్ పోలీసులకు లొంగిపోవాలనుకున్నాడు. వన్‌టౌన్‌లోని నైజాంగేటు ప్రాంతానికి చేరుకున్నాక మనసు మార్చుకున్నాడు. ఆ సమయంలో అతడి వద్ద రూ.6 వేలు ఉన్నాయి. నైజాంగేటు వద్ద రైళ్లు నెమ్మదిగా వెళ్తుంటాయి. అక్కడ రైలెక్కి హైదరాబాద్ వెళ్లిపోయాడు. గురువారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి నైజాంగేటు వద్ద ఉన్న స్నేహితుడికి ఫోన్ చేశాడు. హత్య జరిగినప్పటి నుంచి కిషోర్ స్నేహితుడిని పోలీసులు ట్రాక్ చేస్తున్నారు. కాల్ రాగానే అతడిని అదుపులోకి తీసుకున్నారు. కిషోర్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉన్నాడని నిర్ధారించుకున్న పోలీసులు అతడి ఫొటోలను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పంపారు. అక్కడి ప్రత్యేక బృందాలు కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నాయి. విజయవాడ నుంచి ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి కిషోర్‌ను నగరానికి తీసుకొచ్చింది. కాగా, రౌడీషీటర్ కిషోర్‌లో భక్తికోణం కూడా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106,114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

ఎన్ఎస్ఓ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నేడు

ఆటోనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గణాంకాల కార్యాలయం(ఎన్ఎస్ఓ) 75వ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మారిస్ స్టెల్లా కళాశాలలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఓ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈపోటీలకు హాజరవుతారన్నారు. ఉదయం పది గంటలకు జరిగే ఈపోటీలకు ముఖ్యఅతిథులుగా విజయవాడ, కడప ఎన్ఎస్ఓ డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్ హాజరవుతారని ఆయన తెలిపారు.



ప్రమాదానికి కారణమైన వాహనం

అదుపుతప్పి దూసుకెళ్లిన కారు

నలుగురు విద్యార్థినులకు స్వల్ప గాయాలు

బెంజిసర్కిల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి నలుగురు విద్యార్థినులను ఢీకొట్టిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెంజిసర్కిల్ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బెంజిసర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాల ప్రాంగణంలోకి కారులో వెళ్లేందుకు కొల్లి ఆదినారాయణరావు ప్రయత్నించాడు. గేట్ వద్ద ఉన్న వాచ్‌మన్ కారును నిలువరించి ప్రైవేటు వాహనాలు కళాశాల ప్రాంగణంలోకి అనుమతి లేదని వివరించాడు.

దీంతో కోపోద్రిక్తుడైన ఆదినారాయణరావు వాగ్వాదం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో కారు న్యూట్రల్ ఉందనుకుని ఒక్కసారిగా కారు నుంచి వెలుపలికి వచ్చాడు. దీంతో కారు మొదటి గేర్‌లో ఉండగా ఒక్కసారిగా కళాశాలలోని విద్యార్థినులపైకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు విద్యార్థినులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఓ కారు పాక్షికంగా దెబ్బతిందని తెలిపారు. విద్యార్థినులను దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై దెబ్బతిన్న వాహన డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.



విజయనగర్ కాలనీలో



వరలక్ష్మీనగర్ మెయిన్ రోడ్లో..



భారతీనగర్ మెయిన్ రోడ్లో..



కోనేరు బుల్లయ్యచౌదరి రోడ్డులో



దేవీ ఆయిల్ మిల్లు వద్ద

ఎటుచూసినా చెత్తకుప్పలే

భారతీనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారిశుద్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత ఐదు రోజులుగా సమ్మె చేయడంతో తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. మూడో డివిజన్‌లోని కరెన్సీనగర్, విజయలక్ష్మి కాలనీ, తదితర కాలనీలు, నాల్గో డివిజన్‌లోని వరలక్ష్మీనగర్, భారతీనగర్, గురునానక్‌రోడ్డు, తదితర కాలనీలు, పదో డివిజన్‌లోని ఆర్ఆర్ గార్డెన్, వాసవీ కాలనీ, మారుతీ కో ఆపరేటివ్ కాలనీ, విజయనగర్, తదితర కాలనీలోని మెయిన్, అంతర్గత రోడ్లు చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

ఏ రోడ్డు చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నారు. రోజల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ఆయా రోడ్డుల్లో ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పంటకాల్వ రోడ్డులో

పటమట: 11వ డివిజన్ బుల్లయ్యచౌదరి రోడ్డులో వల్లూరి సాంబశివరావు వీధిలో, 14వ డివిజన్ ఆయిల్ మిల్లు సమీపంలో చెత్త గుట్టలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఆ ప్రాంతం అంతా తీవ్ర దుర్గంధ భరితంగా మారిపోయింది. కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా చెత్తను తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

తిరుపతయ్య శ్రమదానం...చెత్త తొలగింపు



రాణిగారితోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పారిశుద్య కార్మికుల సమ్మె నేపథ్యంలో డివిజన్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులు చేపట్టారు. రాణిగారితోట 18వ డివిజన్ లో టీడీపీ బీసీ సెల్ తూర్పు అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య యాదవ్ ఈ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంతోని వీధిలో గత నాలుగు రోజుల నుంచి పేరుకుపోయిన చెత్తను తిరుపతయ్య ఒకరిద్దరు శానిటేషన్ సిబ్బందితో కలిసి తానే స్వయంగా చెత్త తొలగించే కార్యక్రమం చేపట్టారు. చెత్త తొలగించి పౌడర్ చల్లించారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా గడ్డం రాజేశ్వరరావు



విజయవాడ లీగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :విజయవాడ పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా గడ్డం రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ ఫర్ హోం కుమార్ విశ్వజిత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు గడ్డం రాజేశ్వరరావుకు అందాయి. తన నియామకానికి సహకరించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, న్యాయవాదులు జీవీఆర్, వి.గురునాథం, చేకూరి శ్రీపతిరావు, మట్టా జయకర్ తదితరులకు గడ్డం కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్లాస్టిక్ క్యారీబ్యాగుల నిషేధాన్ని అమలు చేయండి

- జేసీ ఇలక్కియా ఆదేశం

కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైతు బజార్లలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు, వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. నగరంలోని జేసీ చాంబర్‌లో గురువారం మార్కెటింగ్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులతో జేసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని రైతుబజార్లలో ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. వ్యాపారాలు నిర్వహించే రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. ఉదయం 6 గంటలకే అన్ని రైతు బజార్లలో ఎస్టేట్ అధికారులు విధులలో ఉండి ధరల పట్టికను సిద్ధంగా ఉంచాలన్నారు. మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరలకే రైతు బజార్లలో అమ్మకాలు నిర్వహించేలా ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విధులలో అలసత్వం వహించినా, ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని జేసీ, ఎస్టేట్ అధికారులను హెచ్చరించారు.సమావేశంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బెంజిసర్కిల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 9వ డివిజన్ పటమటలంకలోని కొమ్మా పూర్ణచంద్రరావు రోడ్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్‌లోని ప్రతి బూత్‌లో ప్రతి ఇంటికి వెళ్లి వా రితో మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు.



సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్లు తదితరులు

కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి కాంతిశ్రీ, నాయకులు యలమంచిలి దేవేంద్ర, కొమ్మశివ, దుర్గాప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటమట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కుటుంబ సాధికార సారధి బెజవాడ నజీర్ 11వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి కూటమి పథకాలు వివరించడంతో పాటు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులను ఇళ్ల వద్దకు పిలిపించి ఫొటో, వేలిముద్రలు వేయించి లోన్ తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, లక్ష్మీ పాల్గొన్నారు.





వారం రోజులుగా ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలకు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. గురువారం మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో బాధపడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేదతీరారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, బందరు రోడ్డులో వర్షంలోనే వెళుతున్న ద్విచక్రవాహనదారులు

రైళ్లలో చోరీలు.. నిందితుడి అరెస్టు

రూ.3.05లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

రైల్వేస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను దొంగిలించిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువకుడిని గురువారం విజయవాడ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద సుమారు రూ.3.05లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల విజయవాడ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్‌లు చోరీకి గురవుతున్నాయని బాధితులు విజయవాడ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా గురువారం రైల్వే సీఐ జె.వి.రమణ పర్యవేక్షణలో ఎస్ఐ, సిబ్బంది 8వ నెంబరు ప్లాట్‌ఫారం మీద తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం లింగసార్ జిల్లా రాయచూర్ మండలం జనతాపేట గ్రామానికి చెందిన హనుమంత్ నాయక్ (22) అనుమానాస్పదంగా తిరుగుతుండగా, అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా అయిదు చోరీ కేసులు చేసినట్లు వెల్లడైంది. పోలీసులు నిందితుడి వద్ద సుమారు రూ.3,05,000లు విలువైన బంగారు ఆభరణాలు, వెండిపట్టీలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి

ఎండీయూ ఆపరేటర్ల సంఘం నేతల డిమాండ్

గాంధీనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమపై అనేక ఆరోపణలు చేస్తూ కక్షపూరితంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 వేలకు పైగా ఎండీయూ ఆపరేటర్లను ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం తొలగించిందని యండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు కిషోర్, రౌతు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. పౌరసరఫరాశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ ఆపరేటర్లను ఉద్దేశించి తమ మనోభావాలు దెబ్బతినేలా రేషన్ మాఫియా జరిగిందని వ్యాఖ్యానించడం దారుణమన్నారు.

రాజకీయాలకు అతీతంగా అందరికి సేవలందించామన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. తమకు ఇచ్చిన వాహనాల పేపర్లలో గూడ్స్ క్యారియర్ నుంచి మొబైల్ క్యాంటీన్‌గా మార్చడం జరిగిందని, దానికి మరలా గూడ్స్ క్యారియర్‌గా మార్పు చేసి వెంటనే వారికి క్లియరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

- భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట
- అమ్మకు మొక్కుల చెల్లింపు



ఇంద్రకీలాద్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలి వచ్చాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భక్త బృందాలకు ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం మహామండపం 6వ అంతస్థులో భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



వర్షాతిరేకం

మండే ఎండల్ని చీల్చి చెండాడుతూ నీలిమేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి.. రోజంతా ఎండ తాకిడికి, ఉక్కపోతకు గురైన నగర ప్రజలు ఉపశమనం కోసం ఆకాశం వైపు చూడగా ఉరిమే మేఘాల నుంచి వర్షపు చినుకులు భూమిపై జాలువారాయి. దీంతో చల్లదనం కోసం వేచి ఉన్న నగర ప్రజలు వర్షం పడిన ఆసాంతం చల్లదనాన్ని ఆస్వాదిస్తూ సేదతీరారు.






సాగు సాగేనా..!

- జీవం కోల్పోతున్న మాగాణి
- కునారిల్లుతున్న మెట్ట పంటలు
- వైర్లు, మోటార్లు దొంగల పాలు
- పనిచేయని ఎత్తిపోతల పథకాలు
- వృథాగా పోతున్న పట్టిసీమ నీరు
- చుక్క నీరు మునేరు, కట్టలేరు, వాగులు





ఆత్కూరు గ్రామంలో నీరు లేని పంట చెరువు, హెచ్ ముత్యాలంపాడు వద్ద నిరుపయోగంగా పంపింగ్ స్కీమ్, నిలువునా ఎండుతున్న మొక్కజొన్న

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో జూన్, జూలై 16న వరకు పడిన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో) ఇలా ఉన్నాయి.

మండలం పేరు	జూన్		జూలై నెల	
	నగటు	కురిసింది	నగటు	కురిసింది
వత్సవాయి	104.6	128.0	116.7	30.3
జగ్గయ్యపేట	100.1	107.7	111.6	34.3
పెనుగంచిప్రోలు	97.4	91.5	124.3	21.6
నందిగామ	102.8	91.3	108.3	19.3
వీరులపాడు	116.2	84.2	131.8	33.0
కంచికచర్ల	96.7	79.6	118.0	9.9
చందర్లపాడు	103.0	64.1	117.8	25.7

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లాలో ఆషాఢంలో రోహిణి కార్తెను తలపించేలా ఎండలు, వర్షాభావం కారణంగా పత్తి, ఇతర మెట్ట పంటలు జీవం కోల్పోతున్నాయి. జూన్, జూలై నెలల్లో అడపాదడపా కురిసిన వర్షాలతో పత్తి మొక్కలు కొంత ఎదిగినప్పటికీ, తర్వాత వర్షం లేక ఎదుగుదల లోపించింది. మాగాణి సాగు కూడా సవ్యంగా సాగడం లేదు. వాగులు, చెరువుల్లో నీరు లేక, బోర్లపై ఆధారపడిన రైతులు నారుమడులు పోస్తున్నారు. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి నీరు పుష్కలంగా వస్తున్నప్పటికీ, 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పంపింగ్ స్కీమ్‌లు నిరుపయోగంగా మారాయి. మోటార్లు, వైర్లు దొంగిలించబడడంతో చెరువులకు నీటిని మళ్లించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తక్షణం మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావం వల్ల మెట్ట ప్రాంతం లో పంటలు దెబ్బతిన్నాయి. తొలకరిలో సాగైన పైర్లు ఎదుగుదల లోపించి, గిడసబారుతున్నాయి. కృష్ణానది, మునేరు, కట్టలేరు వంటి నీటి వనరుల్లో నీరు లేదు. ఎండలు, వడగాడ్పులతో వాతావరణం వేసవిని తలపిస్తోంది. పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలు ఆశాజనకంగా లేవు. పల్లాకు తెగులు సోకడంతో పైర్లు పసుపు పచ్చగా మారుతున్నాయి. జూలై సగం దాటినా వర్షాలు లేక, వ్యవసాయ కూలీలు ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురవుతున్నారు. నీటి వనరులు ఎండిపోవడంతో తాగు నీటికి, పశువులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.



గిడసబారి నేల చూస్తున్న పత్తి మొక్కలు

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

తీవ్రగాయాలతో యువతి ఆసుపత్రిపాలు




మృతి చెందిన పవన్, చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మీ

గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీబీగూడెం సమీపంలో బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో యువకుడు పవన్ (22) మృతి చెందగా, యువతి గరికపాటి భాగ్యలక్ష్మీ (21) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొం టదుతోంది. ఇబ్రహీంపట్నంకు చెందిన భాగ్యలక్ష్మీ, చిన అవుటపల్లి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసి, పిన్నమనేని మెడికల్ కళాశాలలో ట్రైనీ నర్సుగా చేరింది. బుధవారం రాత్రి సబ్బుల కోసం హాస్టల్ నుంచి పవన్ ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చారు. విజయవాడ వైపు వెళ్తుండగా, బీబీగూడెం వద్ద ప్రమాదం జరిగింది. పవన్ అక్కడికక్కడే మృతి చెందగా, భాగ్యలక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. రూమ్‌మేట్ ఫోన్ చేయగా, ద్విచక్ర వాహనదారుడు విషయం తెలిపాడు. 108 అంబులెన్స్‌లో ఇద్దరినీ పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. పవన్, ఏలూరు జిల్లా ఈదులగూడెం గ్రామానికి చెందినవాడు. విజయవాడలో ప్రైవేటు సర్వేయర్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ప్రమాద కారణంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జగ్గయ్యపేట, నందిగామ ఏఎంసీ చైర్ పర్సన్‌లుగా కొఠారు, పిట్టల

- సీనియర్ నేతకు అవకాశం

జగ్గయ్యపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్‌గా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన సీనియర్ నేత తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అనేక పదవులను కొఠారు నిర్వహించారు. 1997లో తెలుగు యువత మండలాధ్యక్షుడిగా, 2002లో టీడీపీ గండ్రాయి గ్రామ అధ్యక్షుడిగా, 2004లో టీడీపీ మండలాధ్యక్షుడిగా, 2009 నుంచి జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పదేళ్లు, 2014లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్తగా, 2020 నుంచి రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధిగా పనిచేశారు. పార్టీ క్లిష్టకాలంలోనూ నిజాయితీగా పనిచేశారు. రైతు నేతగా ఉన్న కొఠారు గతంలోను ఏఎంసీ చైర్మన్ పదవీ కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ దఫా ఆయన్ను అదృష్టం వరించింది. నియోజకవర్గ టీడీపీతో పాటు ఎంపీ ఆశీస్సులు అందుకున్నారు. తనకు పదవీ రావటానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నేతకు వరించిన పదవి



నందిగామ: నందిగామ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా పిట్టల శ్రీదేవిని ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొత్తులో భాగంగా బీజేపీకి చెందిన శ్రీదేవికి ఈ పదవిని కేటాయించారు. కంచికచర్ల పట్టణానికి చెందిన పిట్టల శ్రీదేవి కొద్ది కాలంగా బీజేపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నందిగామ, చందర్లపాడు మండలాల నుంచి ఈ పదవి కోసం పెద్ద ఎత్తున ఆశావహులు పోటీ పడుతుండగా అనూహ్యంగా ఆమె పేరును ప్రభుత్వం ప్రకటించడంతో బీజేపీతో సహా కూటమి పార్టీల నేతలు విస్మయం చెందారు. బీసీ మహిళకు కేటాయించిన ఈ పదవిని బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు ఆమె పేరును ప్రతిపాదించారు. దీంతో ప్రభుత్వం ఆమె పేరును ఖరారు చేసింది. తన నియామకానికి సహకరించిన బీజేపీ నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.




వ్యక్తిగత కార్యదర్శి పాడె మోసిన వసంత

గుండెపోటుతో నరసింహారావు మృతి ● కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే

కంచికచర్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిగత కార్యదర్శి, గొల్లపూడి పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి కట్టా నరసింహారావు పార్థివ దేహాన్ని చూసిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కన్నీటి పర్యంతం అయ్యారు. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోలేకపోయారు. నరసింహారావు గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన నరసింహారావు స్వగ్రామం నక్కలంపేట వచ్చి ఆయన పార్థివ దేహాన్ని చూసి చలించిపోయారు. వసంతతో పాటు ఆయన తండ్రి, మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, ధీమంత్ సాయిలు నరసింహారావు పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సాయంత్రం జరిగిన నరసింహారావు అంత్యక్రియల్లో పాల్గొని వసంత పాడె మోశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్యతో పాటు కూటమి నేతలు నరసింహారావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అదనపు కట్నం కోసం ఆర్ఎస్ఐ వేధింపులు

● పోలీసు కేసు నమోదు ● వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారుడే ఆర్ఎస్ఐ

జగ్గయ్యపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూతురు కాపురం చక్కదిద్దేందుకు వచ్చిన బంధువులపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన చప్పిడి వెంకట్రామయ్య తన కుమార్తె రాజ్యలతను వేదాద్రికి చెందిన చల్లా వైకుంఠరావు రెండో కుమారునికిచ్చి 14 నెలల క్రితం జగ్గయ్యపేటలో వివాహం చేశామన్నారు. అయితే 6 నెలలుగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో సర్దిచెప్పి సమస్య పరిష్కరించేందుకు పెద్ద మనుషుల సమక్షంలో ఇరు కుటుంబాల సభ్యులు చిల్లకల్లు పాలశీతల కేంద్రం సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ మాల్‌లో చర్చలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా వియ్యంకుడి కుటుంబ సభ్యులు తమపై దాడి చేశారని వెంకట్రామయ్య తెలిపారు. ఈ దాడిలో భార్య రమాదేవి, కుమారుడు రాజేంద్ర, బావమరుదులు సత్యశేఖర్, రత్నశేఖర్‌కు గాయాలయ్యాయన్నారు. వెంకట్రామయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేయటంతో పాటు వరకట్నం కోసం భార్యను వేధిస్తున్న మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చల్లా వైకుంఠరావు తన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదుపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రేమికుల మధ్య మనస్పర్థలు.. గడ్డిమందు తాగి యువకుడి మృతి

గన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో మనస్పర్థలు రావడంతో గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోటకు చెందిన చనపాల శ్రావణ్‌కుమార్ (20) మూడేళ్లుగా గన్నవరంలోని హెచ్‌సీఎల్‌లో పని చేస్తున్నాడు. రెండేళ్లుగా ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కొద్ది రోజుల నుంచి మనస్పర్థలు రావటంతో ఈ నెల 14న రూముకు వెళుతూ గడ్డి మందు తీసుకువెళ్లి తాగాడు. రూముకు వెళ్లగానే పడిపోవటంతో స్నేహితులకు అనుమానం వచ్చి విజయవాడ ప్రభుత్వస్పత్రికి తరలించారు. గడ్డిమందు ఎక్కువగా తాగడంతో శరీరమంతా వ్యాపించి బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించండి

● ఆర్టీసీ ఎండీకి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నేతల వినతి

బస్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు 47శాతం పైగా బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించాలని ప్రజా రవాణా సంస్థ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు నేతృత్వంలో గురువారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. గత విధానాన్ని అమలు చేయకపోవటంతో గ్రీవెన్స్ మీటింగ్‌లు నిలిపేశారని ఎండీ ద్వారకా తిరుమలరావు నేతలకు తెలిపారు. ఈ విజ్ఞప్తిని ప్రభుత్వానికి పంపుతామని, వారి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఎస్వీ రావు, శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, అసోసియేషన్ నేతలు కే ఎం లక్ష్మణుడు, వీ జే రత్నం, వీ జానకిరామ్, పీ నూరిబాబు, పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

వన్‌టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జూలై 2025 సెషన్‌కు ఆన్‌లైన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రాంకు దరఖాస్తులు స్వీకరణ జూలై 31 వరకు పొడిగించినట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కే సుమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ 2వ సంవత్సరం, డిగ్రీ 2, 3వ సంవత్సరం చదివే విద్యార్థులు కూడా రీరిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో జూలై 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గానీ, లేదా 0866-2565253 ఫోన్‌లోగానీ సంప్రదించవచ్చన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో హార్ట్ సర్జరీలకు బ్రేక్

● వైద్యుల కొరతతో ఆగిన బైపాస్ సర్జరీలు
● ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్న వైద్యులు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో బైపాస్ సర్జరీలు నిలిపివేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువవడం, వైద్యుల కొరతతో సర్జరీలు చేయడం కష్టంగా ఉందని వారు వెల్లడించారు. ఈ విభాగంలో ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. కొన్నాళ్లుగా జీజీహెచ్‌లో గుండెకు సంబంధించిన బైపాస్ సర్జరీలు చేయడానికి గుంటూరు నుంచి సపోర్టింగ్ స్టాఫ్‌గా వైద్యులు వచ్చేవారు. ప్రస్తుతం బదిలీల నేపథ్యంలో రావడానికి కుదరడం లేదు. ఉన్న ఇద్దరితో బైపాస్ సర్జరీలు చేయడం కష్టం. దీంతో స్టంట్‌లు మాత్రమే వేస్తామని, బైపాస్ సర్జరీకు వచ్చే రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలంటూ వైద్యులే సూచిస్తున్నారు. ఈ కారణంతో వివిధ ప్రాంతాల నుంచి, వ్యయప్రయాసలకు ఓర్చి ఆసుపత్రికి వస్తున్న రోగులకు తిప్పలు తప్పడం లేదు. అధిక శాతం మంది పేదలే వస్తారు. ఉన్నపళంగా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోమంటే తమకు తలకుమించిన భారం అవుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్టు జీజీహెచ్ అధికారులు తెలిపారు.

హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్న జగన్

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రత్యక్షంగా రెచ్చగొడుతూ హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు మండిపడ్డారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా పనిచేసిన వ్యక్తి యువత భవిష్యత్తును హత్యా రాజకీయాల వైపు మళ్లించడం సిగ్గుచేటన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సారథ్యంలోనే ఇదంతా నడుస్తుందన్నారు. జగన్‌రెడ్డి ఎక్కడ పర్యటన హడావుడి, బెదిరింపులే తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. రాష్ట్రంలో కూటమి రాకతో పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, సీఎం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు,

స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన శాప్ చైర్మన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అజయ్‌జైన్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం ఆటోనగర్‌లోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడాభివృద్ధిపై చర్చించడంతో పాటు వాటి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అమరావతివాసులకు సీఆర్‌డీఏ అవగాహన సదస్సులు



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు గురించి ఈనెల 15 నుంచి 17 వరకు వరుసగా 3 రోజుల పాటు సీఆర్‌డీఏ అమరావతి వాసులకు అవగాహన సమావేశాలు నిర్వహించింది. అమరావతిలోని ప్రధాన ప్రాంతాల్లో 3 రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సామాజిక సంక్షేమ విభాగం, సామాజిక పర్యావరణ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరిగాయి. రాజధానిలో భద్రతా నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ, మహిళా కార్మికుల సంక్షేమం, వలస కార్మికుల భద్రతకు చేపట్టిన చర్యలను సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. సమావేశాలకు హాజరైన వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గ్రామస్థుల సందేహాలకు అధికారులు సమాధానమిచ్చారు. రాజధాని పనుల కారణంగా ఎలాంటి అసౌకర్యం కలిగినా గ్రామంలోని సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. రాజధానిలో తిరుగుతున్న భారీ వాహనాలతో దుమ్ము ఎగరకుండా నీళ్లు చల్లాలని, సీడ్ యాక్సిస్ రహదారిపై అతివేగంగా వాహనాలు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. చర్యలు తీసుకొంటామని అధికారులు తెలిపారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలంటూ చేసిన విజ్ఞప్తులను పరిశీలిస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్‌మేళాలు, నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు.

పంపు మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించండి

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పంపు మెకానిక్‌లుగా పనిచేస్తున్న తాము పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణ పంపు మెకానిక్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లారావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ పరిధిలో 526 మంది పంపు మెకానిక్‌లు 26 సంవత్సరాల నుంచి 30 కిలోల బోర్ కిట్ పనిముట్లను మోసుకుని వెళ్లి గ్రామీణులకు నీటి ఎద్దడి లేకుండా దాహార్తిని తీర్చుతున్నామన్నారు. ఆర్నెల్లుగా వేతనాలు అందకపోవడంతో మెకానిక్ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంపు మెకానిక్స్ పేరున వేతనాలు అందించాలని, ప్రతినెలా పీఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాకు జమచేయాలని కోరారు.

పోలీసులకు అత్యాధునిక శిక్షణ

హోంమంత్రి వంగలపూడి అనిత

కరగ్రహారంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

మచిలీపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు అత్యాధునిక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, శాసనసభ్యులతో కలిసి మచిలీపట్నం మండలం చినకరగ్రహారం గ్రామంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఎందరో మహానుభావులకు పుట్టినిల్లు, కళాసంస్కృతులకు నిలయమైన కృష్ణాజిల్లాలో పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతంలోని పోలీస్ శిక్షణ కేంద్రం స్థలాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు తీసుకోవడంతో చినకరగ్రహారంలో 46 ఎకరాలలో అత్యాధునిక వసతులతో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసుశాఖలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమయ్యాయని, వాటిని అరికట్టేందుకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ఈ కేంద్రంలో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలోని మెరైన్ పోలీసులకు కూడా శిక్షణ ఇస్తామని మంత్రి అనిత వివరించారు.

రూ.32 కోట్ల వ్యయంతో నిర్మాణం

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రూ.32 కోట్ల వ్యయంతో 46 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రం మచిలీపట్నం నగరానికి మణిహారంగా మారుతుందన్నారు. ఇక్కడ ఎక్సైజ్ శాఖ, మెరైన్ పోలీసులకు కూడా శిక్షణ ఇచ్చే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. త్వరలో పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని, తీరప్రాంతంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు రవాణా జరపకుండా నిఘా పెట్టేందుకు మెరైన్ పోలీసు వ్యవస్థను పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని హోంమంత్రిని కోరారు.

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు రాము, కుమార్‌రాజా ప్రసంగించారు.

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.

ప్రేమ్‌రావత్
9246275220

ఆలయ దర్శనం



యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్భయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎన్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజయోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తాకోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్థులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,

అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.



వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... రేకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్ణిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు


A M RATHNAM
PRESENTS
MEGA SURYA PRODUCTION
BATTLE FOR DHARMA
PAWAN KALYAN
IN & AS
హరి హర
వీరమల్లు
PART-1 SWORD vs SPIRIT
STORMING IN CINEMAS
24TH JULY 2025
WORLDWIDE
JYOTHI KRISNA · KRISH JAGARLAMUDI
PRODUCED BY A DAYAKAR RAO
AN MM KEERAVAANI MUSICAL
TELUGU · HINDI · TAMIL · KANNADA · MALAYALAM


తమిళంలో ఘనవిజయం సాధించిన DNA చిత్రం
ఇప్పుడు తెలుగులో మీకోసం
SK PICTURES
మై బేబి
DNA
2025
నేడే
విడుదల
359+
SCREENS
FROM THE PRODUCER OF ప్రేమిస్తే - జర్నీ
PRODUCER
SURESH KONDETI
WRITTEN & DIRECTED BY
NELSON VENKATESAN


RANA DAGGUBATI
PRESENTS
కొత్తపల్లిలో ఒకప్పుడు...
నేడే
విడుదల
DIRECTED BY
PRAVEENA PARUCHURI


నేడే విడుదల
A SAI KORRAPATI PRODUCTION
SAI SIVANI PRESENTS
Vaaraahi
Chalana Chitram
ROCKSTAR
DSP
KIREETI
JUNIOR
ಕನ್ನಡ | తెలుగు


నేడే
విడుదల
పోలీస్ వారి హెచ్చరిక
PRODUCER
BELLI JANARDHAN
WRITTEN & DIRECTED BY
BABJI


ADITYA CHOPRA PRESENTS
AHAAN PANDAY & ANEET PADDA
IN CINEMAS
TODAY
YASH RAJ FILMS
SAIYAARA
DIRECTED BY MOHIT SURI
PRODUCED BY AKSHAYE WIDHANI
WWW.YASHRAJFILMS.COM
WATCH WITH ENGLISH SUBTITLES
a yash raj films worldwide release

క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై



22న ఆసీస్‌తో ఆఖరి టీ20

కింగ్‌స్టన్: వెస్టిండీస్ పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్(37) తన 15 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. ఈ నెల 22న సొంత మైదానం సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియాతో రెండో టీ20.. రస్సెల్ కెరీర్‌కు చివరిది కానుంది. పొట్టి క్రికెట్‌లో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న రస్సెల్ 2012, 2016 టీ20 వరల్డ్‌కప్‌లు నెగ్గిన వెస్టిండీస్ జట్లలో సభ్యుడిగా ఉన్నాడు. 2019 నుంచి రస్సెల్ కేవలం టీ20ల్లో మాత్రమే కనిపిస్తున్నాడు. ఫ్రీలాన్సర్‌గా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. 84 టీ20లు, 56 వన్డేలు, ఒక్క టెస్ట్‌లో విండీస్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌కు రస్సెల్ ఎంపియ్యాడు. కానీ, ఈ నెల 20, 22న జరిగే తొలి రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాలని నిర్ణయించుకొన్నాడు.

అర్జున్ జోడీ సంచలనం

న్యూఢిల్లీ: స్విస్ ఓపెన్‌లో భారత టెన్నిస్ డబుల్స్ జోడీ అర్జున్ ఖాదీ-విజయ్ సుందర్ ప్రశాంత్ సంచలన విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో అర్జున్-ప్రశాంత్ ద్వయం 6-3, 7-6(5)తో రెండో సీడ్ జాకబ్ ష్నైటర్-మార్క్ వాల్నర్‌ను ఓడించింది. తొలి సెట్‌లో అర్జున్ జంట జోరు చూపించినా.. రెండో సెట్‌లో జర్మన్ జోడీ నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. అయితే, టైబ్రేక్‌లో 0-3తో వెనుకబడినా.. అద్భుతంగా పుంజుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

బుమ్రా ఆడాల్సిందే!

అర్ష్‌దీప్‌నకు గాయం
ఒత్తిడిలో టీమిండియా

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

లార్డ్స్ టెస్టు పరాజయం ఆటగాళ్లతో పాటు అభిమానులను కూడా తీవ్ర వేదనకు గురిచేసింది. ఎన్నడూ గెలవని బర్మింగ్‌హామ్‌లో విజయకేతనం ఎగురవేసిన తర్వాతి మ్యాచ్‌లోనే ఈ పరాజయం ఎదురైంది. దీంతో ఇప్పుడు ఐదు టెస్టుల సిరీస్ అత్యంత ఆసక్తిరంగా మారింది. ఈనెల 23 నుంచి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే నాలుగో టెస్టు గెలిస్తేనే భారత్ ఆశలు సజీవంగా ఉంటాయి. గురువారం నుంచి గిల్ సేన తమ సన్నాహకాలను కూడా ఆరంభించింది. అయితే తమ ప్రధాన ఆయుధం పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మ్యాచ్‌లో బరిలోకి దించుతారా? లేదా? అనే సందేహం అందరిలో నెలకొంది. బుమ్రా ఈ సిరీస్‌లో మొదటి, మూడో టెస్టులో మాత్రమే ఆడాడు. ఈ రెండింట్లో కలిపి12 వికెట్లు తీశాడు. అయితే పనిఒత్తిడిలో భాగంగా కేవలం మూడు టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటాడని ఈ పర్యటనకు ముందే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. దీంతో చివరిదైన ఐదో టెస్టులో మాత్రమే బుమ్రాను ఆడిస్తారంటూ కథనాలు వెలువడుతున్నాయి. కానీ తాజాగా జట్టు పరిస్థితిని గమనిస్తే ఇబ్బందికరంగా ఉంది. లార్డ్స్ ఓటమి గిల్ సేనను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. ప్రస్తుతం 1-2తో వెనుకబడిన దశలో మాంచెస్టర్ టెస్టును కోల్పోతే సిరీస్ పోయినట్టే. పైగా లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ నెట్ ప్రాక్టీస్‌లో గాయపడ్డాడు. అతడు బౌలింగ్ వేసే చేతికి ప్లాస్టర్‌తో కనిపించాడు. ఇప్పటికే కీపర్ పంత్ చేతి వేలికి గాయం కాగా, నొప్పిని భరిస్తూనే తను మూడో టెస్టులో బ్యాటింగ్ చేశాడు. దీంతో నాలుగో టెస్టుకు పంత్ అందుబాటులో ఉండడం కష్టమే. ఇలాంటి సమస్యలు చుట్టుముట్టిన వేళ.. బుమ్రాకు విశ్రాంతినివ్వడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. అయినా మూడు, నాలుగో టెస్టుకు మధ్య ఎనిమిది రోజుల విశ్రాంతి బుమ్రాకు సరిపోతుందని మాజీ ఆటగాడు దీప్‌దాస్ గుప్తా సూచించాడు.





ఫిట్ అయితే ఆడాలి!



ఓ ఆటగాడు ఫిట్‌గా ఉన్నప్పుడు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందేనని మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ తేల్చాడు. తొలి టెస్టు తర్వాత ఎనిమిది రోజులపాటు సమయం లభించినా అతడిని రెండో టెస్టు ఆడించలేదని, ఇది ఏమాత్రం సరికాదని విమర్శించాడు. వ్యక్తిగత ఇష్టాఇష్టాలను బట్టి మ్యాచ్‌లను ఎంపిక చేసుకోవడమేమిటని సూటిగా ప్రశ్నించాడు. అటు మాజీల మాటయినా.. ఇటు అభిమానుల ఆరాటమైనా మాంచెస్టర్ మ్యాచ్‌లో బుమ్రా బరిలోకి దిగడమే.

కరుణ్‌కు కష్టమే..



ఎనిమిదేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసిన కరుణ్ నాయర్ తనకు లభించిన సువర్ణావకాశాన్ని పోగొట్టుకున్నాడు. మూడు టెస్టుల్లో కలిపి 131 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జట్టు టాప్-4 బ్యాటర్లలో కనీసం అర్ధసెంచరీ కూడా చేయనిది కరుణ్ మాత్రమే. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా నిలిచిన హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్‌లోనూ పేలవ ఆటతీరును కనబర్చాడు. దీంతో కరుణ్ స్థానంలో యువ ఆటగాడు సాయి సుదర్శన్‌ను ఆడించే చాన్సుంది. ఇంగ్లండ్ గడ్డపై అతడికి అవకాశం ఇస్తే జట్టుకు ప్రయోజకరంగా ఉంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

బుమ్రా అందుబాటులోనే..

నాలుగో టెస్టుకు బుమ్రా అందుబాటులో ఉంటాడని భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కాటే తెలిపాడు. 'చివరి రెండు టెస్టుల్లో బుమ్రా ఏదో మ్యాచ్‌లో మాత్రమే ఆడతాడు. ఎందులో ఆడించాలనే విషయమై మాంచెస్టర్ టెస్టుకు ముందు ఓ నిర్ణయం తీసుకుంటాం' అని డస్కాటే వివరించాడు. లార్డ్స్ టెస్టు ముగిశాక బుమ్రా నాలుగో మ్యాచ్‌లో ఆడే అంశంపై కెప్టెన్ గిల్ స్పష్టత నివ్వలేదు.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్..!



- టైటిల్ రేస్ నుంచి మాగ్నస్ అవుట్
- క్వార్టర్స్‌కు ప్రజ్ఞానంద, అర్జున్
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్

లాస్‌వెగాస్: ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఇచ్చిన షాక్‌తో.. వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఏకంగా టైటిల్ రేసు నుంచే అవుటయ్యాడు. అయితే, రెండో స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. 9 నుంచి 16 స్థానాల కోసం కార్ల్‌సన్ పోటీపడనున్నాడు. 16 మంది ప్లేయర్ల టోర్నీని రెండు గ్రూప్‌లు వైట్, బ్లాక్‌గా విభజించారు. ప్రతి గ్రూప్‌లోనూ టాప్-4లో నిలిచిన ఆటగాళ్లు నాకౌట్‌కు చేరుకొంటారు. గ్రూప్ దశలో.. వైట్ గ్రూప్‌లో నాలుగో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద కేవలం 39 ఎత్తుల్లోనే కార్ల్‌సన్ ఆట కట్టించాడు. ఆ తర్వాతి రౌండ్‌లో అమెరికా జీఎం వెస్లీ సో చేతిలోనూ కంగుతిన్నాడు. ఇక, అరోనియన్ (అమెరికా) చేతిలో టైబ్రేక్‌లో ఓడడంతో కార్ల్‌సన్ టాప్-4లో నిలిచే అవకాశాన్ని కోల్పోయాడు. క్వాలిఫయర్స్‌లో జరిగిన ఏడు రౌండ్ల నుంచి సిందరోవ్, ప్రజ్ఞానంద, అబ్దుసత్తరోవ్ తలో 4.5 పాయింట్లతో తొలి మూడు స్థానాల్లో నిలవగా.. టైబ్రేక్‌లో కార్ల్‌సన్‌ను ఓడించిన అరోనియన్ నాలుగో స్థానాన్ని పట్టేశాడు. కాగా, గ్రూప్ 'బ్లాక్' నుంచి తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి 4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి రౌండ్-8కు అర్హత సాధించాడు. క్వార్టర్స్‌లో కరువానాతో ప్రజ్ఞానంద, అబ్దుసత్తరోవ్‌తో అర్జున్ తలపడనున్నారు.

జపాన్ ఓపెన్..మన కథ ముగిసెన్!

సాత్విక్ జంట, లక్ష్యసేన్ ఓటమి

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ కథ ముగిసింది. బరిలో మిగిలిన సాత్విక్ జోడీ, లక్ష్యసేన్ కూడా రెండో రౌండ్‌లో పరాజయంతో ఇంటిబాట పట్టారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 19-21, 11-21తో కొడాయ్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ఇక సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ 22-24, 14-21తో చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్ చేతిలో ఓటమి చవి చూసింది. అనుపమా ఉపాధ్యాయ 21-13, 11-21, 12-21తో వాంగ్ ఝీ హీ (చైనా) చేతిలో పోరాడి ఓడింది.

పెయింటర్‌గానే ఎక్కువ సంపాదన

ఇంగ్లండ్ మాజీ కీపర్ జాక్ రస్సెల్



లండన్: దాదాపు మూడు దశాబ్దాల క్రితమే క్రికెట్‌కు వీడ్కోలు చెప్పిన ఇంగ్లండ్ మాజీ వికెట్ కీపర్ జాక్ రస్సెల్ ఇప్పుడు కాన్వాస్ పెయింటర్‌గా స్థిరపడ్డాడు. 1988-1998 మధ్య తను 54 టెస్టులు, 40 వన్డేలు ఆడాడు. కళ్లకు నల్లటి గ్లాసులు, తలకు పనామా టోపీ, పొడవాటి మీసాలతో విలక్షణంగా కనిపించే రస్సెల్ 90 దశకంలో క్రికెట్ ఫ్యాన్స్‌ను అమితంగా ఆకట్టుకునేవాడు. క్రికెట్ నుంచి వైదొలిగాక పెయింటింగ్‌లో బిజీ అయ్యానని చెప్పాడు. అంతేకాకుండా క్రికెట్ ఆడే సమయంలోకన్నా ఇప్పుడే ఎక్కువగా సంపాదిస్తున్నట్టు రస్సెల్ తెలిపాడు. అయితే ధన సంపాదన కోసమే పెయింటింగ్స్ వేయడం లేదని, బొమ్మలు గీయడం తనకో వ్యసనమని తేల్చాడు. భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నందున తాను రంజిత్ సింగ్‌జీ బొమ్మను సైతం చిత్రించినట్టు పేర్కొన్నాడు.

ఈతకొలనులో చైనా చిన్నారి ప్రకంపనలు!



సింగపూర్: యు జిడీ..చైనాకు చెందిన ఈ బాలికకు 12 సంవత్సరాలు. కానీ స్విమ్మింగ్ ప్రపంచం మొత్తం ఈమెవైపు ఆసక్తిగా చూస్తోంది. కారణం..ప్రస్తుతం సింగపూర్‌లో జరుగుతున్న వరల్డ్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఆ చిన్నారి ఎన్ని ప్రకంపనలు సృష్టిస్తుందోనని! ఈ పోటీల్లో మహిళల 200 మీ., 400 మీ. వ్యక్తిగత మెడ్లేతోపాటు, 200 మీ. బటర్‌ఫ్లై ఈవెంట్లలో యు బరిలోకి దిగుతోంది. ఈ మూడింటిలో యు జిడీకి స్వర్ణాలు ఖాయమని స్విమ్మింగ్ విశ్లేషకులు బల్లగుద్ది చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ మూడు విభాగాల్లో ఆమె నమోదు చేసిన సమయాలను చూస్తే ఈ చైనీస్ వండర్ సింగపూర్‌లో పసిడి మోత మోగిస్తుందని అంటున్నారు.

స్విమ్మింగ్‌లో రోహిత్ జాతీయ రికార్డు

న్యూఢిల్లీ: భారత టీనేజ్ స్విమ్మర్ రోహిత్ బెనెడిక్టన్ జర్మనీలో జరుగుతున్న ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడల్లో జాతీయ రికార్డును తిరగ రాశాడు. గురువారం జరిగిన పురుషుల 50 మీ. బటర్‌ఫ్లైలో 24 సెకన్లలో గమ్యం చేరిన రోహిత్..వీర్‌ధవల్ ఖడే పేరిట ఏడేళ్ల నుంచి ఉన్న రికార్డు (24.09సె.) బద్దలుగొట్టాడు. ఓవరాల్‌గా 12వ స్థానంలో నిలిచిన రోహిత్ సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ 5-0తో మకావును చిత్తు చేసింది.

అందరూ టైబ్రేకర్‌కు..

మహిళల చెస్ వరల్డ్ కప్

బటూమి (జార్జియా): మహిళల చెస్ ప్రపంచ కప్ ప్రీక్వార్టర్ ఫైనల్ రెండో గేమ్‌ను గ్రాండ్‌మాస్టర్లు హంపి, హారిక, వైశాలి డ్రా చేసుకున్నారు. అయితే ఝు జినెర్ చేతిలో దివ్యా దేశ్‌ముఖ్ పరాజయం చవిచూసింది. దాంతో టైబ్రేకర్‌ద్వారా క్వార్టర్‌ఫైనల్ చేరేదెవరో తేలనుంది. గురువారం జరిగిన రౌండ్-16 రెండో గేమ్‌లో..కొస్టెన్యూక్‌తో హంపి, లగ్నోతో హారిక, కమలిదెనోవాతో వైశాలి పాయింట్ పంచుకున్నారు. అయితే ఝు జినెర్‌తో తొలి గేమ్‌లో గెలుపొందిన దివ్య రెండో గేమ్‌లో ఓటమి చవిచూసింది.

అప్పుడే..ఎంత ఎదిగావు తల్లీ !



న్యూఢిల్లీ: కూతురు ఐరా 10వ పుట్టిన రోజును పురస్కరించుకొని టీమిండియా పేసర్ మహ్మద్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. షమి-హసీన్ జంట మనస్పర్థల కారణంగా 2018లో విడిపోయినప్పటినుంచి ఐరా తల్లి వద్ద ఉంటోంది. 'నువ్వు ఇంత త్వరగా ఎదిగావంటే నమ్మలేకపోతున్నా. జీవితంలో నీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నా. భగవంతుడు నీకు ప్రేమ, ఆనందం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా' అంటూ ఐరాతో కలిసి ఉన్న ఫొటోలను పంచుకున్నాడు.

హురున్ యువ పారిశ్రామికవేత్తల్లో శశాంక్ గుజ్జుల, అనుపమ్ పెదరాల

అగ్రస్థానంలో జెప్టో వ్యవస్థాపకులు కైవల్య వోహ్రా, అదిత్ పలిచ

▸▸ అనంత్ అంబానీ, సాగర్ అదానీలకూ చోటు



న్యూఢిల్లీ: దేశంలో 30 ఏళ్లలోపు యువ పారిశ్రామికవేత్తల జాబితాలో క్విక్ కామర్స్ స్టార్టప్ జెప్టో సహ వ్యవస్థాపకులైన అదిత్ పలిచ, కైవల్య వోహ్రా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. మొత్తం 79 మంది యంగ్ ఆంత్రప్రెన్యూర్ల వివరాలతో కూడిన ఈ జాబితాను అవెండస్ వెల్త్, హురున్ ఇండియా సంయుక్తంగా గురువారం విడుదల చేశాయి. హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుటెక్ స్టార్టప్ నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదరాలకు కూడా ఈ లిస్ట్‌లో స్థానం లభించింది. మిర్యాలగూడకు చెందిన 28 ఏళ్ల శశాంక్ గుజ్జుల, ఏలూరు జిల్లా పెదరాయి గ్రామానికి చెందిన 30 ఏళ్ల అనుపమ్ పెదరాల వరుసగా 29, 30 స్థానాల్లో ఉన్నారు. కాలేజీ విద్యార్థులకు ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో వీరు 2020లో నెక్స్ట్‌వేవ్‌ను ప్రారంభించారు. కాగా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన అనంత్ అంబానీ, రాధిక అంబానీతో పాటు అదానీ గ్రూప్‌నకు చెందిన సాగర్ అదానీ సహ పలువురు రెండో తరం పారిశ్రామికవేత్తలకు సైతం ఈ జాబితాలో చోటు లభించింది.

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 375 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 375.24 పాయింట్లు కోల్పోయి 82,259.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110.60 పాయింట్లు తగ్గి 25,111.45 వద్దకు జారుకుంది. ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా కొలిక్కి రాకపోవడంతో ఈక్విటీ మదుపరులు వేచి చూసే ధోరణిలో ఉన్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. టెక్ మహీంద్రా షేరు అత్యధికంగా 2.76 శాతం క్షీణించింది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ స్టాక్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

ఇక్రిశాట్‌తో టఫే భాగస్వామ్యం

వ్యవసాయ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్: వ్యవసాయ పరిశోధనల రంగంలోని ఇక్రిశాట్‌లో ఒక పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు ప్రముఖ ట్రాక్టర్ల తయారీ కంపెనీ టఫే ఒక అవగాహనా పత్రంపై సంతకాలు చేసింది. "జేఫార్మ్ అడాప్టివ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్" పేరిట ఏర్పాటయ్యే ఈ కేంద్రం యంత్రాల సహాయంతో శనగ పంట పండించడంలో ఇక్రిశాట్ విప్లవాత్మక అన్వేషణలను, వ్యవసాయ యాంత్రీకీకరణలో టఫే నైపుణ్యాలను ఉపయోగించుకుంటుంది. వ్యవసాయ రంగంలో విభిన్న అవసరాలపై తమకు లోతైన అవగాహన ఉన్నదని, ఇక్రిశాట్‌తో జ్ఞాన సంపదను పంచుకోవడం వల్ల వ్యవసాయ యాంత్రికీకరణను విస్తృతంగా చేపట్టే వీలుంటుందని టఫే గ్రూప్ ప్రెసిడెంట్ టీఆర్ కేశవన్ అన్నారు. సుస్థిర వ్యవసాయ విధానాలు ప్రత్యేకించి భూసార సంరక్షణ, నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతులను విద్యావంతులను చేయడానికి ఈ కేంద్రం సహాయకారిగా ఉంటుందన్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయం రూ.1,137 కోట్లు

క్యూ1 లాభం రూ.41 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,136.80 కోట్ల ఆదాయంపై రూ.40.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,032.67 కోట్లు)తో పోల్చితే ఆదాయం 10 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 31 శాతం (రూ.58.42 కోట్లు) తగ్గింది. ఏప్రిల్- మే నెలల్లో అకాల వర్షాల కారణంగా అన్ని మార్కెట్లలో పెరుగు, బటర్‌మిల్క్, ఫ్లేవర్డ్ మిల్క్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గటం పనితీరు ప్రభావం చూపించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. అయితే జూన్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనటం కొంతమేరకు కలిసివచ్చిందని పేర్కొంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూలు తొలిసారిగా రూ.1,100 కోట్ల మార్కును అధిగమించాయని తెలిపింది. మరోవైపు ఈ కాలంలో వ్యయాలు కూడా రూ.958.90 కోట్ల నుంచి రూ.1,085.76 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో వ్యాపారపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ కంపెనీ తొలిసారిగా రూ.1,100 కోట్ల రెవెన్యూ మార్కును అధిగమించిందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. కంపెనీ వ్యాపార ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్నాయని, దీర్ఘకాలంలో మరింత వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐస్‌క్రీమ్ ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. హెరిటేజ్ నేవాండెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌ఎన్‌ఎఫ్‌పీఎల్)లో అదనంగా 44.4 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం లభించిందని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. ఈ కొనుగోలుతో హెచ్‌ఎన్‌ఎఫ్‌పీఎల్‌లో కంపెనీ మొత్తం వాటా 94.4 శాతానికి చేరనుంది.

విప్రో లాభం రూ.3,336 కోట్లు

రూ.22,135 కోట్లకు పెరిగిన ఆదాయం | **ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్**



న్యూఢిల్లీ: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9.8 శాతం వృద్ధితో రూ.3,336.5 కోట్లకు పెరిగింది. కొత్త కాంట్రాక్టులు భారీగా దక్కడం ఇందుకు దోహదపడింది. క్యూ1లో సంస్థ ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన స్వల్ప పెరుగుదలతో రూ.22,134.6 కోట్లకు చేరుకుంది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 7 శాతం, ఆదాయం 1.6 శాతం తగ్గాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఈ నెల 28న రికార్డు చేయనున్న కంపెనీ.. ఆగస్టు 15న డివిడెండ్ చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలు..

- క్యూ1లో కంపెనీ ఐటీ సేవల విభాగ ఆదాయం అమెరికన్ కరెన్సీలో 258.74 కోట్ల డాలర్లుగా నమోదైంది. మార్చి క్వార్టర్‌తో పోలిస్తే ఈ రెవెన్యూ 0.3 శాతం తగ్గగా.. గత జూన్‌తో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే 1.5 శాతం క్షీణించింది. కాగా, ఈ సెప్టెంబరుతో ముగియనున్న రెండో త్రైమాసికం (క్యూ2)లో ఐటీ సేవల విభాగ ఆదాయం 256.0-261.2 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. అంటే, క్యూ1తో పోలిస్తే ఈ విభాగ ఆదాయ వృద్ధి మైనస్ 1 నుంచి ప్లస్ ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని సంస్థ భావిస్తోంది.
- గడిచిన మూడు నెలల్లో విప్రో మొత్తం 497.1 కోట్ల డాలర్ల ఆర్డర్లు దక్కించుకుంది. అందులో 267 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్ కూడా ఉన్నాయని కంపెనీ తెలిపింది.
- మార్చి త్రైమాసికంతో పోలిస్తే జూన్ చివరి నాటికి విప్రో ఉద్యోగుల సంఖ్య 114 మేర తగ్గి 2,33,232గా నమోదైంది. గడిచిన మూడు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 15 శాతం స్థాయిలో నమోదవుతూ వస్తోంది.
- గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు 0.93 శాతం తగ్గి రూ.260.25 వద్ద ముగిసింది.

10,000 మంది ఫ్రెషర్ల హైరింగ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోవాలనుకుంటున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ తెలిపారు. వాస్తవిక నియామకాలు మాత్రం భవిష్యత్ డిమాండ్‌పై ఆధారపడి ఉంటాయని మాత్రం గోవిల్ స్పష్టం చేశారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	99
వరంగల్	96	గుంటూరు	104
కరీంనగర్	96	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	100
కర్నూలు	96	నెల్లూరు	105
విశాఖపట్నం	85	అనంతపురం	105
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,330 ▲	91,050 ▲	1,24,000 ▼
విజయవాడ	1,00,000 ▼	94,000 ▼	1,13,800 ▼
విశాఖపట్నం	1,00,150 ▼	91,050 ▲	1,24,000 ▼
రాజమండ్రి	99,330 ▲	91,050 ▲	1,14,600 ▼
ప్రొద్దుటూరు	97,650 ▼	89,840 ▼	1,13,600 ▲
ముంబై	97,453 ▼	89,267 ▼	1,11,000 ▼

బిజినెస్

స్పీచ్‌ను టెక్స్ట్‌గా మార్చే ఎల్‌ఎల్‌ఎం

- ఆవిష్కరించిన జోహో

బెంగళూరు: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్‌ఎల్‌ఎం) ఆవిష్కరణలో దేశీయ కంపెనీలూ తమ సత్తా చూపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) పద్ధతిలో కంపెనీలకు సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు అందించే దేశీయ టెక్నాలజీ కంపెనీ జోహో 'జియా ఎల్‌ఎల్‌ఎం' పేరుతో తన సొంత ఎల్‌ఎల్‌ఎంను ఆవిష్కరించింది. తమ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను ఉపయోగిస్తున్న ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎల్‌ఎల్‌ఎంను అభివృద్ధి చేసినట్టు జోహో తెలిపింది. తమ ఎల్‌ఎల్‌ఎంతో ఉద్యోగాలకు, నియామకాలకు ఎలాంటి ముప్పు ఉండదని పేర్కొంది. స్పీచ్‌ను టెక్స్ట్‌గా మార్చడం ఈ ఎల్‌ఎల్‌ఎం ప్రత్యేకత.

యాక్సిస్ బ్యాంక్‌కు మొండిబాకీల సెగ

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.5,806 కోట్లకు పరిమితమైంది. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) స్వల్పంగా పెరగడం ఇందుకు కారణమైంది. సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం రూ.38,322 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.31,064 కోట్లుగా నమోదైంది. గత ఏడాది జూన్ 30 నాటికి 1.54 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏలు ఈ జూన్ చివరి నాటికి 1.57 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.45 శాతానికి ఎగబాకాయి. ఈ కాలంలో బ్యాంక్ మొండిబకాయిలతో పాటు ఇతర అవసరాలకు రూ.3,948 కోట్లను కేటాయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

అమెరికా ఈబీ-5 వీసాలకు గిరాకీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ నుంచి అమెరికాకు వెళ్లేందుకు ఈబీ-5 వీసాలు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని యూఎస్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) వెల్లడించింది. అమెరికాలో ఈబీ-5 రీజినల్ సెంటర్లను నిర్వహిస్తున్న సంస్థల్లో యూఎస్ఐఎఫ్ కీలకంగా ఉంది. విభిన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా అమెరికాలో శాశ్వత నివాస హోదాను పొందేందుకు ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ప్రోగ్రామ్‌ను 1999లో అక్కడి ప్రభుత్వం తీసుకువచ్చిందని యూఎస్ఐఎఫ్ వైస్ ప్రెసిడెంట్, ఇండియా, యూఏఈ హెడ్ అక్షత్ గుప్తా తెలిపారు. అయితే 2022 నుంచి ఈ వీసాకు సంబంధించిన నిబంధనల్లో కొన్ని మార్పులు చేర్పులు చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం ఈబీ-5 కింద వీసా పొందాలనుకునే వారు అమెరికాలో కనీసం 8 లక్షల డాలర్ల (సుమారు రూ.7 కోట్లు) వరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందన్నారు. అయితే దీని కింద దరఖాస్తు చేసుకున్న వారికి వీసా లభించటానికి 8 నుంచి 18 నెలల కాలం పడుతుందని ఆయన తెలిపారు. ఐదేళ్ల తర్వాత 21 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు, భార్యాభర్తలకు అమెరికాలో శాశ్వత నివాస హోదా లభిస్తుందన్నారు. ప్రస్తుతం అమెరికా ఏటా 10,000 ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ వీసాలను జారీ చేస్తోందని ఆయన చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈబీ-5 కింద దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య అధికంగా ఉంటోందన్నారు. ఈబీ-5 కింద పెట్టుబడులు పెట్టాలనుకునే భారతీయులకు తమ సంస్థ సలహాలు ఇవ్వటమే కాకుండా అందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేస్తుందన్నారు. వచ్చే ఏడాది సెప్టెంబరు చివరి నాటికి ఈ ఇమ్మిగ్రెంట్ ప్రోగ్రామ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేకమైన ప్రొవిజన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఒకవేళ ఆ తర్వాత విధానపరంగా మార్పులు చేర్పులు జరిగినా వారి దరఖాస్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని గుప్తా తెలిపారు.

రాష్ట్రానికి ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

- వివిధ కేటగిరీల్లో విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖ, రాజమండ్రి కార్పొరేషన్లకు..
- రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

డిల్లీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు మున్సిపల్ కార్పొరేషన్లకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు దక్కాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం డిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఐదు మున్సిపల్ కార్పొరేషన్ల అధికారులతో కలిసి పురపాలక శాఖ మంత్రి నారాయణ అవార్డులను అందుకున్నారు. దేశం మొత్తం మీద 23 కార్పొరేషన్లు అవార్డులు దక్కించుకోగా వాటిలో మూడు ఏపీ నుంచే ఉన్నాయి. పది లక్షల జనాభా దాటిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షల జనాభా కలిగిన పట్టణాల్లో గుంటూరు, 50 వేల నుంచి మూడు లక్షల జనాభా కలిగిన కేటగిరిలో తిరుపతి కార్పొరేషన్ అవార్డులు అందుకున్నాయి. స్వచ్ఛ అవార్డుల్లో ఎప్పుడూ ముందంజలో ఉండే ఇండోర్, సూరత్, నవీ ముంబయి నగరాల సరసన విజయవాడ, గుంటూరు, తిరుపతి కూడా చేరాయి. ఇక మినిస్టీరియల్ అవార్డు స్పెషల్ కేటగిరిలో సఫాయి మిత్ర సురక్షిత నగరాల్లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) ప్రథమ స్థానంలో నిలిచింది. మినిస్టీరియల్ అవార్డుల్లో రాష్ట్రస్థాయిలో రాజమండ్రి నిలిచింది. ఈ అవార్డులు మున్సిపల్ శాఖ పనితీరుకు నిదర్శనమని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకు కృషిచేసిన అధికారులు, పారిశుధ్య సిబ్బందిని అభినందించారు.

ఎఫ్‌సీఐకి పది శాతం నూకలు

- ఐదు రాష్ట్రాల నుంచి సేకరిస్తున్న కేంద్రం: మనోహర్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యం మేరకు పది శాతం బ్రోకెన్ రైస్ (నూకలు)ను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సరఫరాల చేసేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో గురువారం రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీతోపాటు హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 10 శాతం బ్రోకెన్ రైస్‌ను కేంద్రం సేకరిస్తోందన్నారు. మన రాష్ట్రం నుంచి బ్రోకెన్ రైస్ సరఫరా చేసేందుకు మిల్లర్లు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. ఇందుకు అవసరమైన టెస్టింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లను ముందుగానే చేసుకుని, గడువులోగా సరఫరా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైందని చెప్పారు. కమిషనర్ సౌరభ్‌గౌర్, కార్పొరేషన్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ సమావేశంలో పాల్గొన్నారు.

నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయండి

- కల్తీ ఆహారం, మందుల్ని నివారించండి: మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యతలేని మందుల సరఫరా.. ఈ రెండు విషయాల్లో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖలో ఐపీఎం, డ్రగ్ విభాగాలపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) విభాగాల్లోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఐపీఎం, డీసీఏ విభాగాలకు దీర్ఘకాలికంగా రెగ్యులర్ విభాగాధిపతులు లేకపోవడంతో ఈ శాఖల పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి, వివిధ స్థాయిల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో డిజిటల్ వైద్య సేవల్ని విస్తృతం చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్వాంటం వ్యాలీతో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం

- బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విదేశాలకు మనీల్యాండరింగ్ జరగ్గా.. కూటమి ప్రభుత్వంలో విదేశాల నుంచి క్వాంటం కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారబోతోందని పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అమరావతి క్వాంటం వ్యాలీకి ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీలు క్యూ కడుతున్నాయని, భవిష్యత్తులో ఈ వ్యాలీ చరిత్ర సృష్టించడం ఖాయమన్నారు. గత ప్రభుత్వం అసలు క్వాంటం వ్యాలీని ఏపీలో ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదని, చంద్రబాబు సీఎం అయిన తర్వాతే క్వాంటం కంప్యూటింగ్‌లో రాష్ట్రం ముందుకు వచ్చిందన్నారు. ఆసియాలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని 2026 జనవరి 1న అమరావతిలో ప్రారంభం కానుందని, ఏపీ తన అతిపెద్ద క్వాంటం కంప్యూటర్ ఐబీఎం క్వాంటం సిస్టం-2ను స్థాపించనుందని పేర్కొన్నారు.

యువత భవిష్యత్తుతో జగన్ చెలగాటం: రవి

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతను మాజీ సీఎం జగన్ రెచ్చగొడుతూ.. వారిని హత్యారాజకీయాల వైపు ప్రోత్సహిస్తున్నారని ఏపీ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు మండిపడ్డారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎంగా పనిచేసిన వ్యక్తి యువత భవిష్యత్తును కోరుకోవాలే తప్ప, ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. దీనిపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, వారి పిల్లల భవిష్యత్తుపై ఆలోచన చేయాలని సూచించారు. జగన్ ఎక్కడ పర్యటన చేసినా.. బెదిరింపులు తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడిన సందర్భాలు లేవని విమర్శించారు. 'ప్రజలు ఛీకొట్టినా మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ పగటి కలలు కంటున్నారు. ప్రజలకు మేలు చేస్తే అధికారంలోకి వస్తారే తప్ప.. తలలు తీసేస్తాం, రప్పా రప్పా అంటే అధికారంలోకి ఎలా వస్తారు?' అని ప్రశ్నించారు.

పాఠశాల విద్య బలోపేతానికి అకడమిక్ ఫోరంలు

- రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ఏర్పాటుకు ఆదేశాలు

అమరావతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య బలోపేతానికి అకడమిక్ ఫోరంలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వీటి ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. అకడమిక్ అంశాల్లో మార్గనిర్దేశనం, సామర్థ్యాల పెంపు, అభ్యసన ఫలితాల మెరుగుదలకు జవాబుదారీతనం తదితర అంశాలను ఇవి పర్యవేక్షించనున్నాయి. రాష్ట్రస్థాయి ఫోరానికి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఎస్‌సీఈఆర్‌టీ, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్లు, కేజీబీవీ కార్యదర్శి, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ ఫోరం వ్యూహాత్మక దిశానిర్దేశం, అకడమిక్ గైడెన్స్ అంశాలను పర్యవేక్షిస్తుంది. జిల్లా ఫోరంలో డీఈవో చైర్‌పర్సన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, డైట్ ప్రిన్సిపాల్, డీసీఈబీ కార్యదర్శి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయి బృందాలను సమన్వయం చేస్తూ అకడమిక్ అంశాల్లో ఈ కమిటీలు సూచనలు చేస్తాయి. ఇక మండల స్థాయి ఫోరానికి ఎంఈవో-1 చైర్‌పర్సన్‌గా, ఎంఈవో-2, క్లస్టర్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ టీచర్లు సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, నకిలీ నమోదుల తొలగింపు, విద్యార్థి వరుసగా గైర్హాజరైతే ఇంటికి వెళ్లి ఆరా తీయడం వంటి బాధ్యతలను కూడా ఈ ఫోరాలు పర్యవేక్షించాలి.

భూ కేటాయింపులకు ప్రత్యేక కమిటీ

- కమిటీ చైర్మన్‌గా ఏపీటీడీసీ ఎండీ

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు భూములు కేటాయింపు కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. టూరిజం పాలసీ ప్రకారం భూముల కేటాయింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉండటంతో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీటీడీసీ ఎండీ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. టూరిజం అథారిటీ సీఈవో కో-చైర్మన్‌గా, ఏపీటీడీసీ ఈడీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వీరితో పాటు మరో ఎనిమిది మందిని కమిటీలో మెంబర్లుగా నియమించారు. ఈ కమిటీ పారదర్శకంగా బిడ్డింగ్ నిర్వహించి, అర్హత కలిగిన కంపెనీలకు భూములు కేటాయించేలా చూడాలి. టూరిజం పాలసీలోని భూ కేటాయింపుల నిబంధనల ప్రకారమే బిడ్డింగ్ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న మంత్రి నారాయణ, గుంటూరు మేయర్ కె.రవీంద్ర, స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ పట్టాభి, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యాన్‌చంద్, సీనియర్ ఐఏఎస్ సురేశ్, తిరుపతి మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య

ఎయిరిండియా.. విమాన ప్రమాదం తర్వాత మరోమారు చర్చ

కెమెరాల ఏర్పాటుకు పెరుగుతున్న డిమాండ్

దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నా పైలట్ల వల్ల వెనక్కి!

కాక్‌పిట్‌లో.. కెమెరాలు ఎందుకు ఉండవు?





న్యూఢిల్లీ, జూలై 16: విమానాల్లోని కాక్‌పిట్‌లో కెమెరాలెందుకు ఉండవు? ప్రమాదాలు జరిగినప్పుడు కారణాలను అన్వేషించేందుకు బ్లాక్‌బాక్స్ రికార్డింగ్‌తోపాటు.. వీడియో ఆధారాలకు కెమెరాలు అవసరం. అయితే.. దశాబ్దాలుగా కాక్‌పిట్‌లో కెమెరాల ఏర్పాటు డిమాండ్ ముందుకు సాగడం లేదు. గత నెల 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో.. ఇప్పుడు మరోమారు వీడియో రికార్డర్ల ఏర్పాటు డిమాండ్‌పై చర్చ జరుగుతోంది.

బ్లాక్‌బాక్స్ వాయిస్‌తో...

ఇటీవలి ఎయిరిండియా ప్రమాదంలో బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషించిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రాథమిక నివేదికలో.. ఓ పైలట్ 'ఇంధనాన్ని ఎందుకు ఆపేశావు?' అని ప్రశ్నించగా.. రెండో పైలట్ 'నేను అలా చేయలేదు' అని సమాధానమిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో కాక్‌పిట్ వాయిస్ మాత్రమే ఉండడంతో.. వీడియో కూడా రికార్డై ఉంటే.. ఏం జరిగిందో తెలిసేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్లలో, రైళ్లలో, స్కూలు బస్సుల్లో.. చివరకు ట్రక్కుల్లో కూడా కెమెరాలున్నప్పుడు.. విమానాల్లోని కాక్‌పిట్‌లో ఎందుకు ఉండకూడదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



కెమెరాలను అమర్చడం సాధ్యమేనా?



పాతతరం విమానాల్లో కెమెరాలను అమర్చేందుకు ఇంటర్నల్ ఎలక్ట్రిక్ వైరింగ్ వ్యవస్థ అంతగా సహకరించేది కాదని సమాచారం. అయితే.. ఇప్పుడు వస్తున్న విమానాల్లో కెమెరాలను అమర్చడం పెద్ద సమస్యే కాదని నిపుణులు చెబుతున్నారు. అమెరికాకు చెందిన జాతీయ రవాణా భద్రత మండలి(ఎన్‌టీఎస్‌బీ) కూడా పాతికేళ్లుగా కాక్‌పిట్‌లో వీడియో రికార్డర్లను ఏర్పాటు చేయడంపై తీవ్రంగా ప్రయత్నిస్తోంది. హెలికాప్టర్లలో కూడా శిక్షణ, పరిశీలన నిమిత్తం వీడియో కెమెరాలను ఏర్పాటు చేస్తారని గుర్తుచేస్తోంది. చైనా కూడా తన కోమాక్ సీ919 విమానాల్లోని కాక్‌పిట్‌లలో వీడియో మానిటరింగ్ వ్యవస్థను పరిచయం చేసే దిశలో వేగంగా అడుగులు వేస్తోంది.

పైలట్ల సంఘాలే అతిపెద్ద అడ్డంకి!

కాక్‌పిట్‌లో కెమెరాల అమరికకు పైలట్లే పెద్ద అడ్డంకిగా ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కెమెరాల వల్ల ప్రైవసీకి భంగం వాటిల్లుతుందని పైలట్ల సంఘాలు చెబుతున్నాయి. ఒత్తిడితో తీసుకునే నిర్ణయాలు ఆడియోలో స్పష్టంగా తెలియవని, వీడియోలోనే స్పష్టత ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నా.. "మాపై నిఘా పెట్టేందుకే విమానయాన సంస్థలు కెమెరాల ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నాయి" అంటూ పైలట్ల సంఘాలు వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. వీడియోలు లీకై.. ఇబ్బందులు కలగవచ్చని చెబుతున్నాయి. ప్రతి చర్యను వీడియో రికార్డింగ్‌తో మూల్యాంకనం చేస్తే.. వాస్తవికత గతి తప్పుతుందని పేర్కొంటున్నాయి. అమెరికాకు చెందిన అతిపెద్ద పైలట్ల యూనియన్ - ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్(ఏఎల్‌పీఏ) ముందు నుంచి వీడియోల ఏర్పాటును బలంగా వ్యతిరేకిస్తోంది. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా చర్యలు సరికాదని వాదిస్తోంది.

1989 నుంచే అమలుకు చర్యలు

కాక్‌పిట్‌లో వీడియో కెమెరాల ఏర్పాటుకు 1989లోనే తొలి అడుగులు పడ్డాయి. అప్పట్లో న్యూయార్క్‌లోని కాన్సస్ సిటీ విమాన ప్రమాదం తర్వాత.. ఎన్‌టీఎస్‌బీ ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చింది. 2000 సంవత్సరంలో అధికారికంగా కెమెరాల ఏర్పాటును ప్రతిపాదించింది. 2003 నుంచి ఎన్‌టీఎస్‌బీ తన 'మోస్ట్ వాంటెడ్ లిస్ట్'లో కాక్‌పిట్ కెమెరాలను చేర్చింది. కానీ, అమెరికా కాంగ్రెస్, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) ఈ ప్రతిపాదనను ఇప్పటికీ తప్పుబడుతున్నాయి.

వీడియో లేక తేలని కేసులు?

1999లో న్యూయార్క్ నుంచి కైరో వెళ్తున్న ఈజిప్ట్ ఎయిర్ ఫ్లైట్-990 అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయింది. విమానంలోని 217 మంది దుర్మరణం పాలయ్యారు. బ్లాక్‌బాక్స్ రికార్డు ప్రకారం.. పైలట్(ఫస్ట్ ఆఫీసర్) గమిల్ అల్-బటౌటీ టాయ్‌లెట్‌కి వెళ్తూ.. ఆటోపైలట్ మోడ్‌ను నిలిపివేశారు. "భగవంతుడి మీద ఆధారపడుతున్నాను" అంటూ ఆయన వరుసగా పలికినట్లు స్పష్టమైంది. ఎన్‌టీఎస్‌బీ ఈ ప్రమాదాన్ని 'ఉద్దేశపూర్వక క్రాష్'గా ప్రకటించింది. అయితే.. ఈజిప్టు అధికారులు మాత్రం మానవ తప్పిదం కాదని వాదించారు. వీడియో రికార్డింగ్ లేకపోవడం వల్ల ఈ కేసులో స్పష్టత లేదని చెప్పారు. ఇప్పుడు ఎయిరిండియా విమాన ప్రమాదంలోనూ.. ఓ పైలట్ 'ఇంధనాన్ని ఎందుకు ఆపావు?' అని ప్రశ్నించగా.. 'నేను అలా చేయలేదు' అని రెండో పైలట్ చెప్పారు. వీడియో రికార్డింగ్ లేకపోవడం వల్ల.. ఏం జరిగిందనే దానిపై స్పష్టత కొరవడుతోంది. ఆస్ట్రేలియా తీరంలో ఇటీవల ఓ హెలికాప్టర్ సముద్రంలో కూలింది. పైలట్ చనిపోయారు. అయితే.. హెలికాప్టర్‌లోని వీడియో కెమెరా.. దర్యాప్తులో కీలకంగా నిలిచింది. 'ఆటో పైలట్ మోడ్' ఉన్నప్పుడు పైలట్ మొబైల్‌ను చూస్తూ.. ఆహారం, శీతలపానీయాలు తీసుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించినట్లు నిర్ధారణైంది. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలిశాయి.

నిమిష ప్రియ సరే...

తెలుగువారి సంగతేంటి?

- గల్ఫ్ జైళ్లలో దశాబ్దాలుగా మగ్గిపోతున్న ప్రవాసాంధ్రులు
- బాధితులకు బ్లడ్ మనీ చెల్లిస్తే విడుదలయ్యే అవకాశం
- ఆర్థిక సాయం చేసేవారి కోసం కుటుంబాల ఎదురుచూపులు



నిమిష

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియ తరహాలో కొందరు ప్రవాసాంధ్రులు గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో మగ్గిపోతున్నారు. దశాబ్దాల తరబడి జైలు గోడల మధ్య బందీలుగా గడుపుతూ సాయం కోసం వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు. ఇతరుల మరణాలకు కారణమైన వీరు బాధిత కుటుంబానికి దియా సొమ్ము (బ్లడ్ మనీ) చెల్లించడం ద్వారా లేదా వారితో రాజీపడి జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా తగిన కార్యాచరణ లేకపోవడంతో వారికి విముక్తి లభించడం లేదు. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం గుప్పడిపేట గ్రామానికి చెందిన సిందుపల్లి గురయ్య దశాబ్ద కాలంగా దుబాయిలో జైలులో ఉన్నారు. 2016లో దుబాయ్ వచ్చిన ఆయన నెల రోజులకే తమతో పాటు ఉన్న విశాఖపట్నం వాసి యంపల లక్ష్మణరావు మరణానికి బాధ్యుడని కోర్టు నిర్ధారించింది. లక్ష్మణరావుది పేద కుటుంబం కావడంతో వారిపోషణ కోసం రూ.5లక్షలు దియా కింద అడిగారు. గురయ్య కుటుంబం ఆ మొత్తం సమకూర్చలేని నిస్సహాయ స్థితిలో ఉంది. అలాగే సౌదీఅరేబియాలో వాహనం నడుపుతూ ఒక బంగ్లాదేశ్ జాతీయుడి మరణానికి కారణమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన యాతం జీవ(29) జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన్ను విడుదల చేయడానికి తమకు రూ.51,55,000 దియాగా చెల్లించాలని మృతుని కుటుంబం డిమాండ్ చేసింది. కుటుంబ అప్పులు తీర్చడానికి తమ కొడుకు జీవ డ్రైవర్‌గా పని చేయడానికి సౌదీ వెళ్లాడని, తర్వాత కొద్దికాలానికే ఈ దుర్ఘటన జరిగిందని, దియా చెల్లించడానికి తమ వద్ద అంత డబ్బులేదని అతని తండ్రి నాగేశ్వరరావు వాపోతున్నారు. వారి తరఫున సౌదీలోని ప్రముఖ తెలుగు ప్రవాసీ సంఘం సాటా సెంట్రల్ ప్రతినిధి షేక్ జానీ బాషా బంగ్లాదేశ్‌లోని మృతుడి కుటుంబంతో దియా సొమ్ము తగ్గింపుపై చర్చలు జరుపుతున్నారు. ఇక, తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన దరూరి బుచ్చన్న దాదాపు 20ఏళ్ల పాటు షార్జా జైలులో గడిపి అక్కడే కన్నుమూశారు. అతని చేతిలో హత్యకు గురైన నిజామాబాద్ జిల్లా వాసి బి.గోవర్ధన్ కుటుంబం తమకు రూ.3 లక్షలు దియాగా చెల్లిచాలని కోరింది. అయితే బుచ్చన్న కుటుంబీకులు ఆ మొత్తం చెల్లించలేపోయారు. సౌదీలో ఒక బాలుడి మృతికి కారణమైన అబ్దుల్ రహీం అనే కేరళ డ్రైవర్‌కు మరణశిక్ష తప్పించడానికి మలయాళీ ప్రవాసులంతా కలసి ఫండ్ రైజింగ్ చేసి రూ.34 కోట్లు బాధిత కుటుంబానికి చెల్లించారు. తాజాగా నిమిష ప్రియ చేతిలో హత్యకు గురైన వ్యక్తి కుటుంబానికి రూ.8 కోట్ల 60 లక్షలు చెల్లించేందుకు మలయాళీ సమాజం ముందుకొచ్చింది. ఈ స్ఫూర్తి తెలుగువారిలో కరువైంది.

39,473 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రానికి కొత్తగా 22 ప్రాజెక్టులు..

30,899 ఉద్యోగాలు

ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా రూ. 39,473 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. దీంతో 22 కొత్త ప్రాజెక్టులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎనిమిదో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం ఈ నూతన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. పరిశ్రమలు-వాణిజ్యం, ఇంధన, పర్యాటక, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. వీటితో కలిపి కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్వహించిన ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 109 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో పారిశ్రామిక రంగంలో 46, ఇంధన రంగంలో 41, పర్యాటక రంగంలో 11, ఐటీలో 7, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 4 పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా మొత్తంగా రూ. 5,74,238 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. 5,05,968 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ఎకోసిస్టంతో స్థానికులకు మేలు: సీఎం

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న నూతన పారిశ్రామిక ప్రాజెక్టుల చుట్టూ ఎకోసిస్టం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ ఎకోసిస్టం ద్వారా ఆయా ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకు మేలు కలుగుతుందని చెప్పారు. పరిశ్రమలకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు తదితర మౌలిక సదుపాయాలతోపాటు ఆ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు (ఎకనామిక్ యాక్టివిటీ) పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులు, స్థానికులకు ప్రయోజనం చేకూర్చినప్పుడే భూములు ఇవ్వడానికి సంతోషంగా ముందుకు వస్తారని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్దేశిత గడువులోగా పారిశ్రామిక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పర్యాటక ప్రాజెక్టుల విషయంలోనూ సమీకృత ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. కేవలం నిర్దేశిత ప్రాజెక్టులకు మాత్రమే పరిమితం కాకుండా వాటికి అనుబంధంగా పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకునేందుకు అవకాశాలు కల్పించాలని చెప్పారు. ప్రత్యేకించి సర్వీస్ సెక్టార్‌లో ప్రాజెక్టులను అనుసంధానం చేయాలన్నారు. పీపీపీ విధానంలో చేపట్టే పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను సేకరించి సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. శ్రీశైలానికి పర్యాటకులను ఆకర్షించేలా సమీకృత పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. శ్రీశైలం రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆతిథ్య రంగంలో కేవలం హోటల్ గదులు మాత్రమే కాకుండా.. వినోద కార్యకలాపాలు, సేవల రంగానికి సంబంధించిన ప్రాజెక్టులు వచ్చేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించామనే వివరాలు తెలిసేలా ఎంప్లాయిమెంట్ పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అచ్చెన్న, భరత్, గొట్టిపాటి, కేశవ్, అనగాని, సుభాష్ తదితరులు

తాజాగా ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగాలు..

- ఫినామ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్ - విశాఖపట్నంలో 205 కోట్ల పెట్టుబడి.. 2,500 ఉద్యోగాలు.
- శ్రీజా మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ - చిత్తూరులో 282 కోట్ల పెట్టుబడి.. 1,400 ఉద్యోగాలు.
- రెన్యూ వ్యోమన్ పవర్ లిమిటెడ్ - కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ. 1,800 కోట్ల పెట్టుబడి.. 380 ఉద్యోగాలు.
- రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ - కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ. 3,600 కోట్ల పెట్టుబడి.. 760 ఉద్యోగాలు.
- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ - కడప జిల్లాలో రూ. 2,000 కోట్ల పెట్టుబడి.. 1,380 ఉద్యోగాలు.
- పీవీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్-శ్రీకాకుళం జిల్లాలో 204 కోట్ల పెట్టుబడి.. 1,000 ఉద్యోగాలు.
- పీవీఎస్ గ్రూప్ - విజయనగరం జిల్లాలో రూ. 102 కోట్ల పెట్టుబడి.. 500 ఉద్యోగాలు.
- ఆర్వీఆర్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ. 4,708 కోట్ల పెట్టుబడితో నంద్యాల జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు.. 1,200 ఉద్యోగాలు.
- ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ - విశాఖలో రూ. 328 కోట్ల పెట్టుబడి.. 1,100 ఉద్యోగాలు.
- లాన్సమ్ లీజర్స్ లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్ - విశాఖలో 86 కోట్ల పెట్టుబడి.. 720 ఉద్యోగాలు.
- స్టార్ టర్న్ హోటల్స్ ఎల్‌ఎల్‌పీ - తిరుపతిలో రూ. 165 కోట్ల పెట్టుబడి.. 720 ఉద్యోగాలు.
- గ్రీన్ ల్యామ్ లిమిటెడ్ - తిరుపతి జిల్లా నాయుడుపేట సెజ్‌లో రూ. 1,147 కోట్ల పెట్టుబడి.. 1,475 ఉద్యోగాలు.
- యాక్సెలెంట్ ఫార్మా - తిరుపతి శ్రీసిటీలో రూ. 1,358 కోట్ల పెట్టుబడి.. 1,770 ఉద్యోగాలు.
- అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - కర్నూలు జిల్లాలో 6,933 కోట్ల పెట్టుబడితో సోలార్ సెల్, పీవీ మాడ్యూల్ ఉత్పత్తి.. 2,138 ఉద్యోగాలు.
- జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ ప్లాంట్ - రూ. 4,500 కోట్ల పెట్టుబడితో (రెండు దశల్లో) కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్.. 2,500 ఉద్యోగాలు.
- రెన్యూ ఫోటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ - అనకాపల్లి జిల్లాలో రూ. 3,700 కోట్ల పెట్టుబడి.. 1,200 ఉద్యోగాలు.
- లారస్ ల్యాబ్స్ - రూ. 5,630 కోట్ల పెట్టుబడితో అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద ప్రాజెక్టు.. 6,350 ఉద్యోగాలు.
- లులూ షాపింగ్ మాల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ - రూ. 1,222 కోట్ల పెట్టుబడితో విశాఖ, విజయవాడల్లో భారీ షాపింగ్ మాల్స్. 1,500 ఉద్యోగాలు.
- ఏస్ ఇంటర్నేషనల్ - రూ. 1,000 కోట్ల పెట్టుబడితో చిత్తూరు జిల్లా కుప్పంలో డెయిరీ యూనిట్.. 2000 ఉద్యోగాలు.
- బ్రాండిక్స్ ఇండియా అపారెల్ సిటీ ఇండియా - అచ్యుతాపురం సెజ్‌లో ఫుట్‌వేర్, టాయ్స్ తయారీ యూనిట్.
- వీఎస్ఆర్ సర్కాన్ - శ్రీకాకుళం జిల్లాలో రూ. 39 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు.. 246 ఉద్యోగాలు.
- అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయెల్స్ - కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక పార్కులో రూ. 500 కోట్ల పెట్టుబడి.. 500 ఉద్యోగాలు.

పోలవరం ఎత్తు తగ్గించిన పాపం జగన్‌దే

» చంద్రబాబు అవినీతి వ్యూహం బనకచర్ల: షర్మిల ఆరోపణలు



అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించిన పాపం జగన్‌దేనని.. ఇప్పుడు ఏమీ తెలియనట్లు బీద ఏడుపులు ఏడుస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కొడుకై ఉండి ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీశారా అని ప్రశ్నించారు. మహానేత ఆశయ సాధకుడే అయితే పోలవరంపై ఎందుకు నిర్లక్ష్యం చేశారని గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. 2022లో పోలవరం నీటినిల్వ సామర్థ్యం 41.15 మీటర్లకు కుదించిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిది కాదా? అంచనా వ్యయాన్ని రూ.55వేల కోట్ల నుంచి రూ.37వేల కోట్లకు కుదించలేదా? బీజేపీకి అమ్ముడుపోయి మోదీ కోసం పోలవరం ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇప్పుడు ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లకు పెంచాలని కోరడం బీద ఏడుపులే' అని షర్మిల ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును చంపేసి బనకచర్ల రెగ్యులేటర్ అనుసంధాన పథకాన్ని కట్టాలనుకుంటున్నారా అని సీఎం చంద్రబాబును ఆమె ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతి వ్యూహం బనకచర్ల అని ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తే 50 లక్షల ఎకరాలకు సాగునీరు, కోటి మందికి తాగునీరు అందుతాయని తెలిపారు. పాత డీపీఆర్ ప్రకారమే 45.72 మీటర్ల కాంటూరులోనే పోలవరం నిర్మాణం జరపాలని ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు.

జగన్‌కు.. రచ్చ చేయడం అలవాటే

» పంట కొనుగోలు పూర్తయ్యాక మేల్కొన్నారు : మంత్రి గొట్టిపాటి



పిడుగురాళ్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు జిల్లాలో 90% మామిడి పంట మొత్తం కొనుగోలు చేశాం. ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించింది. అంతా అయిపోయిన తర్వాత మేల్కొన్నాడు. మాజీ సీఎం జగన్‌కు రచ్చ చేయడం ఓ అలవాటుగా మారింది' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం పల్నాడు జిల్లా నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో కిసాన్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి పంట కొనుగోలు చేశాక బంగారుపాళ్యం వచ్చిన జగన్ నాలుగు ట్రక్కుల మామిడి కాయలను రోడ్డుపై పోయించి, తొక్కించి నానా యాగీ చేశాడు. నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు సీఎం చంద్రబాబు రూ.280 కోట్లు విడుదల చేశారు. అధిక సాగు, అధిక దిగుబడుల వల్లే కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. రైతులకు 9 గంటల నిరంతర ఉచిత విద్యుత్‌ను ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది' అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

» రెచ్చగొట్టే వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తప్పవు: మంత్రి అనిత



మచిలీపట్నం, చుండూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. ఈ విధానాన్ని వారు విడనాడాలి. లేకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోలీస్ శిక్షణ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఆమె... మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలసి మీడియాతో మాట్లాడారు. 'సినిమా డైలాగులు చెబితే తప్పేంటని జగన్ అంటున్నారు. అల్లు అర్జున్ ఫొటో పెట్టి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే తప్పులేదు. జగన్ ఫొటోలు వేసి రప్పా రప్పా అని ఫ్లెక్సీలు పెట్టారు. అందుకే కేసులు పెట్టారు' అని అనిత చెప్పారు. ఈ సందర్భంగా పట్టాభిపై, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి, తిరుపతి, విశాఖ విమానాశ్రయాల వద్ద చంద్రబాబును వైసీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్న తీరును ఆమె గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసిన టీడీపీ నేతలందరిపైనా వైసీపీ హయాంలో తప్పుడు కేసులు నమోదైన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. తాను ఎస్సీ అయినా తనపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందంటూ ఎద్దేవా చేశారు. సోదరి వరుసయ్యే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అక్కడితో ఆగకుండా రెండో రోజు తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారని, అందుకే ఆయనపై కేసు నమోదు చేశామన్నారు. రెచ్చగొట్టే విధంగా మాట్లాడే వారిపై చట్టపరంగా చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో మద్యం కుంభకోణంలో అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. కాగా బాపట్ల మండలం చుండూరు మండలం వేటపాలెంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో మంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ పేరు చెపితే గొడ్డలి వేటు, గంజాయి, చర్లపల్లి జైలు గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌లపై నోరు జారితే ఖబడ్దార్!

» వైసీపీ సైకోలకు తగిన రీతిలో బుద్ధి చెబుతాం: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), జూలై 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై వైసీపీ సైకోలు అనవసరంగా నోరు పారేసుకుంటే వారికి తగినరీతిలో బుద్ధి చెబుతామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న హెచ్చరించారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌లపై జగన్‌రెడ్డి సైకోలు పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ, జోగి రమేష్ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు కృషి వల్ల ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం చాలామంది ముందుకు వస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీ సైకోలందరూ కలిసి అల్లర్లకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పేర్ని నాని విశ్వాసం లేని కుక్కని, రేషన్ బియ్యం బొక్కేసింది, స్థలాలు కబ్జా చేసింది ఆయన కాదా అని ప్రశ్నించారు. దసరా ఉత్సవాల సమయంలో పులి వేషగాళ్ల తరహాలో వైసీపీ సైకోలు వ్యవహరిస్తున్నారని, వారికి ఏమాత్రం సిగ్గు, శరం లేవని మండిపడ్డారు. తమ నాయకుడు అరగంట టైమ్ ఇస్తే వారి సంగతి ఏమిటో చూస్తానని చెప్పారు. 'వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వారి అరాచకాలను అడ్డుకుని ధైర్యంగా నిలబడ్డ వ్యక్తులం. మా నాయకుడి కోసం ప్రాణాలైనా ఇస్తాం. ఏరా పేర్ని నానీ... లోకేశ్ బాబును ఏరా అంటావా' అని మండిపడ్డారు. మరోసారి అవమానకరంగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

జగన్... రాజకీయ రాబందు

» చంద్రబాబుపై ఆయన వ్యాఖ్యలు అనుచితం: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వయస్సుపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఖండించారు. గురువారం ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు ఒక వ్యక్తి కాదు... వ్యవస్థ. ఆయనపై జగన్ వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారు. నదుల అనుసంధానం, ప్రజలకు సంక్షేమ పాలన, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాత్రింబవళ్లు చంద్రబాబు కష్టపడుతుంటే... జగన్ మాత్రం శవ రాజకీయాలు చేస్తున్నారు. జగన్ పార్టీ పుట్టిందే శవాల మీద. సహజ మరణాలు సంభవించినా వాటిని జగన్ రాజకీయ హత్యలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన, ఆయన పార్టీ నేతలు రాజకీయ రాబందులుగా వ్యవహరిస్తున్నారు. దేశ రాజకీయాల్లో సీఎం చంద్రబాబుకు పెరుగుతున్న ఆదరణను జగన్ ఓర్వలేకపోతున్నారు' అని ఎంపీ ఆరోపించారు.

రోత పత్రికపై రైతుల కన్నెర్ర

» నల్లబర్లీ పొగాకు విక్రయాలపై తప్పుడు కథనాలు

» పర్చూరులో ఆందోళన.. పత్రిక ప్రతుల దహనం

» బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

పర్చూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకును కొనే దిక్కులేక ఓ రైతు ట్రాక్టర్‌తో తొక్కిస్తున్నారంటూ రోత పత్రికలో అసత్య కథనాన్ని ప్రచురించడంపై రైతులు కన్నెర్ర చేశారు. తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. బాపట్ల జిల్లా పర్చూరు బొమ్మల సెంటర్‌లో జగన్‌కు చెందిన రోతపత్రిక ప్రతులను గురువారం దహనం చేసి నిరసన తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర లేక, కంపెనీలు కొనుగోలు చేయక దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం భారీగా నిధులిచ్చి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించిందని చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో సీఎం ఔదార్యం చూపి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. రాజకీయ కుట్రలో భాగంగానే జగన్ పత్రిక తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గంలో అధిక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నూతలపాడుకు చెందిన రైతు సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను పండించిన పొగాకును గోదాములో నిల్వ ఉంచానని, పాడైన పొగాకును పొలానికి ఎరువుగా ట్రాక్టర్‌తో తొక్కిస్తున్నానని చెప్పారు. దాన్ని ఫొటో తీసి జగన్ పత్రికలో తప్పుగా వార్త రాశారని ఆరోపించారు. పార్టీలకతీతంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆదర్శ రైతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం బర్లీ రైతులు మోసపూరిత కథనాలు రాసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎస్సై జి.వి.చౌదరికి ఫిర్యాదు చేశారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న రైతులు

నీళ్లపై గొడవలొద్దు



మల్యాల పంపింగ్ స్టేషన్ ఏరియల్ వ్యూ

(మొదటి పేజీ తరువాయి)

వేద మంత్రాలతో పూజలు చేసి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. తర్వాత మూడు మోటార్లను ఆన్ చేసి హంద్రీ-నీవా కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం ప్రసంగించారు. సీమ చరిత్రను తిరగరాయాలని ఎన్టీఆర్ హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగకు శ్రీకారం చుట్టారని తెలిపారు. నదుల అనుసంధానం తన జీవితాశయమని.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తే.. రాయలసీమలో కరువనేది ఉండదన్నారు. హంద్రీ-నీవా ద్వారా నీరు 600 కిలోమీటర్లు ప్రవహించి చిత్తూరు జిల్లా కుప్పం వరకు వెళ్తుందన్నారు. దీని ద్వారా సీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు.. 33 లక్షల మందికి తాగునీరు అందుతుందని చెప్పారు. ఫేజ్-1లో కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 2,906 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలు.. మొత్తం 1,98,000 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఫేజ్-2లో అనంతపురం జిల్లాలో మరో 33,617 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాలు.. వెరసి 4,04,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. భవిష్యత్‌లో శ్రీశైలం నుంచి తిరుమల వెంకన్న వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, గౌరు చరిత, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖరరెడ్డి, గుమ్మనూరు జయరాం, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఒక్క చాన్స్ ఇస్తే..

ఒక్క చాన్స్ పేరుతో అధికారం కట్టబెడితే.. ఆ నేత అధికార దాహంతో బాదుడే బాదుడు, నరకుడే.నరుకుడు అనే విధంగా పాలన చేశారు. ఐదేళ్లలో ప్రాజెక్టులను పట్టించుకోలేదు. కనీసం రూ.2 వేలు కోట్లు కూడా ఖర్చు చేయలేదు. సీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టిన పార్టీ టీడీపీ. గత ఏడాది అధికారంలోకి రాగానే హంద్రీ-నీవాకు ఏకంగా రూ.3,890 కోట్లు కేటాయించి.. 120 రోజుల్లో పనులు పూర్తి చేశాం. మరో 15 రోజుల్లో సీమలోని అన్ని చెరువులను నీటితో నింపే బాధ్యత నాది.

రతనాలసీమగా మారుస్తాం..

రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాదు.. దానిని రతనాలసీమగా మార్చి రాష్ట్రానికే మణిహారంగా తయారుచేస్తా. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా. సీమ జిల్లాలను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తా. ఓర్వకల్లు-లేపాక్షి మధ్య ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలు తెస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌ల కోసం రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుచేసి దేశం మొత్తానికీ సరఫరా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం. కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం త్వరలోనే మొదలుపెడతాం. సీమలో ప్రతి ఎకరాకు నీరు ఇచ్చి.. కనీసం రెండు మెట్ట పంటలు వేసుకునేలా చర్యలు తీసుకుంటాం. వేదవతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి.. ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగునీరు ఇస్తాం. గోరకల్లు మరమ్మతులకు రూ.96 కోట్లు ఇస్తాం. అలగనూరు జలాశయాన్ని రూ.36 కోట్లతో పూర్తి చేస్తాం. మిట్టూరులో లిఫ్ట్ ఇరిగేషన్ కింద కలవందలపాడు, హంద్రీ-నీవా కాలువ నుంచి 19వ కిలోమీటర్‌లో ఒక లిఫ్ట్ పెడితే 6 వేల ఎకరాలు సుభిక్షమవుతాయని రైతులు చెప్పారు. దీని కోసం రూ.60 కోట్లు విడుదల చేస్తాం. ఇవన్నీ చేయాలంటే ప్రజల సహకారం ఎప్పటికీ ఉండాలి.

ఆగస్టు 20లోపు స్కూళ్లకు కొత్త టీచర్లు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్‌ను కూడా నియమించలేదు. స్కూళ్లలో టీచర్లు లేకుండానే బాగా చదువు చెప్పామంటూ గొప్పలు చెప్పి అందరినీ మోసం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 20లోపు 16,500 మంది కొత్త టీచర్లను స్కూళ్లకు పంపే బాధ్యత నాది. కేంద్రం పీఎం కిసాన్ డబ్బులు వేయగానే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాతా సుఖీభవ డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం సదుపాయం కల్పిస్తాం. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తాం. వాట్సాప్ గవర్నెన్స్‌లో త్వరలో 700కు పైగా సేవలు అందుబాటులోకి తెస్తాం.

హంద్రీనీవా కాలువకు మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి వెళ్తున్న నీటిని చూస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల తదితరులు



ఆ భూతాన్ని ఇక రానివ్వం

కూటమి ప్రభుత్వ రాకతో.. పరిశ్రమలు పెట్టడానికి ముందుకొస్తున్నారు. అయితే గతంలో ఉన్న ఆ భూతం మళ్లీ వస్తే.. తమ పరిస్థితి ఏంటని చాలా మంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. అయితే భవిష్యత్‌లో ఆ భూతం రాకుండా రాజకీయంగా భూస్థాపితం చేస్తామని వారికి హామీ ఇచ్చా. గతంలో లేని విధంగా కేజీ మామిడికి ప్రభుత్వం తరఫున రూ.4 చొప్పున ఇచ్చాం. అయితే మాజీ సీఎం చిత్తూరు వెళ్లి తన పార్టీ నేత తోట నుంచి 5 ట్రాక్టర్లలో మామిడి కాయలు తెచ్చి రోడ్లపై తొక్కించారు. ఇలాంటి వాళ్లకు రాజకీయాల్లో ఉండే అర్హత ఉందా..? అజాత శత్రువు వివేకానందరెడ్డిని హత్య చేసి, వాళ్లు చేసిన నేరాన్ని నాడు ముఖ్యమంత్రిగా ఉన్న నాపైనే నెట్టే ప్రయత్నం చేశారంటే.. సామాన్యులు ఓ లెక్కా? మరీ దారుణంగా.. ఇటీవల రౌడీషీటర్ ఇంటికి పరామర్శకు వెళ్లి హడావుడి చేశారు.

కృష్ణమ్మ పరవళ్లు

చంద్రబాబు నీటిని విడుదల చేయడంతో హంద్రీ-నీవా పొడవునా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సీమ రైతులతోపాటు కూటమి శ్రేణుల సంతోషం రెట్టింపైంది. తరలివచ్చిన రైతులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సాగునీటి సంఘాల నేతలు తదితరులతో నందికొట్కూరు కిక్కిరిసింది.

నేడూ రేపు భారీ వర్షాలు

» 23 వరకూ కొనసాగే అవకాశం



విజయవాడ బందరు రోడ్డులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో.. వాతావరణ అనిశ్చితితో.. తీవ్ర ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా గురువారమే వర్షాలు కురిశాయి. ఇవి కొనసాగి.. శుక్రవారం నుంచి 23వ తేదీ వరకూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. జార్ఖండ్, బిహార్‌లలో ఉన్న తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతోంది. దీని నుంచి విస్తరించిన రుతు పవన ద్రోణి తూర్పు బంగాళాఖాతంలోని ఈశాన్య ప్రాంతం వరకూ ఉంది. ఇంకా ఉత్తర తమిళనాడు మీదుగా తూర్పు, పడమరగా మరో ద్రోణి విస్తరించింది. వీటికి ఎండ తీవ్రత తోడు కావడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని గురువారం కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. గురువారం రాత్రికి అల్లూరి, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం నౌకాస్ట్ బులెటెన్‌లో పేర్కొంది. శుక్రవారం ఉదయానికి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనున్నది. ఉపరితల ఆవర్తనం, ద్రోణుల ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమ మేఘాలు కోస్తా, రాయలసీమపైకి వీయనున్నాయి. ఇంకా అరేబియా సముద్రంలో బలపడిన రుతుపవన మేఘాలు దక్షిణ భారతం మీదుగా రాష్ట్రంపైకి రానున్నాయి. వీటితో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 23వ తేదీ వరకూ వర్షాలు కొనసాగుతాయని అంచనా వేసింది. కాగా, గురువారం కోస్తాలో పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, నరసాపురంలలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

పిడుగులూ పడతాయి.. అప్రమత్తంగా ఉండండి

అమరావతి: రానున్న 3రోజులూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈదురుగాలులు కూడా వీచే అవకాశముందని తెలిపింది. చెట్ల కింద, ఎత్తైన స్తంభాల వద్ద ఉండొద్దని సూచించింది. గురువారం రాత్రి 7గంటల వరకు ఎన్టీఆర్ జిల్లా ఊటుకూరులో 69.2, గుంటూరు జిల్లా బేతపూడిలో 51.5, బాపట్ల జిల్లా పర్చూరులో 50.25, ఎన్టీఆర్ జిల్లా చీమలపాడులో 44.7, కోనసీమ జిల్లా నగరంలో 43, కృష్ణా జిల్లా బోడగుంటలో 42.5 మిల్లీమీటర్ల వాన పడింది.

సీమపై జగన్ విషం

» జనం ఘోరంగా ఓడించారని కక్షపెంచుకున్నారు

» బనకచర్లను అడ్డుకోవడం ద్రోహమే: మంత్రి నిమ్మల



కర్నూలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రజలు తనను ఘోరంగా ఓడించడంతో కక్ష పెంచుకున్న జగన్.. ఆ ప్రాంతంపై విషం కక్కుతున్నారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. అందుకే కరువు సీమను సస్యశ్యామలం చేసే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పోలవరం-బనకచర్ల అసాధ్యమంటున్న జగన్‌కు క్యూసెక్కు, టీఎంసీకి తేడా తెలుసా..? 1975 నుంచి 2024 వరకు గోదావరి వరద రికార్డులు పరిశీలిస్తే.. 50 ఏళ్లలో 1.53 లక్షల టీఎంసీలు సముద్రంలో కలిశాయి. అంటే ఏటా 3,150 టీఎంసీలు కడలిపాలయ్యాయి. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్‌కు ఆ మాత్రం తెలియదా..' అని నిలదీశారు. ప్రాణహిత, ఇంద్రావతి, గోదావరి వరద పోలవరం వద్ద కలుస్తోందని.. తెలంగాణతో ఏ మాత్రం సంబంధం లేకుండా శబరి, సీలేరు నదుల నుంచి ఏటా 600 టీఎంసీల నీరు గోదావరిలో కలుస్తోందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఎంతో దూరదృష్టితో గోదావరి జలాలను రాయలసీమకు తెచ్చి కరువు నేలను పచ్చని పైరుగా మార్చాలని తపిస్తుంటే.. ఈ ప్రాంతం వ్యక్తిగా, ఓ పార్టీ అధ్యక్షుడిగా సహకరించాల్సింది పోయి విషం కక్కుతారా అని జగన్‌పై విరుచుకుపడ్డారు. సొంత తల్లిని, చెల్లిని, చిన్నాన్న కూతురును బయటకు గెంటేసిన వ్యక్తికి సీమ సెంటిమెంట్ ఉంటుందని తాననుకోవడం లేదన్నారు. 2020 నాటికి హంద్రీ-నీవా విస్తరణ పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ఐదేళ్లలో గంపెడు మట్టి తీయలేదని, అర బస్తా సిమెంట్ వేయలేదని ధ్వజమెత్తారు. మళ్లీ చంద్రబాబు వచ్చాక 120 రోజుల్లో 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యాన్ని విస్తరించి ఇంజనీరింగ్ చరిత్రలోనే చెరగని రికార్డు సృష్టించారని అన్నారు. పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిన జగన్‌కు ఆ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. అంతకుముందు సీమ ప్రాజెక్టులపై సీఈలు కబీర్‌బాషా, నాగరాజు, ఇంజనీర్లతో మంత్రి సమీక్షించారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్

» సరికొత్త విధానాలు తీసుకొస్తున్నాం

» మండలస్థాయి ప్రజావేదిక ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాం

» ఆడిట్ నివేదికలు ఆన్‌లైన్‌లో: ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్

» మంగళగిరిలో ముగిసిన దక్షిణాది రాష్ట్రాల సోషల్ ఆడిట్ సదస్సు

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సోషల్ ఆడిట్‌లో పారదర్శకత పెంచేందుకు సరికొత్త విధానాలు అవలంబిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ అన్నారు. సామాజిక తనిఖీ ప్రక్రియపై 16, 17 తేదీల్లో మంగళగిరి వేదికగా తొలి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయా రాష్ట్రాల సామాజిక తనిఖీ, ఉపాధి హామీ ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి సంచాలకులు పాల్గొన్నారు. సామాజిక తనిఖీల్లో అవలంబిస్తున్న ఉత్తమ విధానాలు, తనిఖీల్లో మరింత పారదర్శకత పెంచేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై సదస్సులో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా మండలస్థాయిలో సామాజిక తనిఖీ ప్రజావేదికను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశామని తెలిపారు. గ్రామసభల కేలండర్ నుంచి మండలస్థాయి ప్రజావేదిక వరకు ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సామాజిక తనిఖీల్లో పారదర్శకత పెంచేందుకు ఈ ప్రయత్నం అని పేర్కొన్నారు. సరికొత్త ఆలోచనలు, విధానాలు పంచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని ఏపీ ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ అన్నారు. సామాజిక తనిఖీల్లోని సమస్యలు, వాటి పరిష్కారాలను కేంద్రానికి నివేదించేందుకు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. సామాజిక తనిఖీల్లో సరికొత్త విధానాలు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందు ఉంటుందని ఏపీ సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ చెప్పారు. ఉపాధి హామీ పథకంలో శ్రామికులను కలసి సామాజిక తనిఖీ సమగ్రంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తాము అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను, ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రాల ప్రతినిధులు వివరించారు. ఏపీ విధానాలను ప్రశంసించారు. ఈ సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సుష్మిత ఘటోరి, ఆశిష్ గుప్తా పాల్గొన్నారు. సామాజిక తనిఖీల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండటాన్ని వారు అభినందించారు.

శ్రీలక్ష్మి ఎన్ని వేల కోట్లు లంచమడిగారు?

» ఓఎంసీ కేసులో తెలంగాణ హైకోర్టు ప్రశ్న



హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో నిందితురాలిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి ఎన్ని వేల కోట్లు లంచమడిగారని టీ-హైకోర్టు ప్రశ్నించింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి) పిటిషన్‌పై సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ కాపాటి గురువారం వాదనలు కొనసాగించారు. ఆమె తనను కోట్ల రూపాయలు లంచంగా అడిగారని.. గనుల లీజు కోసం దరఖాస్తు చేసుకున్న ఓ దరఖాస్తుదారు పేర్కొన్నారని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్.. కోట్లాది రూపాయలు అంటే ఎన్ని వేల కోట్లు అని ప్రశ్నించారు. బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ కోసం ఉపయోగించాల్సిన ఐరన్ ఓర్‌ను విదేశాలకు ఎగుమతి చేసుకునే విధంగా 'క్యాప్టివ్' అనే పదాన్ని ఉత్తర్వుల నుంచి శ్రీలక్ష్మి ఉద్దేశపూర్వకంగా తీసేశారని శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో భారీ సామర్థ్యంతో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఓఎంసీ డైరెక్టర్లు బీసీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్ధన్‌రెడ్డి మైనింగ్ లీజు అనుమతులు పొందారని పేర్కొన్నారు. జీవోలో క్యాప్టివ్ మైనింగ్ అనే పదం లేకపోయేసరికి అక్రమంగా తవ్విన ఐరన్ ఓర్‌ను విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. శ్రీలక్ష్మి తరఫున రిప్లయ్ వాదనల కోసం తదుపరి విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

యంత్రసామగ్రి తరలింపులో బావర్ జాప్యం

» డిసెంబరుకల్లా 'వాల్' పూర్తవుతుందా.. నేడు కేంద్ర జలశక్తి కార్యదర్శి సమీక్ష

అమరావతి జూలై 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనులను లక్ష్యాల మేరకు పూర్తిచేస్తారా.. కీలకమైన డయాఫ్రం వాల్ డిసెంబరుకల్లా పూర్తవుతుందా అనే అంశాలపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబర్షి ముఖర్జీ శుక్రవారం ప్రత్యేక సమీక్ష చేయనున్నారు. ఢిల్లీలో జరిగే సమావేశంలో కేంద్ర జలసంఘం చైర్మన్, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో, వాప్కోస్ సీఎండీ, సీఎస్ఎంఆర్ఎస్ డైరెక్టర్, జలసంఘం చీఫ్ ఇంజనీర్, జలవనరుల శాఖ ఈఎన్‌సీ నరసింహమూర్తి పాల్గొంటారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి యంత్రసామగ్రిని సమకూర్చుకోవడంలో బావర్ సంస్థ వెనుకబడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యంత్రసామగ్రిని, కట్టర్‌లను 4 నెలలు ఆలస్యంగా ప్రాజెక్టు వద్దకు తీసుకొచ్చిందని.. ఈ కారణంగా 129 రోజుల పాటు పనులు ఆగిపోయాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పనుల పురోగతిపై వాప్కోస్, సీడబ్ల్యూఎంఆర్ఎస్‌ల నుంచి దేబర్షి సమాచారం సేకరిస్తారు.

టెలిమెట్రీల ఏర్పాటుతో సమస్యలు

» శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతులపై నిర్ణయం హర్షణీయం: లక్ష్మీనారాయణ

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆందోళన కలిగిస్తున్న శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్న నిర్ణయంపై రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక సమన్వయకర్త, సాగునీటి రంగ నిపుణుడు టి.లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో రెండు రాష్ట్రాల సీఎంల చర్చలను స్వాగతించారు. 'కృష్ణా నదిపై ఉమ్మడి జలాశయాల నుంచి నీటి వినియోగంలో టెలిమెట్రీ విధానాన్ని అమలు చేయాలన్న నిర్ణయం మంచిదే. అయితే ఏపీ భూభాగంలోనూ వాటిని ఏర్పాటు చేయాలన్న తెలంగాణ డిమాండ్‌తో సమస్యలు తలెత్తుతాయి' అని చెప్పారు.

'తోతాపురి' రైతులకు నిధులు మంజూరు

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 6.50 లక్షల టన్నుల తోతాపురి మామిడి రైతులకు మద్దతు ధర కింద కిలోకు రూ.4చెల్లించేందుకు ప్రభుత్వం ఉద్యానశాఖ డైరెక్టర్‌కు అనుమతి ఇచ్చింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మద్దతు ధర కోసం ప్రభుత్వం కిలోకు రూ.4చొప్పున రూ.260కోట్లు ఖర్చు చేయనున్నది. ఈ నిధులను స్వల్పకాలిక రుణాల ద్వారా సమీకరించాలని ఉద్యానశాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటివరకు 4.26 లక్షల టన్నులపైగా తోతాపురిని ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వాడకం పెంచడంపై రైతులకు అవగాహన కల్పించే పోస్టర్‌ను వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు గురువారం విడుదల చేశారు.



'ఐఎన్ఎస్ నిస్తార్' నేడు జల ప్రవేశం

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన డైవింగ్ సపోర్ట్ నౌక 'ఐఎన్ఎస్ నిస్తార్'ను శుక్రవారం తూర్పు నౌకాదళంలో ప్రారంభించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఈ నౌకను తయారు చేసింది. 120కి పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దీని నిర్మాణానికి సహకరించాయి. నిస్తార్ నౌక బరువు 10,500 టన్నులు. పొడవు 120 మీటర్లు కాగా వెడల్పు 20 మీటర్లు. సముద్రం లోపల ప్రమాదంలో పడిన సబ్‌మెరైన్లలో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం దీని ప్రధాన విధి. సబ్‌మెరైన్లలోని సిబ్బందిని అత్యవసరంగా తరలించడానికి వీటిని ఉపయోగిస్తారు.

వంశీకి సుప్రీం షాక్

(మొదటి పేజీ తరువాయి)


వచ్చింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని వంశీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. మైనింగ్ సహా అనేక కేసుల్లో వంశీ నిందితుడిగా ఉన్నారని, తమ వాదనలు వినకుండానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వంశీకి మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. కాగా, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మైనింగ్ విలువలపై సీల్డ్ కవర్‌లో నివేదికను ఏపీ ప్రభుత్వం సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏపీ ప్రభుత్వ వాదనలు వినకుండా బెయిల్ మంజూరు చేయడాన్ని తప్పుపట్టింది. తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడంలేదని తెలిపింది. పీటీ వారంట్స్ పేరిట వంశీని ఇబ్బంది పెడుతున్నారని ఆయన తరఫు న్యాయవాది చెప్పేందుకు ప్రయత్నించగా, ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. పీటీ వారంట్స్ అంశంలోకి తాము వెళ్లడం లేదని స్పష్టంచేసింది. వంశీకి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ హరినాథ్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఏపీ ప్రభుత్వ వాదనలు సమగ్రంగా విని తీర్పు ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. కాగా, వారంరోజుల్లో ఏపీ ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేస్తామని ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు. అలాగైతే.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన నాలుగు వారాల్లో విచారణ ముగించాలని హైకోర్టును ధర్మాసనం ఆదేశించింది.

మమ్మల్ని మాఫియా గ్యాంగులతో పోలుస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

అవహేళనగా మాట్లాడి.. ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, మనోభావాలను కించపరచడం జగన్‌కు తగదన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన పోలీసులే ఇప్పుడూ విధులు నిర్వహిస్తున్న విషయాన్ని మరిచిపోయి మాట్లాడడం దురదృష్టకరమన్నారు. 'వైసీపీ నేతలను అరెస్టు చేసేందుకే పోలీసు వ్యవస్థ ఉందని, తనకు రక్షణ కల్పించకుండా కుట్రలు చేస్తున్నారని సీఎంగా పనిచేసిన వ్యక్తి మాట్లాడడం సరికాదు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఆయన తెలుసుకోవాలి. పోలీసులను వీఆర్‌లో పెట్టడం గత ప్రభుత్వంలో కూడా జరిగింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం సహజం. మీ ప్రభుత్వం ఎంత మంది పోలీసు అధికారులను పక్కన పెట్టిందో గుర్తు చేసుకోండి. పోలీసులు.. ఎమ్మెల్యేలు, మంత్రులకు డబ్బులు వసూలు చేసి ఇస్తున్నారని ఆరోపించడం దుర్మార్గం. డీఐజీ స్థాయి అధికారిని మాఫియా డాన్ అంటానా? పోలీసు వ్యవస్థను నడిపే డీజీపీని టార్గెట్ చేయడమేంటి? డీజీపీ సారథ్యంలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. పోలీసుల వల్ల ఇబ్బందులు కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించండి' అని హితవు పలికారు. నిబంధనల మేరకు జగన్‌కు భద్రత కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్ వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికి, డీజీపీకి ఆపాదించడం సరైంది కాదన్నారు. పలు సినిమాల్లో పోలీసులను విలన్లుగా చూపిస్తున్నారని, దీనిపై న్యాయస్థానాల్లో కేసులు వేయాలని భావిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు చెక్!



(మొదటి పేజీ తరువాయి)

ఇందులో నియమించినట్టు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. మంగళగిరిలోని పోలీస్ టెక్ టవర్ కేంద్రంగా పనిచేయనున్నారు. ఐజీ నేతృత్వంలో సైబర్ ఎస్పీ, ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 12మంది ఎస్ఐలతోపాటు ప్రతి జిల్లానుంచి బీటెక్ చేసిన పోలీసుల్ని సైబర్ కమెండోలుగా ఎంపిక చేశారు. అత్యంత అధునాతన సైబర్ టూల్స్‌తో నేరగాళ్లకు ఉచ్చు బిగించనున్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతి లాంటి చోట్ల సైబర్ కేసులు నమోదవుతున్నాయి. అచ్యుతాపురం, సామర్లకోట ఘటనలతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రత్యేక సైబర్ వింగ్ ఏర్పాటుకు నాందిపడింది. జిల్లాకో సైబర్ సెల్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్ మోసాల కట్టడికి చర్యలు తీసుకోవాలనుకున్న డీజీపీ గుప్తా.. రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' (గంజాయి కట్టడి టీమ్) తరహాలో సైబర్‌వింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు.

అచ్యుతాపురం, సామర్లకోటలో...

రెండునెలల క్రితం హోంశాఖ మంత్రి సొంత జిల్లా అనకాపల్లిలోని అచ్యుతాపురంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి అమెరికాలో ఉన్న వ్యక్తులను మోసం చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతను ఇక్కడికి తీసుకొచ్చి పలు దేశాల భాషలు నేర్పించి, ఎలా మాట్లాడాలో శిక్షణ ఇచ్చి, రోజూ వందల మందితో నేరాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ప్రతినెలా 15కోట్ల నుంచి 20 కోట్ల వరకూ దోచేస్తున్న ఈ కేటుగాళ్ల ముఠాకు దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఉందని అనకాపల్లి ఎస్పీ పోలీసు ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే నెల క్రితం కాకినాడలో మ్యూల్ ఖాతాల బాగోతం వెలుగులోకి వచ్చింది. సామర్లకోటకు చెందిన పట్టాభిరామ్ దుబాయ్‌కి వెళ్లి అక్కడినుంచి మోసాలకు పాల్పడుతున్నాడు. కాకినాడకు చెందిన ఉదయ్ కిరణ్‌తో మాట్లాడి పలువురికి ఆశ పెట్టి బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. సైబర్ నేరాలతో దోచుకున్న డబ్బును ఆ ఖాతాల్లోకి మళ్లించి నగదు డ్రా చేసుకునేందుకు గాను, ఒక్కో ఖాతాదారుడికి రూ.30వేల వరకూ చెల్లించేలా మాట్లాడుకున్నాడు. ఈ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు 48మ్యూల్ ఖాతాల ద్వారా 8.80 కోట్ల అనుమానిత లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

సైబర్ నేరాలకు అడ్డాగా...

దేశంలో 81 శాతం సైబర్ మోసాలకు నాలుగు రాష్ట్రాల్లోని 10 జిల్లాలు అడ్డాగా మారాయి. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్, జాంతారా, బొకారో, కర్మటాండ్, గిరిధ్ ఈ జాబితాలో ఉన్నాయి. దేశంలోనే అత్యధికంగా సైబర్ మోసగాళ్లు ఉన్న జార్ఖండ్‌లోని ఈ ఐదు ప్రాంతాల నుంచే 26.6 శాతం మోసాలు జరుగుతున్నాయి. ఇక సైబర్ మోసాల్లో రాజస్థాన్‌లోని భరత్‌పూర్, ఆల్వార్ నుంచి 23.1 శాతం, హరియాణాలోని నుహ్, గురుగ్రామ్ నుంచి 19.1 శాతం, ఉత్తరప్రదేశ్‌లోని మధుర నుంచి 12 శాతం జరుగుతున్నాయి. దేశంలో సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భరత్‌పూర్ అగ్రస్థానంలో ఉండగా, మధుర, నుహ్ ఆ తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు దక్షిణాది నగరాలు, వ్యక్తులను టార్గెట్ చేస్తున్నారు. దేశంలో సైబర్ బాధితుల నగరాల్లో బెంగళూరు (20 శాతం) మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. టాప్-10 నగరాల్లో చెన్నై కూడా ఉంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం చిత్తూరు జిల్లాలో కూడా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మరోవైపు విశాఖపట్నం లాంటి నగరాల్లోనూ సైబర్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తమైంది.

ఏపీలో సైబర్ నేరాలు

సంవత్సరం	ఫిర్యాదులు	ఎఫ్ఐఆర్‌లు	దోచిన సొమ్ము (రూ.కోట్లలో)	సీజైన డబ్బు (రూ.కోట్లలో)
2021	10,423	2,035	34.04	2.03
2022	25,923	2,874	117.53	8.96
2023	41,792	2,360	378.60	49.98
2024	66,507	2,853	974.12	122.94

తెలుగు సీఎంల సొంత జిల్లాల్లో..

తెలుగు రాష్ట్రాల్లో సైబర్ బాధితులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, చిత్తూరు జిల్లాలు నిలిచాయి. ఈ రెండు జిల్లాలు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సొంత జిల్లాలు. ఇక ఏపీలో గత నాలుగేళ్లుగా సైబర్ నేరాల బాధితుల సంఖ్య పెరుగుతోంది. సంఖ్య ఏటా రెట్టింపు అవుతోంది. ఓ సర్వే అంచనా ప్రకారం.. 2025లో ఏపీలో సైబర్ నేరాలు 75 శాతం పెరిగి 1500 కోట్లు దోచే అవకాశం ఉందని హెచ్చరించింది.

నేరాలు పెరగడానికి కారణాలు..

నిందితుల్లో మైనర్లు ఎక్కువగా ఉండటం, బెయిల్ సులభంగా లభించడం, అంతరాష్ట్ర ముఠాల ఆటకట్టించే వ్యవస్థ లేకపోవడంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అత్యంత సహజంగా కనిపించేందుకు ఏఐ టూల్స్‌తో ఫిషింగ్ డొమెయిన్లు సృష్టించే అవకాశంఉంది. ఆర్థిక లావాదేవీలు, షేర్ మార్కెట్లో లాభాల ఆశ చూపుతూ గేలం వేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యాపారాల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపు వరకూ ఏ అవకాశాన్నీ వదలట్లేదు.

ఎన్నెన్నో మోసాలు..

ఏటా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు అధికారుల పేరు చెప్పి 'బ్యాంకు నుంచి మాట్లాడుతున్నా.. ఓటీపీ చెప్పండి'.. 'విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయాలి'.. ఇలా రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. చివరకు డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరింపులకు దిగుతున్నారు. రాష్ట్రంలో ఇటీవల 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో పడ్డ డబ్బులు దోచేసేందుకు సైబర్ నేరగాళ్లు వేసిన ఎత్తుగడ పోలీసు శాఖను ఉలిక్కి పడేలా చేసింది. ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరుకు చెందిన ఒక మహిళకు ఫోన్ చేసి.. 'మీ అకౌంట్‌ను యాక్టివేట్ చేసుకోండి.. గత ప్రభుత్వం ఒక ఏడాది ఆపేసిన అమ్మ ఒడి డబ్బులు కూడా అకౌంట్లో వేస్తాం' అంటూ మభ్యపెట్టారు. ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న 20 వేలు కాజేశారు. 'మీరు కరెంటు బిల్లు చెల్లించలేదు.. రాత్రి 9 గంటలకు కనెక్షన్ కట్ చేస్తాం' అంటూ ఓ జిల్లా స్థాయి అధికారికి ఓ నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. నిజమేనని భావించిన ఆయన ఉదయాన్నే చెల్లిస్తానని చెప్పేందుకు ఆ నంబర్‌కు తిరిగి కాల్ చేశారు. 'ప్రస్తుతానికి 20 రూపాయలు పంపండి.. ఏదో చెల్లించినట్లు ఉంటుంది' అని చెప్పడంతో.. 20 రూపాయలు చెల్లిస్తే ఏమౌతుందని భావించి పంపారు. అంతే.. ఆ అధికారి ఫోన్‌లోని స్క్రీన్ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లింది. ఆయన బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తంతో పాటు క్రెడిట్ కార్డును కూడా వాడేసి తెల్లారేలోపు 1.80 లక్షలు కాజేశారు.

దేవుడి సాక్షిగా చెప్తున్నా.. రాయుడు హత్యకు నాకు ఎలాంటి సంబంధం లేదు

» శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌చార్జి కోటా వినూత వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసులు అలియస్ రాయుడు హత్య కేసుపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తొలిసారిగా తిరుమలలో స్పందించారు. 'ఈ విషయంపై ఎక్కువ మాట్లాడదలచుకోలేదు కానీ, మొదటిసారి స్పందిస్తున్నా. గుళ్లో ఉన్నాం. నాకూ కుటుంబం.. ఇద్దరు బిడ్డలు ఉన్నారు. దేవుడి సాక్షిగా, నా కుటుంబం సాక్షిగా చెప్తున్నా. నాకు.. రాయుడి హత్యతో ఎటువంటి సంబంధం లేదు' అని చెప్పారు. తిరుమల శ్రీవారిని గురువారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. రాజకీయ కోణంలో తనపై ఆరోపణలు చేస్తున్నారని, వైసీపీ అనవసరంగా తనను ఈ వ్యవహారంలోకి లాగి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందన్నారు. దేవుడి సన్నిధిలో ఉండి చెప్తున్నానని, తనకు ఆ హత్యతో ఎటువంటి సంబంధం లేదని మరోమారు స్పష్టం చేశారు. కాగా, శ్రీనివాసులు హత్య కేసులో నిందితురాలిగా ఉన్న వినూత దంపతులు ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ఇదంతా సుధీర్‌రెడ్డి కుట్రేనని ఆరోపించిన విషయం తెలిసిందే.

దుబాయ్ బంధం నిజమే

(మొదటి పేజీ తరువాయి)

డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థకు లీజుకిచ్చామని, ఆ సంస్థ ఎవరికి అద్దెకిచ్చిందో తమకు తెలియదని శ్రవణ్‌రావు తరఫున ఐన్యూస్ యాజమాన్యం ఇచ్చిన ప్రకటన అవాస్తవమని తేలింది. యజమాని కోటా కింద శ్రవణ్‌రావే కొంతకాలం తీసుకుని, లిక్కర్ స్కామ్ నిందితులకు ఇచ్చారని.. స్వయంగా ఆయన కూడా వారితో కలిసి ఉన్నారని సిట్‌కు పక్కాగా ఆధారాలు లభించాయని విశ్వసనీయ సమాచారం.

సెక్యూరిటీ రిజిస్టర్ వివరాలతో..

దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్స్ అండ్ రెసిడెన్సెస్‌లో 35వ అంతస్తు వరకు హోటల్ ఉండగా, ఆపై అంతస్తుల్లో నివాస ఫ్లాట్లు ఉన్నాయి. అందులో 5801 నంబర్ ఫ్లాట్ శ్రవణ్‌రావుకు సంబంధించింది. దీనిని రెంటల్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం ఏడాదిలో ఒక నెల పాటు యజమాని ఆ ఫ్లాట్‌ను ఉచితంగా వాడుకోవచ్చు. అంతకు మించితే నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు రెండు నెలల పాటు ఫ్లాట్‌ను ఉపయోగించుకున్న శ్రవణ్‌రావు ఒక నెల ఉచితంగా, మరో నెల కేవలం నిర్వహణ ఖర్చులు చెల్లించినట్టు తేలింది. టవర్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం.. యజమానులు సహా ఎవరు ఫ్లాట్‌లోకి వెళ్లాలన్నా ఆధారపూర్వక వివరాలు ఇవ్వాల్సిందే. ఆ వివరాల మేరకు ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు శ్రవణ్‌రావు, చాణక్య, మరో నలుగురు ఫ్లాట్‌లోనే ఉన్నారని తేలినట్టు సమాచారం. శ్రవణ్‌రావు అక్కడున్న కాలంలో నిక్కరు (షార్ట్) వేసుకుని చక్కర్లు కొట్టారని, సీసీ కెమెరా ఫుటేజీలో ఆయనను శ్రవణ్‌రావుగా సెక్యూరిటీ సిబ్బంది ధ్రువీకరించినట్టు తెలిసింది. లిక్కర్ స్కామ్ కీలక నిందితులు ఉండటంతో ఈ అంశంపై ఏపీ సిట్ మరింత దృష్టి పెట్టింది. నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలిస్తే మరిన్ని వివరాలు బయటికి వస్తాయని భావిస్తోంది.

ఫ్లాట్ భాగస్వామిని ఇబ్బందిపెట్టిన శ్రవణ్‌రావు

వాస్తవానికి శ్రవణ్‌రావు ఆ ఫ్లాట్‌కు పూర్తి యజమాని కాదు. భాగస్వామి ఉన్నారు. ఆ భాగస్వామిని కూడా శ్రవణ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఆకర్ష్ కృష్ణ దుబాయ్‌లో పెట్టుబడి కింద ఓ ఫ్లాట్ కొనుగోలు చేయాలని భావించారు. ఆకర్ష్‌తో పరిచయమున్న శ్రవణ్‌రావు ఫ్లాట్ కొనుగోలులో భాగస్వామ్యం వహించేందుకు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో ఆకర్ష్, శ్రవణ్‌రావు కలిసి 2 మిలియన్ దిర్హామ్‌లు (సుమారు రూ.4.7 కోట్లు) పెట్టి 2023 ఫిబ్రవరి 15న ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఆకర్ష్ భార్య కావ్య, శ్రవణ్‌రావు భార్య స్వాతి పేరిట చెరో సగం సమాన వాటాతో రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత శ్రవణ్‌రావు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. అది ఉమ్మడి ఆస్తి అయినా కూడా భాగస్వామికి తెలియకుండా ఫ్లాట్‌ను డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థకు లీజుకు ఇచ్చారు. కనీసం అద్దెలో వాటాను కూడా ఆకర్ష్, ఆయన భార్యకు ఇవ్వలేదు. వారు ఫోన్ చేసినా శ్రవణ్‌రావు, స్వాతిరావు స్పందించలేదు. దీనితో ఆకర్ష్, కావ్య కలిసి స్వాతిరావుకు ఈ-మెయిల్ చేశారు. తమకు రావాల్సిన అద్దె వాటా చెల్లించాలని, లేదంటే ఫ్లాట్ అమ్మేసి ఎవరి వాటా వారు తీసుకుందామని కోరారు. అయినా స్పందన రాకపోవడంతో డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థ ప్రతినిధులను కలిసి.. ఫ్లాట్‌లో తమ భాగస్వామ్య పత్రాలను చూపారు, అద్దెలో తమకు రావాల్సిన వాటా గురించి చర్చించారు.

ఆకర్ష్ కృష్ణకు ఏపీ సిట్ నోటీసులు

ఏపీ లిక్కర్ స్కామ్‌తో దుబాయ్ ఫ్లాట్‌కు లింకులు ఉన్న నేపథ్యంలో.. ఫ్లాట్ భాగస్వామిగా ఉన్న ఆకర్ష్ కృష్ణ, ఆయన భార్య కావ్యకు ఏపీ సిట్ అధికారులు గురువారం నోటీసులు ఇచ్చారు. ఈ నెల 22న విచారణకు హాజరై సమాచారం అందించాలని కోరారు. దుబాయ్ ఫ్లాట్ విషయంలో శ్రవణ్‌రావు నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్న ఆకర్ష్.. సిట్ విచారణకు హాజరై వివరాలు వెల్లడించడంతోపాటు తమ వద్ద ఉన్న ఆధారాల్ని అందించనున్నారు.

వైసీపీ నేత పేర్ని నానికి దక్కని ఊరట

» అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరణ



అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో ఊరట లభించలేదు. పామర్రు ఠాణాలో నమోదైన కేసులో అరెస్ట్‌తో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోకుండా పోలీసులను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న నాని తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేసుకి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను జూలై 22కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి గురువారం ఉత్తర్వులిచ్చారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, పేర్ని నాని తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు.

పీఎస్ఆర్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

» రఘురామకు కస్టోడియల్ టార్చర్‌పై సుప్రీంకోర్టు సైతం ఆందోళన: హైకోర్టులో సిద్ధార్థ్ లూథ్రా



అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురిచేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదన్నారు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది నగేష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... కేసు నమోదు చేసి చాలా కాలమైందన్నారు. రఘురామను చిత్రహింసలకు గురి చేశారనేది ఆరోపణ మాత్రమేనని అన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. పూర్తి స్థాయి వాదనలు వినిపించేందుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు సింగిల్ జడ్జి... అనారోగ్య కారణాలతో పిటిషనర్ మధ్యంతర బెయిల్‌పై ఉన్నారని గుర్తుచేశారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

చెవిరెడ్డి పిటిషన్‌పై విచారణ 21కి వాయిదా



విజయవాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైల్లో ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన మెడికల్ పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు 21వ తేదీకి వాయిదా వేసింది. తనకు వెన్నెముక నొప్పి ఉందని, తిరుపతిలోని స్విమ్స్‌లో ఫిజియోథెరపి చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు వాయిదా వేశారు. మద్యం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న పైలా దిలీప్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సిట్ పోలీసులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

ద్వారంపూడి దర్జా

» రూ.13.84కోట్ల ప్రభుత్వ ధనానికి 'నీళ్లు'

» కాకినాడలో అడ్డగోలుగా నీళ్ల వ్యాపారం

» చార్జీలు కట్టకుండా 11 ఏళ్లుగా ఎగవేత

» కాకినాడ పోర్టు, ఓడలకు నీళ్లు విక్రయిస్తూ రూ.కోట్లలో ఆర్జిస్తున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)



వైసీపీ ప్రభుత్వంలో సీఎం తర్వాత సీఎంలా గోదావరి జిల్లాలో చెలరేగిపోయిన కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇప్పటికీ తన తీరుతో అధికారులకు 'నీళ్లు' తాగిస్తున్నారు. గనులు, గ్రావెల్, ఇసుక ఒకటేంటి ఎక్కడపడితే అక్కడ వాలిపోయి ఆనాడు రూ.కోట్లలో వెనకేసుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే అడ్డగోలు వ్యవహారం మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. కాకినాడలో ద్వారంపూడి చాన్నాళ్లుగా నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. కాకినాడ పోర్టు, పోర్టుకు వచ్చే నౌకలకు నీళ్లు విక్రయిస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. కానీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన నీటి బకాయిలు మాత్రం కట్టడం లేదు. పదకొండేళ్ల నుంచీ ఎగవేస్తుండటంతో ఇప్పుడు ఆ బకాయి రూ.13.84కోట్లకు చేరింది. కాకినాడ నగరాన్ని ఆనుకుని ఎరువుల కర్మాగారం, ఆయిల్ ఫ్యాక్టరీలు, కాకినాడ సీ పోర్టు ఉన్నాయి. వీటికి నిత్యం పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అవసరం. బాయిలర్ల కూలింగ్ దగ్గర నుంచి గ్రీన్ బెల్ట్ నిర్వహణ, ఉద్యోగులు, కార్మికుల అవసరాలకు నీళ్లు కావాలి. కాకినాడ సీపోర్టులో కార్గో ఎగుమతి దిగుమతుల సందర్భంగా పనిచేసే కార్మికులకు, లోపలకు లారీలు వెళ్లి వచ్చే సమయంలో రేగే ధూళి నియంత్రణ, నిత్యం వచ్చిపోయే నౌకల్లో వివిధ అవసరాలకు నీళ్లు పెద్దఎత్తున అవసరం. ఈ నేపథ్యంలో పారిశ్రామిక, ఓడరేవు అవసరాలు తీర్చేలా జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం నీటిపారుదల శాఖ ద్వారా గోదావరి నీటిని వివిధ ప్రైవేటు సంస్థలకు పైపులైన్ల ద్వారా కేటాయిస్తోంది. ఈ సంస్థలు నీటిని తీసుకుని వివిధ పరిశ్రమలకు విక్రయించుకుంటాయి. నీటి సరఫరా చేసినందుకు ఈ సంస్థల నుంచి నామమాత్రపు చార్జీలను ప్రభుత్వం వసూలు చేస్తోంది. ద్వారంపూడి తన తనయ అంజని పేరుతో గోదావరి నీటిని ఎప్పటినుంచో తీసుకుంటున్నారు. అంజనీ ఏజెన్సీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో నిత్యం 0.25ఎంజీడీ నీటిని పైపులైన్ల ద్వారా తీసుకుంటున్నారు. ఈ నీటిని కాకినాడ పోర్టుకు సమీపంలోని శ్రీ విద్యా కాలనీలో శుద్ధి చేస్తున్నారు. ఇందుకోసం నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని ద్వారంపూడి కాకినాడ సీపోర్టు, అందులోకి వచ్చే నౌకలకు విక్రయిస్తున్నారు.

నోటీసులు ఇచ్చినా..

ద్వారంపూడి కంపెనీ తరహాలోనే నీళ్ల వ్యాపారం చేస్తున్న తక్కిన కంపెనీలు దాదాపుగా బాకీలు చెల్లిస్తున్నాయి. నాగార్జున ఎరువుల కర్మాగారం ప్రభుత్వానికి రూ.1.47కోట్లు బాకీ ఉంది. నోటీసులు జారీ చేయడంతో బాకీలు చెల్లించడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. కానీ సదరు ద్వారంపూడి మాత్రం తననెవరూ ఏం చేయలేరనే ధీమాతో వ్యవహరిస్తున్నారు. ఇటీవల అధికారులు నీటి చార్జీల ఎగవేత గుర్తించి తక్షణం బాకీలు చెల్లించాలని గత నెల 27న నోటీసులు జారీ చేశారు. ద్వారంపూడికి 14రోజులు గడువు ఇచ్చారు. ఈ గడువు ఇప్పటికే ముగిసిపోయింది. కానీ ద్వారంపూడి కంపెనీ నుంచి మాత్రం చలనం లేదు. ఇది లాఉంటే బాకీలు చెల్లించని నేపథ్యంలో ఈ కంపెనీకి గోదావరి ముడి నీటి సరఫరా నిలిపివేయాల్సి ఉన్నా కనీసం ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

యథేచ్ఛగా నీళ్ల దందా..

ప్రభుత్వం నుంచి ద్వారంపూడి కంపెనీ నీటిని లీటరు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తోంది. అదే నీటిని శుద్ధి చేసి రూ.30 చొప్పున పోర్టు, నౌకలు, వివిధ పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఇలా సరఫరా చేసినందుకు ఎప్పటికప్పుడు ఆయా కంపెనీల నుంచి ఠంచనుగా తమకు రావాల్సిన డబ్బులను వసూలు చేస్తూ ద్వారంపూడి ఏటా కోట్లలో సంపాదిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న గోదావరి నీటికి మాత్రం అసలు చార్జీలే చెల్లించడం లేదు. 2014, ఏప్రిల్ 18 నుంచి 2025, మే 31 వరకు ఒక్క పైసా కూడా ప్రభుత్వానికి కట్టకుండా నీళ్ల దందా కొనసాగిస్తున్నారు. ఏడాదికి రూ.1.24కోట్ల చొప్పున 11ఏళ్లపాటు ద్వారంపూడి కంపెనీ చెల్లించాల్సిన బాకీలు పేరుకుపోయాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.